మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

బంగ్లాదేశ్ రాజకీయాలలో ట్రంప్ ప్రకంపనలు

అన్ని జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్లు

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

లోపలి పేజీల్లో

సంపుటి 07, సంచిక: 342 | బుధవారం | 13-11-2024 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురు

మాజీ ఎంఎల్ఎలకు నోటీసులు

ఇప్పటికే నకిరేకల్ మాజీ ఎంఎల్ఎకు జారీ

తాజాగా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్ నేతలకు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులు వేగం పెంచారు. తాజాగా మరో నలుగురు బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎలకు మంగళవారం దర్యాప్తు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే నకిరేకల్ మాజీ ఎంఎల్ఎ చిరుమర్తి లింగయ్యకు నోటీసులు జారీ అయ్యాయి. దీంతో మొత్తం ఐదుగురు మాజీఎంఎల్ఎలకు నోటీసులు జారీ అయ్యాయి. తాజాగా నోటీసులు జారీ అయిన వారిలో నల్లగొండ, మహబూబ్‌నగర్‌కు చెందిన తరువాయి 2లో

ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో

తీర్పు రిజర్వు

హైదరాబాద్ : పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో హైకోర్టులో మంగళవారం విచారణ ముగిసింది. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌పై వాదనలు విన్న సిజె ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. బిఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది మోహన్‌రావు వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదన్నారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణ అర్హత లేదన్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇరు వైపులా వాదనలు విని.. విచారణ ముగిస్తున్నట్టు ప్రకటించిన సిజె ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. తరువాయి 2లో

రాష్ట్రంలో కొత్తగా నాలుగు

డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్

నకిలీ ఔషధాల తయారీదారులపై కఠిన చర్యలు

కలెక్టరేట్‌లలో ఫిర్యాదుల విభాగం

ఆకస్మిక తనిఖీల కోసం స్టేట్ విజిలెన్స్ టీమ్ : మంత్రి దామోదర రాజనర్సింహ్మ

ప్రజాపక్షం/హైదరాబాద్

నాసిరకం, నకిలీ ఔషధాలను తయారు చేసే, వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డిసిఎ) అధికారులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ్మ ఆదేశించారు. ఔషధాలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, ఆకస్మిక తనిఖీల తరువాయి 2లో

మండుతున్న కూరగాయల ధరలతో

గరిష్టస్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం గతనెలలో భారీగా పెరిగింది. గడచిన 14 నెలల్లో ఎన్నడూలేనంత గరిష్ఠ స్థాయికి ఈ ద్రవ్యోల్బణం పెరిగింది. కూరగాయల ధరలు భారీగా పెరగడమే దీనికి ప్రధాన కారణం. 2024 అక్టోబరునెలలో ఆహార ద్రవ్యోల్బణం విపరీతంగా పెరగడానికి కారణం కూరగాయల ద్రవ్యోల్బణంవల్లనేనని, పండ్లు, నూనెలు, ఇతర కొవ్వు పదార్థాల ధరల పెరుగుదలే కారణమని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలియజేసింది. ఐసిఆర్ఎ ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ సమాచారం ప్రకారం, తరువాయి 12లో

లగచర్ల వెనుక బిఆర్ఎస్!

గ్రామంలో భారీగా పోలీసు బలగాల మోహరింపు

16 మంది అరెస్టు; పోలీసుల అదుపులో మరో 57 మంది

కీలక సూత్రదారి సురేశ్ అని ఐజి వెల్లడి

ప్రజాపక్షం / కొడంగల్

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో సోమవారం కలెక్టర్ సహా అధికారులు, వారి కార్లపై దాడి చేసిన ఘటనకు సంబంధించి ఇప్పటివరకు 16 మందిని అరెస్టు చేయగా, మరో 57 మంది అదుపులో ఉన్నట్లు ఐజి సత్యనారాయణ తెలిపారు. ఈ ఘటనలో బిఆర్ఎస్ నేతగా చెబుతున్న సురేశ్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఐజి చెప్పారు. ఫార్మా కంపెనీ భూసేకరణ నిమిత్తం ప్రజాభిప్రాయ సేకరణ కోసం సోమవారం ఉదయం దుద్యాల మండల పరిధి లగచర్ల గ్రామానికి వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, 'కడ' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై భూబాధితులైన రైతులు కొందరు దాడులు చేసి కార్లను ధ్వంసం చేసిన ఆకస్మిక ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. రైతుల దాడిలో జిల్లా కలెక్టర్ సైతం ప్రాణాలను సైతం గుప్పిట్లో పెట్టుకుని అక్కడ నుంచి శరవేగంగా నిష్క్రమించిన విషయం సంచలనం సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో స్పందించిన పోలీసులు అర్ధరాత్రి దాదాపు 500 మంది ప్రత్యేక బలగాలతో గ్రామానికి చెరుకున్నారు. నిందితులను దొరికిన వారిని దొరికినట్లు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. లగచర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ సురేష్‌రాజ్ సమావేశస్థలి వద్ద కలెక్టర్‌కు మాయ మాటలు చెప్పి అక్కడి నుంచి గ్రామానికి వెళ్లేలా పథకం రూపొందించారని పోలీసులు తెలిపారు. కొంతమంది కుట్ర పూరితంగానే రైతుల ముసుగులో దాడులు చేయడం జరిగిందన్నారు. అధికారులపై దాడులకు ప్రేరేపించిన సురేష్‌రాజ్‌పై పోలీసులు కేసులు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సురేష్‌రాజ్ తరువాయి 2లో

పథకం ప్రకారమే కలెక్టర్‌పై దాడి

మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

వికారాబాద్ జిల్లా లగచర్లలో పక్కా ప్లాన్ ప్రకారమే కలెక్టర్‌పై దాడి జరిగిందని, రౌడీయిజంతో ప్రభుత్వం అధికారులను బెదిరించాలని చూస్తే ప్రభుత్వం ఉరుకోబోదని, ఈ ఘటన వెనుక ఎవరున్నా వదిలే ప్రసక్తేలేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. ఈ దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని, దాడికి సంబంధించి గత తరువాయి 2లో

ఎసిబి అనగానే..

ఢిల్లీకి వెళ్లిన కెటిఆర్

ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నెదర్లాండ్స్ రాయబారి మరిసా గెర్ర్డ్స్

మొబైల్ కంపెనీలకు డాటా ఇచ్చి, కులగణనకు ఎందుకివ్వరు?

- బిఆర్ఎస్, బిజెపిలు తోబుట్టువులు
- గవర్నర్ వద్ద 15 రోజులుగా కెటిఆర్ ఫైలు పెండింగ్
- ఆయన ఢిల్లీ రాగానే గవర్నర్‌ను కూడా పిలిపిస్తున్నారట
- మోదీ లీగల్లీ కన్వర్టెడ్ ఒబిసి
- ఢిల్లీలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 'అడ్డా' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ : 'బిజెపి, బిఆర్ఎస్‌ల మధ్య నేను తేడా చూడను. రెండూ తోబుట్టువులే. కెటిఆర్ ఢిల్లీకి వచ్చి రెండు రోజులైంది. మేము ఆయనకు వ్యతిరేకంగా ఏసిబి కేసులో విచారణకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరాము. అది పెండింగ్‌లో ఉంది. కెటిఆర్ ఇక్కడకు వచ్చి కూర్చున్నారు. గవర్నర్‌ను కూడా ఇక్కడికి పిలిచినట్లు వింటున్నాం. కెసిఆర్ కుటుంబానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం ఏ అడుగు వేసినా ఆటంకం కలుగుతుంది. ఎసిబి కేసులో విచారించాలంటే 17 ఎ కింద గవర్నర్ అనుమతి కావాలి. ఆ ఫైలు గవర్నర్ వద్ద 15 రోజులుగా పెండింగ్‌లో ఉంది. ఇవన్నీ మనం అర్థం చేసుకోవాల'ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మహారాష్ట్రలో పోటీ చేసేందుకు టిఆర్ఎస్‌ను జాతీయ పార్టీ బిఆర్ఎస్‌గా కెసిఆర్ మార్చారని, మరి ఇప్పుడు మహారాష్ట్ర ఎన్నికలలో ఆ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. నిజంగా మోదీకి కెసిఆర్ వ్యతిరేకమైతే మోదీని ఓడించండి అని పిలుపునివొచ్చు కదా? అని అన్నారు. తన కారణంగా కాంగ్రెస్ పార్టీ అంటే వ్యతిరేకత ఉండొచ్చు కానీ, తెలంగాణకు, టిఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన శరద్‌పవార్ ఎన్సిపి పార్టీనైనా గెలిపించండి అని మహారాష్ట్రలో కెసిఆర్ ప్రచారం చేయవచ్చు కదా అని అన్నారు. ఇవన్నీ పరిశీలిస్తే ఆ రెండు పార్టీల బంధం సులువుగా అర్థమవుతోందన్నారు. ప్రతీ సందర్భంలో బిఆర్ఎస్ బిజెపి నుంచి ప్రత్యక్షంగానో తరువాయి 2లో

తొలిదశ పోలింగ్‌కు

సర్వం సిద్ధం

జార్ఖండ్ తొలి విడతలో 43 సీట్లు, 638 మంది అభ్యర్థులు

1.37 కోట్ల మంది ఓటర్లు

రాంచి : జార్ఖండ్ తొలివిడత శాసనసభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలు ఉండగా 43 నియోజకవర్గాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది. ఓటింగ్ కోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించింది. ఇవిఎంలు, వివిప్యాట్లు తీసుకొని పోలింగ్ సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లారు. మొత్తం 683మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో 609మంది పురుషులు కాగా, 73 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. 43 నియోజకవర్గాల్లో జనరల్ అభ్యర్థులకు 17, ఎస్‌టిలకు 20, ఎస్‌సిలకు 6 స్థానాలు రిజర్వ్‌డ్‌గా ఉన్నాయి. ఈ విడతలో 1.37 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారికోసం 15,344 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. అందులో 12,716 పోలింగ్ కేంద్రాలు గ్రామీణప్రాంతాల్లో, 2,628 కేంద్రాలు పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. తొలివిడత పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. సమస్యాత్మకంగా గుర్తించిన 950 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక రూ.179.14 కోట్ల విలువైన అక్రమ సామగ్రి, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి 54 కేసులు కూడా నమోదయ్యాయి.

పోటాపోటీ! : ఇండియా కూటమి, ఎన్‌డిఎ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇండియా కూటమి తరఫున మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, జెఎంఎం అధినేత హేమంత్ సోరెన్, ఆయన సతీమణి కల్పన ప్రచారం నిర్వహించారు. గిరిజన హక్కులతో సహా, ప్రజాకర్షక పథకాలను వారు తమ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించారు. ఎన్‌డిఎ తరువాయి 2లో

కులగణనను వివాదాస్పదం చేయొద్దు

- ఆర్థిక, రాజకీయ సమానత్వం కలిగేలా కులగణన ఉండాలి
- వికారాబాద్ కలెక్టర్‌పై దాడి సరైంది కాదు
- రైతుల బాధను, వారి ఆవేదనను ప్రభుత్వం అర్థంచేసుకోవాలి
- మహారాష్ట్ర, జార్ఖండ్‌లో బిజెపి గెలిస్తే జమిలి ఎన్నికలకు మోదీ సిద్ధం
- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్

మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే ప్రధాని మోదీ జమిలి ఎన్నికలకు సిద్ధమవుతారని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. జమిలి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమని, జమిలి ఎన్నికలు జరిగితే అనర్థాలకు దారితీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే రీతిలో మోదీ, అమిత్ షా రాజకీయాలు చేస్తున్నారని, వారు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్‌షా కేంద్ర మంత్రి అయిన తర్వాతనే నేరపూరిత రాజకీయాలకు ప్రత్యక్షంగా ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు. కులగణన మంచి కార్యక్రమమని, అనవసరమైన ప్రశ్నలతో దీనిని వివాదాస్పదం చేసుకోవద్దని నారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్‌లోని తరువాయి 2లో

14న రౌండ్‌టేబుల్ సమావేశం

మూసీ, హైడ్రా విషయంలో ఈనెల 14న మేధావులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో అన్ని అంశాలను చర్చించి, సిఎం రేవంత్‌రెడ్డికి సమగ్రంగా లేఖ రాయనున్నట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు. పేదలకు ఎటువంటి న్యాయం జరగాలని, ఎలా స్పందించాలనే అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు.

వరుస ఘటనలపై సమగ్ర విచారణ : కూనంనేని

బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రాజకీయ కుట్రను అనుసరిస్తున్నట్లు కనిపిస్తున్నదని, పేదల భుజాలపై తుపాకులు పెట్టి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కాల్చేందుకు ప్రయత్నిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రంలో వివిధ మతాల ప్రార్థనా స్థలాలపై జరుగుతున్న వరుస ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వరుస ఘటనల వెనకాల ఒక శక్తి ఉన్నదా? లేదా ఒక వ్యక్తి ఉన్నాడా? రాజకీయ పార్టీ ఉందా? అనే విషయాలు తేలాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కెటిఆర్‌కు రక్షణ కవచం కావాలని, అందుకే ఆయనకు కమ్యూనిస్టులు గుర్తుకొస్తున్నారని, కానీ తాము ప్రజలకు మాత్రమే కవచంగా ఉంటామని కూనంనేని సాంబశివరావు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మారుతున్నారని బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి చెబితే, మరోవైపు కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్యలు ఉన్నాయని చెబుతున్నారని, ఈ రెండు వ్యాఖ్యలకు సంబంధాలు ఉన్నాయన్నారు. వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడిని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. వికారాబాద్ ఘటనకు సంబంధించిన రైతుల సమస్యను, తరువాయి 2లో

అమృత్ టెండర్లపై

ఏ విచారణకైనా రె'ఢీ'

- కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణకు కెసిఆర్ సిద్ధమా?
- మంత్రి కోమటిరెడ్డి సవాల్
- కెటిఆర్ ఢిల్లీ టూర్ డైవర్షన్ పాలిటిక్స్



ప్రజాపక్షం / హైదరాబాద్

అమృత్ టెండర్లపై ఏ విచారణకైనా కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణకు మాజీ సిఎం కెసిఆర్ సిద్ధమా అని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.21 వేల కోట్ల విలువైన కాళేశ్వరం పనులను ఒక ఆసుపత్రిని నిర్వహించే ప్రతిమ శ్రీనివాస్‌రావుకు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. కెటిఆర్ ఢిల్లీ టూర్ పెద్ద డైవర్షన్ పాలిటిక్స్ అని, ఫార్ములా1 రేస్‌లో రూ.50 కోట్లను ఓరల్ ఇన్‌స్ట్రక్షన్‌తో ఇవ్వడంపై ఎసిబి కేసు నమోదు చేసేందుకు గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తారనే భయంతో కేసుల నుంచి బయటపడేందుకు కెటిఆర్ ఢిల్లీకి వెళ్లాడని మంత్రి అన్నారు. హైదరాబాద్ పేరు చెప్పి అడ్డంగా దోపిడీకి తరువాయి 12లో

కాంగ్రెస్ క్రోనీ క్యాపిటలిజాన్ని

బయటపెట్టేందుకే ఢిల్లీకి

- తనపై ఏ ఏజెన్సీతో విచారణ చేపట్టినా సిద్ధమే
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ క్రోనీ క్యాపిటలిజాన్ని, అవినీతి కుంభకోణాలను బయటపెట్టేందుకు తాము తరుచూ ఢిల్లీకి వస్తూనే ఉంటామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు తెలిపారు. తనపైన ఎటువంటి కేసు నమోదు చేసినా, ఏ ఏజెన్సీతో విచారణ చేపట్టినా తాను సిద్ధమేనని పునరుద్ఘాటించారు. 'అమృత్ టెండర్ల' విషయంలో కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు ఫిర్యాదు చేశామని, దీనిపైన ఎటువంటి చర్యలు తీసుకోకపోతే, పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు. న్యూఢిల్లీలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ 11 నెలల్లో తరువాయి 12లో

రేపు శ్రీలంక పార్లమెంటుకు

కీలక ఎన్నికలు

కొలంబో : శ్రీలంక పార్లమెంటుకు ఈ నెల 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్ మాసంలో పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ లేదా జనతా విముక్తి పెరుమాన(జెవిపి)కి నేతృత్వం వహించిన వామపక్ష నేత అనుర కుమార దిస్సానాయకె దేశాధ్యక్షుడి ఎన్నికల్లో గెలుపొందారు. ఇరవై ఒక్క పార్టీలతో ఏర్పడిన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి)లో జెవిపి భాగస్వామి. అధ్యక్షుడిగా దిస్సానాయకె ఎన్నికైన సమయంలో ఎన్‌పిపికి శ్రీలంక పార్లమెంటులో 225 స్థానాలకు గాను మూడు స్థానాలు మాత్రమే ఉన్నాయి. దీంతో తరువాయి 12లో

వాతావరణ చర్యలను వేగిరపరచిన జి–20 దేశాలు

బాకు : అజర్‌బైజాన్‌దేశం బాకులలో కాప్–29 సదస్సు మంగళవారం రెండోరోజు కార్యక్రమాలు జరిగాయి. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ సదస్సులో పాల్గొన్నారు. కాగా జి–20 దేశాలు ముఖ్యంగా అమెరికా సహా ఆస్ట్రేలియా, కెనడా, సౌదీ అరేబియా, టర్కీ తదితర దేశాలు వాతావరణ సమస్యల పరిష్కారానికి చర్యలను వేగవంతం చేశాయని గ్లోబల్ సౌత్ క్లైమేట్ ఇండెక్స్ తన నివేదికలో పేర్కొంది. వాతావరణ సమస్యలపై జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఉద్దేశించి మొదటిసారి ఈ కామ్ నివేదిక వచ్చింది. గ్లోబల్ సౌత్‌లో భారత్, దక్షిణ ఆఫ్రికా వంటి దేశాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయని కామ్ నివేదిక పేర్కొంది. కామ్ ఒక స్వతంత్ర సంస్థ న్యూఢిల్లీ కేంద్రంగా పని చేసే బుద్ధిజీవుల మండలిగా ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, వాటర్ (సిఇఇడబ్ల్యు) విభాగాలలో ఇది పనిచేస్తుంది.సిఇఇడబ్ల్యు నివేదిక జి–20 దేశాల వాతావరణ ప్రగతి గురించి వివరించింది. అజర్‌బైజాన్‌లో జరుగుతున్న కాప్–29 సదస్సులో 192 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి బ్రిటన్ గట్టి మద్దతు

లండన్ : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వం సంపాదించడానికి బ్రిటన్ గట్టి మద్దతు ఇస్తున్నది. మండలి విస్తరణకు కృషి చేస్తున్నది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం వచ్చేవిధంగా జరిగే కృషిలో గట్టిమద్దతుదారుగా నిలబడుతున్నది. సోమవారంనాడు జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో బ్రిటన్ దౌత్యవేత్త ఆర్కీ యూంగ్ మాట్లాడుతూ భారత్‌కు మద్దతు తెలియజేశారు. భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావాలని బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలను, భారత్ అభిప్రాయాలను ఈ సందర్భంగా యూంగ్ పునరుద్ఘాటించారు. అదేవిధంగా ఆఫ్రికా, జపాన్, జర్మనీ, బ్రెజిల్ దేశాలకు కూడా భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని బ్రిటన్ కోరింది. ఉమ్మడి బాధ్యతతో భద్రతా మండలిలో సంస్కరణలు తీసుకురావాలని యూంగ్ కోరారు.

జైలులో మగ్గుతున్న జర్నలిస్టుకు స్వీడన్ మానవహక్కుల అవార్డు

అస్మారా : తూర్పు ఆఫ్రికాలో ద్వీపకల్పదేశం ఎరిత్రియాలో 23 సంవత్సరాలుగా జైలులో మగ్గుతున్న జర్నలిస్టు దవిట్ ఐజాక్ (60)కు స్వీడన్‌కు చెందిన మానవహక్కుల బహుమతి లభించింది. ప్రపంచంలో ఇంత సుదీర్ఘకాలం జైలులో మగ్గిపోయిన జర్నలిస్టు మరొకరు లేరు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా భావప్రకటనాస్వేచ్ఛకు కట్టుబడిన ఐజాక్ అంకితభావ కృషికిగాను ఆయనకు ఈ అవార్డు లభించింది. 2001 నుండి ఆయన ఎలాంటి విచారణా లేకుండా ఎరిత్రియా దేశ జైలులో మగ్గిపోతున్నారు. మానవహక్కులకోసం మొక్కవోని దీక్షతో ఆయన చేస్తున్న పోరాటానికిగాను ఐజాక్‌కు ఈ ఎడల్‌స్టామ్ బహుమతి లభించింది. ఈనెల 19వ తేదీన స్టాక్‌హోంలో జరిగే సభలో ఆయనకు ఈ బహుమతి ఇస్తారు. స్వీడన్ దౌత్యవేత్త హెరాల్డ్ ఎడెల్‌స్టామ్ స్మృత్యర్థం మానవహక్కులు, స్వేచ్ఛకోసంవ గొప్ప తెగువ, సాహసం కనబరిచినవారికి ఈ బహుమతి ఇస్తారు. ఐతే ఆయన తరపున ఆయన కుమార్తె బెత్లెహామ్ ఐజాక్ ఈ బహుమతిని స్వీకరిస్తారు. దవిట్ ఐజాక్‌ను వెంటనే విడుదల చేయాలని, ఆయనను ఎక్కడ బంధించారో ఆ ప్రదేశాన్ని చెప్పాలనీ, ఆయనను బయటకు తీసుకువచ్చేందుకు కనీసం న్యాయపోరాటం చేసేందుకు న్యాయవాదులను అనుమతించాలని ఎడల్‌స్టామ్ ఫౌండేషన్ ఎరిత్రియా ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి చేసింది. అటు స్వీడన్‌లో, ఇటు ఎరిత్రియాలోనూ పౌరసత్వం పొందిన ఐజాక్ ఎరిత్రియాలో మొట్టమొదటి జాతీయ దినపత్రిక ''సెటిట్''ను స్థాపించిన ఘనత సాధించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనాగానీ ఆయన తన భావప్రకటనాస్వేచ్ఛ హక్కును వదులుకోలేదు. ఎరిత్రియాలో ప్రజాస్వామ్య సంస్కరణలు తీసుకురావాలని ఆయన తన పత్రికలు, రచనలద్వారా పోరాటం చేస్తున్నారు. ఎరిత్రియా ప్రభుత్వం చాలా సంవత్సరాలుగా ఆయన ఉనికి గురించి, ఆయన ఆరోగ్యం గురించి ఎంత అడిగినా ఎవ్వరికీ సమాచారం చెప్పకుండా దాచిపెట్టింది. దాంతో ఆయన మరణించారని అందరూ భావించారు. 1987లో యుద్ధం జరుగుతున్న సమయంలో దవిట్ ఎరిత్రియాను వదిలి స్వీడన్‌కు వెళ్ళిపోయారు. యుద్ధం ముగిసి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1993లో ఆయన ఎరిత్రియాకు తిరిగి వెళ్ళారు. ఎరిత్రియాలో గడచిన అనేక దశాబ్దాలుగా అధ్యక్షుడు ఇసాయియాస్ అఫ్‌వెర్కి నియంత పరిపాలన సాగుతోంది. ఆ దేశంలో 31 ఏళ్ళుగా ఎన్నికలు జరగడంలేదు.

ఉత్తరకొరియా–రష్యా మధ్య చారిత్రక రక్షణ ఒప్పందం



సియోల్ : ఉత్తరకొరియా – రష్యా మధ్య చరిత్రాత్మకమైన రీతిలో ఒక రక్షణ ఒప్పందం కుదిరిందన్న వార్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తర కొరియా మీడియా గతజులైలో జరిగిన ఈ ఒప్పందం గురించి తాజా ఖబర్ తెలియజేసింది. ఈ ఒప్పందం తర్వాతే ఉత్తర కొరియా తన 12 వేలమంది సైన్యాలను ఉక్రేన్‌పై యుద్ధం చేసేందుకు రష్యాకు పంపిందని ఇప్పుడు తేటతెల్లమైందని పాశ్చాత్య మీడియా పేర్కొంది. ఇరు దేశాలు చేసుకున్న ఈ ఒప్పందం ప్రకారం,రెండు దేశాల మీదకు ఎవరైనా దాడులు చేస్తే పరస్పరం సహాయం చేసుకుంటాయి. సైనికంగా, ఆయుధ పరంగా రెండు దేశాలు సహాయం చేసుకుని అండగా ఉంటూ ఒకరిని మరొకరు కాపాడుకుంటాయి. ఉత్తరకొరియా అధినేత కిమ్ ఎంత దూకుడుగా ఉంటారో ఇప్పటికే ప్రపంచం చవిచూపింది. దక్షిణ కొరియా ఈ పరిణామాలతో మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నది. రష్యా తో పరస్పర సైనిక సహాయాన్ని మరింత లోతుగా పటిష్టం చేసుకునే ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఉత్తర కొరియా ధృవీకరించింది. ఉత్తర కొరియా ప్రభుత్వ సెంట్రల్ న్యూస్ ఏజన్సీ మంగళవారం నాడు ఈ విషయం వెల్లడించింది. ఈ ఒప్పందాన్ని రష్యా ప్రభుత్వం గతవారంలోనే అధికారికంగా ఏకగ్రీవంగా ఆమోదించింది. గడచిన జూన్‌నెలలో పుతిన్ ఉత్తరకొరియాలో పర్యటించినప్పుడే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

ప్రపంచం

ప్రవింద్ జుగనాథ్ ఓటమి మారిషస్ కొత్త ప్రధానమంత్రి నవీన్‌చంద్ర

పోర్ట్‌లూయీస్ : హిందూమహాసముద్ర దీవిదేశం రిపబ్లిక్ ఆఫ్ మారిషస్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ప్రధానమంత్రి ప్రవింద్ జుగనాథ్ (62) ఓటమి చెందారు. కొత్త ప్రధానమంత్రిగా నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ (77) ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరిస్తున్నట్లు జుగనాథ్ చెప్పారు. వామపక్ష మధ్యేవాదపార్టీ మిలిటెంట్ సోషలిస్ట్ మూమెంట్ (ఎంఎస్ఎం)కి 2003 నుండీ ఆయన నాయకుడుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఎంఎస్ఎం పార్టీ మొత్తం 69 స్థానాలకుగాను 42 సీట్లు గెలుచుకుని జాతీయ అసెంబ్లీలో ఏకైక పెద్దపార్టీగా అధికారం చేపట్టింది. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఓటమిని అంగీకరిస్తున్నట్లు ఎంఎస్ఎం నాయకుడు ప్రవింద్ జుగనాథ్ పేర్కొన్నారు. ఇండో–మారిషస్ సంబంధాల్లో ఎంఎస్ఎం పార్టీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠ చెందింది. కాగా మారిషస్‌లో మధ్యేవాద సోషల్ డెమోక్రటిక్‌పార్టీ ''లేబర్‌పార్టీ'' నాయకుడు నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ కొత్త ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపడతారు. మారిషస్‌లో ఉన్న నాలుగు వామపక్ష పార్టీలలో లేబర్ పార్టీ కూడా ఒకటి. మారిటియమ్ మిలిటెంట్ మూమెంట్ (ఎంఎంఎం), మిలిటెంట్ సోషలిస్ట్ మూమెంట్, పార్టీ మారిషియన్ సోషల్ డెమోక్రాట్ (పిఎంఎస్‌డి)లతోపాటు లేబర్ పార్టీ కూడా వామపక్ష భావజాలంతో మారిషస్ అభివృద్ధికి దోహపడుతున్నాయి. ఈ ఎన్నికల్లో జుగనాథ్‌కు చెందిన ఎల్ లెపెప్ లేదా ప్రజా కూటమి 'ఎల్ కూటమి' పరాజయం పాలైంది. జుగనాథ్ ఎంఎస్ఎం పార్టీకి చెందినవారు. కొత్త ప్రధానమంత్రిగా ఎన్నికైన నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ ''అలయెన్స్ ఆఫ్ ఛేంజ్ కొయిలేషన్'' తరపున పోటీ చేసి గెలిచారు. తూర్పు ఆఫ్రికా దక్షిణ తీరానికి 1,100 నాటికల్ మైళ్ళదూరంలో ఉన్న మారిషస్, తూర్పు ఆఫ్రికాలో అత్యంత స్థిరమైన ప్రజాస్వామ్యదేశాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిం ది. అధికార కూటమి ఎల్ లెపెప్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి చెలరేగిందని సర్వేలు చెప్పా యి. అదేసమయంలో తాము ఘనవిజయం సా ధించామని రామ్ గూలమ్ చెప్పారు. రామ్ గూల మ్ తండ్రి సీవూ సాగుర్ రామ్ గూలమ్‌ను చాచా రామ్‌గూలమ్‌గా ప్రసిద్ధి. ఆయన ఈ దీవిదేశానికి ఏకైక ముఖ్యమంత్రి, తొలి ప్రధానమంత్రి, ఐదవ గవర్నర్ జనరల్‌గా పనిచేశారు. మారిషస్ మాజీ విదేశాంగమంత్రి ఈ కూటమి సభ్యుడు ఆర్విన్ బూలెల్ మాట్లాడుతూ ప్రతిపక్ష కూటమి విజయం ప్రజా విజయమని అన్నారు.

చైనాలో 35 మంది దుర్మరణం

ఝుహోయ్ : దక్షిణ చైనా గాంగ్‌డాంగ్ రాష్ట్రంలోని ఝుహోయ్‌లోని ఒక స్పోర్ట్స్ సెంటర్‌లోకి కారు దూసుకుపోవడంతో 35 మంది మరణించారు. మరో 43 మంది గాయపడ్డారు. ఝుహోయ్ పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం, సోమవారం రాత్రి ఎనిమిది గంటల తర్వాత స్పోర్ట్స్ సెంటర్‌లోకి ఒక కారు దూసుకుపోయింది. 62 ఏళ్ళ వయసుగల విడాకులు తీసుకున్న డ్రైవరు ఈ కారు నడుపుతున్నట్లు పోలీసులు చెప్పారు. గాయపడినవారిని తక్షణం ఆసుపత్రులకు తరలించారు. కారు నడుపుతున్న వ్యక్తిని ఫాన్ అనే పేగలవాడుగా గుర్తించారు. తర్వాత కారులోనే ఫాన్ కత్తితో తనను తాను పొడుచుకుని చనిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఫాన్ కత్తితో తన మెడమీద తీవ్రంగా గాయపరచుకుని కోమాలోకి వెళ్ళాడు. పోలీసులు అడిగే ప్రశ్నలకు అతడు సమాధానాలు చెప్పే స్థితిలో లేదని పోలీసులు ఆ ప్రకటనలో చెప్పారు. విడాకులు తీసుకున్న సందర్భంగా ఆస్తి పంపకాల్లో తనకు అన్యాయం జరిగిందనే అసంతృప్త ఆలోచనలతో కారు నడుపుతూ ఫాన్ ఈ యాక్సిడెంట్ చేసి ఉంటాడని పోలీసులు తమ దర్యాప్తు ద్వారా అంచనావేస్తున్నారు. ఈ ఘటనపై దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. గాయపడినవారికి తక్షణం మంచి చికిత్స అందించాలని కోరారు.

మాజీ ఎంఎల్‌ఎలకు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ ఎంఎల్‌ఎలు కూడా నోటీసులు అందుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టు అయిన పోలీసు అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిష్ణ, తిరుపతిల కాల్‌లిస్టు ఆధారంగా ఫోరెన్సిక్ రిపోర్టులో లభించిన క్లూస్ ద్వారా వీరికి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి కెటిఆర్ ఢిల్లీ పర్యటనలో ఉండగా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు ఎవరికి నోటీసులు వస్తాయోనని బిఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా పోలీసులు పేర్కొన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికాకు పారిపోయిన సంగతి తెలిసిందే. అమెరికా టూర్‌లో ఉన్నానని, ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత విచారణకు హాజరవుతానని ప్రభాకర్ రెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, నెలలు గడిచినా ఆయన తిరిగి రాకపోవడంతో ప్రభాకర్ రావును భారత్‌కు రప్పించడంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అయితే ప్రభాకర్‌రావుకు తాజాగా అమెరికా గ్రీన్ కార్డ్ వచ్చిందని, ఇప్పట్లో ఆయన భారత్‌కు వచ్చే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. బిఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌కు కూడా త్వరలో నోటీసులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. ఈ కేసులో ఇప్పటి వరకు పోలీసు అధికారుల అరెస్టులు మాత్రమే జరిగాయి, త్వరలో రాజకీయ నేతల అరెస్టులు జరగనున్నాయి.

సర్వం సిద్ధం (మొదటి పేజీ తరువాయి)

కూటమి నుంచి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా తదితరులు ప్రచారం చేశారు. బంగ్లా అక్రమ చొరబాట్ల అంశాన్ని బిజెపి ప్రచార అస్త్రంగా చేసుకుంది. హేమంత్ సోరెన్ సారథ్యంలోని జెఎంఎం ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడిందని ఆరోపించింది. గత ఎన్నికల్లో 30 స్థానాల్లో గెలుపొందిన జెఎంఎం పార్టీ కాంగ్రెస్, ఆర్‌జెడి మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో బిజెపికి 25 సీట్లు వచ్చాయి.

31 అసెంబ్లీ స్థానాల్లో నేడు ఉప ఎన్నికలు

ఇదిలా ఉండగా, వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు పది రాష్ట్రాల్లోని 31 అసెంబ్లీ స్థానాలకు కూడా బుధవారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్‌లో ఏడు, పశ్చిమ బెంగాల్‌లో ఆరు, అసోంలో ఐదు, బీహార్‌లో నాలుగు, కర్నాటకలో మూడు, మధ్యప్రదేశ్‌లో రెండు, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళలో ఒక్కో అసెంబ్లీ స్థానాల్లో కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇవే కాకుండా సిక్కింలోనూ సోరెంగ్–చకుంగ్, నామ్చీ–సింగితంగ్‌కు ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ఈ నియోజకవర్గాల్లో సిక్కిం క్రాంతికారి మోర్చా అభ్యర్థులు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

వివాదాస్పదం చేయొద్దు (మొదటి పేజీ తరువాయి)

సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవనలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కులగణనలోని ప్రశ్నలు సరళతరంగా ఉండాలని, దీనికి సంబంధించి ఒక యాప్‌ను ఏర్పాటు చేస్తే, అందులో ప్రజలు వారి వివరాలు పొందపరుస్తారన్నారు. ఆర్థిక, రాజకీయ, సమానత్వం కలిగేలా కులగణన ఉండాలని ఆయన సూచించారు. కులాలు, మతాలపై అభిమానం ఉండాలని, కానీ, కుల, మతతత్వం ఉండకూడదని ఆయన అన్నారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడి చేయడం సరైంది కాదని, అదే సమయంలో రైతుల బాధను, వారి ఆవేదనను కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలని నారాయణ సూచించారు. దాడి చేశారనే నెపంతో ఒక రాజకీయ పార్టీ ముద్ర వేసి చర్యలు తీసుకోవద్దన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి ప్రధాని మోదీవెళ్లడం, ఆయనను ప్రధాన న్యాయమూర్తి ఆహ్వానించడం రెండూ తప్పేనని, రాజకీయాల్లో ఇది దుష్ట సంప్రదాయమని, ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థకు కలంకం తీసుకొస్తాయని అన్నారు. న్యాయ వ్యవస్థ లక్ష్మణ రేఖను దాటకూడదని నారాయణ సూచించారు. దేశంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలను, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, వైసిపిని మోదీ తన గుప్పిట్లో పెట్టుకున్నారని విమర్శించారు. ఎపి సిఎం చంద్రబాబుతో మోదీది విష కౌగిలి అని అన్నారు. ఈ నెల 17న కొల్లేరు సరస్సును సందర్శించనన్నట్టు నారాయణ వివరించారు.

డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్

(మొదటి పేజీ తరువాయి)

కోసం స్టేట్ విజిలెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫార్మా ఇండస్ట్రీస్, డ్రగ్ మానుఫ్యాక్చరింగ్ యూనిట్స్, మెడికల్ హాల్స్, ఫార్మసీలలో మరింత విస్తృతంగా తనిఖీలు చేయాలని సూచించారు. ఫార్మా సంస్థలు ఉన్న చోట అదనంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలన్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన అంశంలో ఎటువంటి రాజీ ఉండకూడదని చెప్పారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లలో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ అధికారులు,తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎంఎస్ఐడిసి) అధికారులతో హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లోని డిసిఎ కార్యాలయంలో మంత్రి దామోదర రాజ నర్సింహ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 21,639 తనిఖీలు నిర్వహించామని, 3416 సంస్థలపై(మెడికల్ షాప్స్, మానుఫ్యాక్చరింగ్ యూనిట్స్,తదితర.) చర్యలు తీసుకున్నామని డిసిఎ అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఒక్కటే ఉందని, అందుకే ఎక్కువ మొత్తంలో నమూనాలను పరీక్ష చేయలేకపోతున్నామని అధికారులు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో(1956 సంవత్సరంలో) ప్రారంభమైన ఈ ల్యాబులో నెలకు గరిష్టంగా 400 సాంపిల్స్ మాత్రమే పరీక్షించగలుగుతున్నామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 3255 నమూనాల పరీక్ష చేశామన్నారు.2014 నాటికి సుమారు 20 వేల మెడికల్ షాపులు ఉంటే, ఇప్పుడు 45 వేలకు పెరిగాయని, కానీ గత పదేళ్ల కాలంలో కొత్తగా డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్ రాలేదని,డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను కూడాపెంచలేదని వారు చెప్పారు. దీనిపైన మంత్రి దామోదర రాజనర్సింహ స్పందిస్తూ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త ల్యాబును ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్ ఆధునీకరణ, కొత్తగా నాలుగు ల్యాబుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. మషల్కర్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.ప్రస్తుతం 71 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారని, కనీసం 150 మంది (అదనంగా 80 పోస్టులు) అవసరమని అధికారులు మంత్రికి వివరించారు. దీనిపైన ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి అవసరమైన పోస్టులను మంజూరు చేయిస్తామని తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను వారు పనిచేస్తున్న ప్రాంతానికే పరిమితం చేయకుండా, ర్యాండమ్‌గా ఇతర ఇన్‌స్పెక్టర్ల పరిధిలోని తనిఖీలకు పంపించాలని డిజి కమలాసన్ రెడ్డిని మంత్రి ఆదేశించారు. నిబంధనలు పాటించకపోయినా, నాసిరకం మెడిసిన్ అని తేలినా, ఆయా సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించారు.ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, డిసిఎ డిజి విబి.కమలాసన్ రెడ్డి ,టిజిఎంఎస్ఐడిసి ఎండి హేమంత్ సహదేవరావు, డిసిఎ జాయింట్ డైరెక్టర్ జి.రాందాన్ పాల్గొన్నారు.

ఎసిబి అనగానే..

(మొదటి పేజీ తరువాయి)

పరోక్షంగానో లాభం పొందుతుందని, ఎవరికి ఈ విషయం తెలియదనుకుంటారని, కానీ అందరికీ అర్థమవుతుందన్నారు. కుల గణన మెగా హెల్త్ చెకప్ గోప్యత చట్టం ప్రకారం ఎవరి సమాచారాన్ని సేకరించవద్దని, అయితే, మొబైల్ కంపెనీలకు, ప్రైవేటు వ్యక్తులకు డాటా ఇచ్చేందుకు రాజీ పడతారు కానీ, తెలంగాణ ప్రభుత్వానికి ఇస్తే ఇబ్బందేమిటి అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కులగణనలో ప్రజల పూర్తి సమాచారం అడగడంపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ విషయాన్ని బిజెపి, బిఆర్ఎస్‌లే వివాదం చేస్తున్నాయని విమర్శించారు. ఎవరి భాగస్వామ్యం ఎంతో వారికి అంత వాటా అనే రాహుల్ గాంధీ నినాదానికి వారు వ్యతిరేకమని అన్నారు. కులగణనను రాహుల్‌గాంధీ సామాజిక ఎక్స్ రే అన్నారని, తాను దానిని కొంత విస్తృతపరిచి మెగా హెల్త్ చెకప్ ఫర్ సొసైటీ అంటున్నానని చెప్పారు. సరైన సమాచారం ఉంటేనే ఎవరెవరికి ఏమేమి సంక్షేమ పథకాలు అందించాలి, ఎంత రిజర్వేషన్‌లు కల్పించాలి. పేదలకు ఎంత అప్పుయ మాఫీ చేయాలి, ఎవరికి కరెంటు బిల్లు రాయితీ ఇవ్వాలని, ప్రత్యక్ష లబ్ది బదిలీ(డిబిటి) నష్టం లేకుండా సరైన వారికి ఎలా ఇవ్వాలో తెలుస్తుందన్నారు. అందుకు కులగణనలో 360 డిగ్రీల సమాచారాన్ని సామాజిక, ఆర్థిక, కుల గణన ద్వారా సేకరిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఐదంతస్తులు ఉన్న బిఆర్ఎస్ నేతలు కూడా డబుల్ బెడ్‌రూమ్ కింద లబ్ది పొందారని, ఆ వివరాలన్నీ బైటపడతాయన్నారు. తొలుత నెహ్రూ , ఇందిరా హయాంలో ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్‌లతో సామాజిక న్యాయం 1.0 జరిగిందని, తరువాత రాజీవ్ గాంధీ, పి.వి. హయాంలో బిసిలకు రిజర్వేషన్‌ల ద్వారా సామాజిక న్యాయం 2.0 జరిగిందని, ఇప్పుడు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ హయాంలో ఎవరికెంత వాటానో అని సామాజిక న్యాయం 3.0 జరగబోతుందన్నారు. మోదీ గుజరాత్ సిఎం కానంత వరకు ఆయన కులం అగ్రకులం అని, సిఎం అయ్యాక ఒబిసి అయ్యిందని, కాబట్టి మోదీ లీగల్లీ కన్వర్టెడ్ ఒబిసి అన్నారు. కుల గణన గేమ్ చేంజర్ అని, కేవలం రాహుల్ గాంధీ అన్నందుకు దానిని పక్కన బట్టి బిసిలకు అన్యాయం చేయవద్దన్నారు. దేశానికి విభజన రాజకీయాలు మంచివి కాదన్నారు. తాను కెసిఆర్‌కు ఫైనాన్స్ చేశానని, తాను టిఆర్ఎస్‌లో పని చేయలేదని చెప్పారు. తెలంగాణ ఉద్యమం సాగుతున్న సమయంలో విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు ఉద్యమానికి మద్దతు ఇచ్చారని, దానిని కెసిఆర్ కుటుంబం పెట్టబడిగా మార్చుకున్నారని అన్నారు. తాను చంద్రబాబు నాయుడుతో కలిసి పని చేశానన్నారు.

కాంగ్రెస్ ఫార్మాట్ మారాలి

తాను ఒక విషయం చెప్పాలనుకుంటున్నానని, కాంగ్రెస్ పార్టీ ఫార్మాట్ మార్చుకోవాలని, కాంగ్రెస్ నాయకులు టెస్ట్ మ్యాచ్ ఆడుతున్నారని, ఇప్పుడు 2020 ఫార్మాట్ నడుస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. తాము ఆ ఫార్మాట్ ఆడాలని లేదా ఫార్మాట్ మార్చుకోవాలన్నారు.

నా డిక్షనరీలో నాలుగు అంశాలు ఉన్నాయి

తాను 2007లోనే తెలంగాణ ఒకటి ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్, నాలుగవది రేడియల్ రోడ్స్ అని రేవంత్ రెడ్డి తెలిపారు. తాను తొమ్మిది నెలలు అధికారంలో ఉన్నానని, పదేళ్ళలో మరో 9 ఏళ్ళు ఒక నెలలో తాను అన్ని నాలుగు ప్రాజెక్టులు పూర్తి చేస్తానన్నారు. చంద్రబాబు 1994 నుంచి 2004 వరకు ఉన్నారని, కాంగ్రెస్ 2004 నుంచి 2014 వరకు ఉందని, కెసిఆర్ 2014 నుంచి 2024 వరకు ఉన్నారని, తాము కూడా పదేళ్లు అధికారంలో ఉంటామని చెప్పారు. అభివృద్ధి విషయంలో కెసిఆర్, కెటిఆర్ ఏమి చేసినా నాకు అభ్యంతరం లేదు, కానీ రాజకీయాల విషయంలోనే అభ్యంతరమని అన్నారు.

బిఆర్ఎస్ (మొదటి పేజీ తరువాయి)

ఫోన్ కాల్ రికార్డ్‌ను పరిశీలించిన పోలీసులు ఉదయం నుంచి దాడులు జరిగే సమయానికి దాదాపు 30 నుంచి 40 సార్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరితో ఫోన్ మాట్లాడుతున్న సమయంలోనే మాజీ ఎంఎల్‌ఏ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో 5 నుంచి 6 సార్లు ఫోన్ సంభాషణ జరిపినట్లు పోలీసులు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే పోలీసులు మాత్రం లగచర్ల గ్రామంతో పాటు తండాలలో గాలింపు చర్యలు చేపట్టడంతో అక్కడి రైతులు, గ్రామాల ప్రజలు తమ ఇండ్లలకు తాళాలు వేస

పెండింగ్ బిల్లుల విడుదలకు విద్యాశాఖ కమిషనర్ అంగీకారం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మధ్యాహ్న భోజన వంట కార్మికులు 9,10 తరగతి విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్ల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేసేందుకు విద్యాశాఖ కమిషనర్ అంగీకరించినట్లు తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. మంగళవారం తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవాధ్యక్షురాలు డి.కమలారెడ్డి, అధ్యక్షురాలు పి.ప్రేంపావని, ఉపాధ్యాయ సంఘం నేత సదానంద గౌడ్‌లతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర ఉన్నత పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇ.వి.నరసింహారెడ్డిని కలిసి వంట కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా గత ఫిబ్రవరి నుంచి పెండింగ్‌లో ఉన్న 9,10 తరగతుల విద్యార్థులకు ఇచ్చే కోడిగుడ్ల బిల్లులను సత్వరం విడుదల చేయాలని కమిషనర్‌ను నాయకులు కోరారు. దీంతో కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ బిల్లుల చెల్లించేందుకు ఇప్పటికే అధికారులకు సిఫార్సు చేశామని, త్వరలోనే బిల్లులు విడుదలవుతాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తన ఎన్నికల మ్యానిఫెస్టోలో వంట కార్మికులకు రూ.10వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని యూనియన్ నాయకులు గుర్తు చేయగా ఇందుకు సంబంధించి ప్రభుత్వ పరిధిలో నిర్ణయం తీసుకుకోవాల్సి ఉంటుందన్నారు. మొత్తం పెండింగ్ బిల్లుల కోసం రూ.54కోట్లను విడుదల చేశామని, సెప్టెంబర్ వరకు పూర్తి బిల్లులు చెల్లించామన్నారు. దీంతో పలు జిల్లాల్లో పెండింగ్ బిల్లులు చెల్లించలేదని యూనియన్ ప్రతినిధుల బృందం తెలుపగా ఏఏ జిల్లాల్లో, మండలాల్లో జాప్యం జరిగితే వాటి వివరాలు పంపమని కోరారు. అదేవిధంగా అల్పాహారం గత జూన్ నెల నుండి ప్రభుత్వం నిలిపివేసిందని ఎక్కడైనా అధికారులు అల్పాహారం కోసం ఒత్తిడి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని విద్యాశాఖ కమిషనర్ యూనియన్ నాయకులకు సూచించడంతో పాటు ఇతర సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అన్ని జిల్లాల్లో

ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్లు

సిరిసిల్ల చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయం ప్రాంగణంలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌లను ఆయన ప్రారంభించి క్యాంటీన్‌లో తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్చలు జరుగుతున్నాయన్నారు. మొదటి దశలో 600 బస్సులు ఐకెపి ద్వారా కొనుగోలు చేయాలని ప్రణాళిక చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం నిలబడుతుందన్నారు. చేనేత ద్వారా రాష్ట్రంలో అన్ని మహిళా సంఘాలకు చీరెలు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి అనేక విధానాలు ఉన్నాయన్నారు. సిరిసిల్లలో యర్న్ బ్యాంకు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చనిపోయిన చేనేత కార్మికులకు నివాళులర్పిస్తూ సిరిసిల్ల చేనేతకు సంబంధించిన ముఖ్యులతో చర్చించి శాశ్వతంగా సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. వికారాబాద్‌లో జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం సరికాదని, అందుకు కారకుల వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఐఎఎస్‌లకు రక్షణ లేదని అన్నవారే ట్రోల్ చేస్తూ రైతుల సమస్యను తీసుకువస్తున్నారన్నారు. కలెక్టర్‌పై దాడి జరిగితే ఊరుకొమ్మంటారా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయస్థానాలు ఉన్నాయని, నిరసనలు తెలుపుకునే అవకాశముంటే అలా చేయడం సరికాదన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులపై దాడి చేసింది అందరికీ తెలుసని, మర్చిపోయారా? అంటూ బిఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడా ఇబ్బంది లేదన్నారు. 85వేల మంది ఎన్యూమరేటర్లు సమాచారం సేకరిస్తున్నారన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఉన్న దగ్గరే కులగణనపై ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మనిషి ఆరోగ్యానికి గురైనప్పుడు ఎక్స్‌రే ఎలా ఉపయోగపడుతుందో ఈ సర్వే ద్వారా భవిష్యత్తులో సామాజిక రుగ్మతలు తొలగుతాయన్నారు. సమాచారం ఇస్తే గోప్యంగా ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఉన్నవారిని ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు. రాజకీయ కుట్రదారులు ఆటంకం కలిగిస్తే చర్యలుంటాయన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బిజెపి, బిఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలాగా వ్యవహరిస్తున్నారని, అందులో భాగంగా తనపై వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి ఢిల్లీకి వెళ్లారని కెటిఆర్‌ను ఉద్దేశించి అన్నారు. అది కాదంటే నిరూపించుకోవాలని, చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రైస్‌మిల్లర్లు ప్రభుత్వ కొనుగోలులో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వానికి బకాయిలు లేని వారి పట్ల ఇబ్బందులు లేవని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన 20వేల కోట్ల బకాయిలు ఉండి ప్రభుత్వమే బదనాం చేస్తుందనడం సరికాదన్నారు. ప్రభుత్వానికి లెక్క అప్పగించకపోతే ఉపేక్షించేది లేదన్నారు. డిఫాల్టర్లను పక్కన పెట్టాలన్నారు. రైతాంగానికి, ప్రభుత్వానికి వారధిలా ఉండి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కాటన్ కొనుగోలుకు సంబంధించి ఇద్దరు కేంద్ర మంత్రులదే బాధ్యత అన్నారు. పరస్పరం సహకారం చేసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌సి, ఎస్‌టి హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎస్‌సి, ఎస్‌టి హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ల్యాండ్ అట్రాసిటీ సమస్యలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, కమిషన్ గౌరవ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్‌లతో కలిసి పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రీ పోస్ట్ మెట్రిక్ రెసిడెన్షియల్ హాస్టల్స్, ఇందిరా మహిళా శక్తి, కార్పొరేషన్ రుణాలు, దళితబంధు, పెండింగ్ భూ సమస్యలు, అట్రాసిటి కేసుల నమోదు వంటి వివిధ అంశాలను అధికారులు కమిషన్‌కు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ పెండింగ్ ఎస్‌సి, ఎస్‌టి రెవెన్యూ భూ సంబంధిత కేసుల సంబంధిత పరిష్కారానికి అవసరమైన నివేదికలు తెప్పించుకోవాలని, మొత్తం పెండింగ్ దరఖాస్తులను నెల రోజుల వ్యవధిలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి, అదనపు డిసిపి నరేష్‌కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కస్తాల సత్యనారాయణ, జిల్లా అధికారులు, ఎసిపిలు, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల

ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : పేద, మధ్య తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య అందిస్తున్న బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడానికి గల కారణాలు, వారి బాధలు తెలియాలంటే క్యాంపస్ విద్యార్థులతో ప్రభుత్వం లేక, విద్యాశాఖ అధికారులు ముఖాముఖి నిర్వహించాలని వారు ఒక ప్రకటనలో కోరారు. క్యాంపస్‌లోని విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడం, జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్నారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో వెంటనే అధికారులు క్యాంపస్‌ను సందర్శించాలని, విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. సోమవారం రెండవ సంవత్సరం విద్యార్థి స్వాతిప్రియ ఆత్మహత్యకు పాల్పడితే వారి కుటుంబ సభ్యులు రాకముందే భౌతికకాయాన్ని సుపత్రికి తరలించారని, ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని వారి తల్లితండ్రులు చెబుతున్నా పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని, విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని, అదేవిధంగా సిఎం రేవంత్ రెడ్డి బాసర ట్రిపుల్ ఐటి క్యాంపస్ సందర్శన చేసి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడానికి గల కారణాలు ఏమిటో తెలుసుకోవడంతోపాటు నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్ అన్నారు. మంగళ వారం స్టాలిన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య అందించే విశ్వవిద్యాలయం అయిన బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని, ఈ సంవత్సరం ముగ్గురు విద్యార్థులు, ఇప్పటివరకు ఈ రెండేళ్ళలో తొమ్మిది మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని, ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడానికి గల కారణాలు ఏంటో వారి బాధలు తెలియాలంటే క్యాంపస్ విద్యార్థులతో ప్రభుత్వం లేదా విద్యాశాఖ అధికారులు ముఖాముఖి నిర్వహించాలని, క్యాంపస్‌లోని విద్యార్థులకు గల బాధలు ఏంటి సౌకర్యాలు లేకనా, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తున్నారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో వెంటనే అధికారులు క్యాంపస్‌ను సందర్శించి విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకోవాలని, నిన్న రెండో సంవత్సరం విద్యార్థి స్వాతిప్రియ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబ సభ్యులు వచ్చే వరకు ఆగకుండా హాస్పిటల్‌కి తరలించారని, ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని వారి తల్లిదండ్రులు చెప్తున్నా పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఆనాడు ప్రతిపక్ష హోదాలో రేవంత్ రెడ్డి బాసర త్రిబుల్ ఐటి సందర్శనకు వస్తే పోలీసులు అడ్డుకోవడంతో మేము అధికారంలోకి రాగానే బాసర త్రిబుల్ ఐటిని సందర్శించి, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి నేడు అధికారంలోకి వచ్చి పదకొండు నెలలు కావస్తున్నా విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్దే ఉన్నా ఎందుకు అసలు త్రిబుల్ ఐటిని సందర్శించడంలేదని మండిపడ్డారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో అందులో విద్యను అభ్యసించే విద్యార్థులకు మనోధైర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలం అవుతుందని, ప్రభుత్వ లేదా విద్యాశాఖ అధికారులు బాసర త్రిబుల్ ఐటిలో విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలని, వెంటనే సిఎం రేవంత్ రెడ్డి బాసర ట్రిపుల్ ఐటిని సందర్శించాలని ఎస్ఏ స్టాలిన్ డిమాండ్ చేశారు.

రైతుకు ప్రభుత్వం మరింత చేయూత

వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునరుద్ధరణకు చర్యలు

యాసంగి నుంచే పథకం ప్రారంభం

జిల్లా స్థాయిలో వ్యవసాయ యాంత్రీకరణ ఎగ్జిబిషన్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: రైతులకు మరింత చేయూతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసేందుకుగాను వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఇందుకు కావాల్సిన నిధులు, పథకం అమలు తీరు తెన్నులపై వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వచ్చే యాసంగి నుంచే ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇందుకు కావాల్సిన కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

ఇప్పటికే వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన రావు, వ్యవసాయ డైరెక్టర్ గోపి సహకార సంస్థల ప్రతినిధులతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు. యాసంగి నుండి రైతులకు అవసరమైన పనిముట్లను, యంత్రాలను, సబ్సిడీపై సరఫరా చేయసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు జిల్లాల వారీ అధిక డిమాండ్ ఉన్న పనిముట్లను, యంత్ర పరికరాల జాబితా రూపొందించారు. ప్రస్తుతం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రోటవేటర్స్, ఎంబి నాగళ్ళు, కల్టివేటర్స్, తైవాన్ స్ప్రేయర్లు, బేలర్స్, పవర్ వీడర్స్, మొక్కజొన్న వొలుచు యంత్రాలు, ట్రాక్టర్లు, కిసాన్ డ్రోన్లు సబ్సిడీపై అందించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. గత ఐదే ఏళ్లుగా ఈ పథకం అమలు నిలిచిపోయిన నేపథ్యంలో రైతులకు దీనిపై అవగాహన కల్పించేందుకు జిల్లాల వారీగా ఎక్కడికక్కడ యంత్ర పరికరాలు, పనిముట్లు తయారీ సంస్థల సహకారంతో మార్కెట్లలో కొత్తగా వచ్చిన పరికరాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా ఏ ప్రాంత రైతులకు ఏ ఏ యంత్రాలు అవసరంకానున్నాయో పూర్తి అవగాహన కల్పించనున్నారు.

డిసెంబర్ నాటికి యాసంగి సీజన్ ప్రారంభం కానుండడం, రైతులకు యంత్రాలను అందజేయాల్సి ఉండడంతో తక్షణమే జిల్లా యంత్రాంగం ప్రదర్శనకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమావేశం

యాసంగి పంట నుంచి రైతులకు అవసరమైన యంత్రాలు, పనిముట్లను సబ్సిడీపై అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ యాసంగి నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందనరావు, డైరెక్టర్ గోపిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునరుద్ధరణకు తీసుకోవాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. రైతులకు సబ్సిడీపై అందించాల్సిన వ్యవసాయ పనిముట్ల జాబితాను సిద్ధం చేయడంతో అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులకు ఇప్పటికే అదేశాలు జారీచేసినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మంత్రికి వివరించారు. అంతకుముందు వ్యవసాయశాఖ రూపొందించిన ప్రతిపాదనలను పరిశీలించిన మంత్రి, ఇది ఆరంభం మాత్రమేనని, వ్యవసాయయాంత్రీకరణ నిరంతర కార్యక్రమము అని ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్టంగా నిబంధనలు రూపొందించాలని సూచించారు.

రైతులతో ఆడుకుంటున్న ప్రభుత్వం

దళారులతో మంత్రి కుమ్మక్కు : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : పత్తి, వరి ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులతో ఆడుకుంటుందని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి అన్నారు. ఒక పథకం ప్రకారమే రైతులను దళారులకు, మిల్లర్లకు వదిలేశారని, దీని వెనకాల వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి రైతుల వద్ద ధాన్యం కొనకుండా అధికారులను బెదిరించారని, ఆయన దళారులతో కుమ్మక్కై, వందల కోట్ల రూపాయలను వసూలు చేశారని ఆరోపించారు. రైతులు ఎందుకు దోపిడీకి గురవుతున్నారో సిఎం, వ్యవసాయ శాఖమంత్రి సమాధానం చెప్పాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఒక్క గింజ సన్న వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. సమస్యను పక్కదారి పట్టించడానికే సిఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో అధికారులపై జరిగిన దాడి సిఎం రేవంత్ రెడ్డిపై జరిగిన దాడిగా అభివర్ణించారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. కొడంగల్ ఘటన వెనుక బిఆర్ఎస్ కుట్ర ఉన్నదని కాంగ్రెస్ ఆరోపించడం ఆశ్చర్యకరమన్నారు. ఎప్పుడు బయటకు రావాలో కెసిఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. ఆధారాల కోసమే బిఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంఎల్ఎకు నోటీసులు ఇచ్చారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఎవరు గెలిస్తే, ఓడితే తమకు ఏమిటని జగదీష్ రెడ్డి అన్నారు.

ఒత్తిళ్లకు తలొగ్గకండి..శాస్త్రీయంగా, లోతుగా అధ్యయనం చేయండి

డెడికేటెడ్ కమిషన్‌కు బిఆర్ఎస్ వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా శాస్త్రీయంగా, లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదికను ఇవ్వాలని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూపారి వెంకటేశ్వరరావును బిఆర్ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు బిఆర్ఎస్ నాయకులు, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంఎల్ఎ వినయ్ భాస్కర్, బిసి కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, శుభప్రద్ పటేల్, డాక్టర్ ఆంజనేయ గౌడ్, బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయకులు పల్లె రవికుమార్ గౌడ్ తదితరుల బృందం హైదరాబాద్‌లోని డెడికేట్ కమిషన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటును

ఉపసంహరించుకోవాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు.

ఫార్మా కంపెనీ ఏర్పాటుకు భూసేకరణపై ప్రజాభిప్రాయ కార్యక్రమంలో అధికారులపై దాడులకు పాల్పడడంతో పాటు వారి వాహనాలపై రాళ్లు విసరడం సరైంది కాదని, ఈ ఘటనను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తోందని వారు ఒక ప్రకటనలో తెలిపారు. దాడులకు పాల్పడిన వారు రైతులు కాదని, కొందరు అసాంఘిక శక్తులని స్వయంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రకటించిన నేపథ్యంలో అమాయక రైతులపై కాకుండా అసాంఘిక శక్తులను మాత్రమే అరెస్టు చేయాలని కోరారు. ఇప్పటికే దాదాపు 28 మందిని అరెస్టు చేసినట్లుగా వార్తలు వచ్చాయని, తాండాల్లోని ప్రజలు మహిళలతో సహా భయంతో పారిపోయారని సమాచారం ఉందన్నారు.

లగచర్లలో కరెంటు, కేబుల్ నెట్‌వర్క్‌ను కట్ చేయటాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖండిస్తుందన్నారు. రైతులను, గిరిజన రైతులను అరెస్టులతో భయాభ్రాంతులకు గురిచేయవద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఫార్మా కంపెనీల ఉత్పత్తులను 40 శాతం ఎగుమతి చేస్తున్న నేపథ్యంలో వ్యవసాయ భూములను వదులుకుంటే ఏరకంగా జీవనాన్ని కొనసాగించగలుగుతామో పాలకులు ఆలోచించాలని వారు సూచించారు.

కలెక్టర్‌పై దాడి ఘటన...

డిజిపికి ఉద్యోగ సంఘాల ఫిర్యాదు

ప్రజాపక్షం / హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై జరిగిన దాడులను ఉద్యోగ సంఘాల తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అధికారులపై దాడులు చేయడం సరైనది కాదన్నారు. అందుకే తామంతా కలిసి డిజిపి జితేందర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చామన్నారు. మంగళవారం సచివాలయం దగ్గర మీడియాతో లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్‌పై జరిగిన దాడి పట్ల సమగ్ర విచారణ జరిపించాలని కోరామన్నారు. తమ అభ్యర్థనను డిజిపి పరిగణలోకి తీసుకున్నారని చెప్పారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ ఆఫీసర్ కె.వెంకట్ రెడ్డి, దుద్యాల తహశీల్దార్, రెవెన్యూ ఉద్యోగులంతా భూ సేకరణపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు వెళ్లారన్నారు. ఈ క్రమంలో అక్కడ కొందరు నినాదాలు చేస్తూ కలెక్టర్, ఆయన బృందాన్ని విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఆ తర్వాత దాడి చేశారన్నారు. అధికారులపైనే భౌతికంగా దాడులు చేయడం వల్ల ఉద్యోగులంతా మానసికంగా కృంగిపోతారన్నారు. ఇలాంటి పునరావృతం కావద్దని, ఈ ఘటనకు బాధ్యులైన వారందరినీ చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిజిపికి ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై చర్యలు తీసుకుంటున్నామని డిజిపి తెలిపినట్లు లచ్చిరెడ్డి ప్రకటించారు.

నేడు భారతీయ 'జనౌషధి' కేంద్రం ప్రారంభం

రిమోట్ వీడియో లింక్ ద్వారా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో బుధవారం ప్రధాన్ మంత్రి నరేంద్ర మోదీ భారతీయ జనౌషధి కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. రిమోట్ వీడియో లింక్ ద్వారా కాచిగూడ రైల్వే స్టేషన్‌తో సహా దేశ వ్యాప్తంగా 18 ప్రదేశాలలో భారతీయ జనౌషధి కేంద్రాలను ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొననున్నారు. ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి యోజన(పిఎంబిజెకె) ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు అతి తక్కువ ధరలకే నాణ్యమైన మందులను అందించేందుకుగాను కేంద్రప్రభుత్వం ఈ ప్రజా సంక్షేమ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ జజనౌషధి కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

గల్ఫ్ కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు

టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ డాక్టర్ బి.ఎం.వినోద్ కు

ఫోకస్

మహిళ

న్యాయవ్యవస్థలో మహిళల స్థానం ఎక్కడ?

స్వతంత్ర భార్యత దేశానికి అత్యంత కీలకమైన న్యాయ వ్యవస్థలోనూ మహిళలకు అన్యాయం జరుగుతున్నదన్న విమర్శలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ రగంలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉందనేది నిజం. నిజమైన సమానత్వానికి ప్రతీకగా పేర్కొనే న్యాయ వ్యవస్థలోనే ఈ పరిస్థితి నెలకొనడం విచారకరం. విచిత్రంగా.. ఇప్పటికీ మహిళలు న్యాయ వ్యవస్థలో ప్రవేశించడానికి ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ ధైర్యంగా అడుగుపెట్టినప్పటికీ, పురోగవృద్ధి సాధించడానికి ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. నిజానికి మహిళా న్యాయమూర్తులు విభిన్న దృక్కోణాలు, అనుభవాలతో కేసులను పరిశీలించగలుగుతారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంచుతారు. వారు ఇచ్చే నాణ్యమైన నిర్ణయాలు న్యాయ వ్యవస్థ ప్రతిష్టను మరింతగా ఇనుమడింప చేస్తుంది. మహిళా న్యాయమూర్తుల ఉనికి అవినీతిని ఎదుర్కోవడానికి ఓ మంత్రదండంలా ఉపయోగపడుతుంది. మానవ హక్కులను సమర్థించడానికి అవకాశం కల్పిస్తుంది. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, వివిధ రాష్ట్రాల హైకోర్టులలో సగటున కేవలం 13.4 శాతం మంది మాత్రమే మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టులో వారి వాటా 9.3 శాతం మాత్రమే. ఒకరి కంటే ఎక్కువ న్యాయమూర్తులు లేని హైకోర్టులు కూడా ఉన్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. సుప్రీం కోర్టు, హైకోర్టులతో పోలిస్తే, జిల్లా న్యాయవ్యవస్థ కొంత మెరుగ్గా ఉంది. అక్కడ 36.3 శాతం మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మణిపూర్, మేఘాయల, ఒడిశా, త్రిపుర, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో ఒక మహిళా న్యాయమూర్తి మాత్రమే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, ప్రపంచ వ్యాప్తంగా సగటున 25 శాతం కంటే తక్కువ మంది మహిళలు న్యాయ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాలంలో న్యాయ వ్యవస్థలోకి అడుగుపెడుతున్న మహిళల సంఖ్య పెరగడం కొంత ఊరటనిస్తున్న అంశం. రిక్రూట్‌మెంట్ కోటా వంటి చర్యలు చేపట్టిన కొన్ని రాష్ట్రాల్లో సివిల్ జడ్జి (జూనియర్) విభాగంలో 50 శాతం మంది మహిళలు అడుగుపెట్టగలిగారు. అయితే, ఈ చర్యలు సరిపోవు. అనేక రాష్ట్రాల్లోని సేవా నిబంధనల ప్రకారం, బెంచ్‌కు ఎదగడానికి కనీస నిరంతర ప్రాక్టీస్ అవసరం. తగినంత ప్రోత్సాహంలేని లేదా కుటుంబ బాధ్యతలు మోస్తున్న మహిళలు ఈ నిబంధనను భర్తీ చేయడం చాలా అరుదు. అందుకే, న్యాయ వ్యవస్థలో మహిళల సంఖ్య తక్కువగా ఉంటుంది. ప్రత్యేకించి న్యాయమూర్తి స్థాయికి మహిళలా చాలా తక్కువ మంది చేరుకుంటున్నారు. ప్రసూతి ప్రయోజనాలు, కనీస స్టయిఫండ్‌లు, పిల్లల సంరక్షణ సౌకర్యాలు వంటి సహాయక, మౌలిక సదుపాయాలు లేకపోవడం వారి కెరీర్ పురోగతిని మరింత క్లిష్టతరం చేస్తున్నది. ఇక సీనియర్ స్థానాల్లో తక్కువ మంది మహిళలు ఉన్నందున, ఔత్సాహిక మహిళా న్యాయమూర్తుల పదవికి పోటీపడే వారి సంఖ్య దాదాపు లేకుండాపోయింది. ఫలితంగా న్యాయ వ్యవస్థలో పురుషాధిక్యత కొనసాగుతుంది. ఉన్నత స్థానాలకు చేరుకోవడం మహిళలకు కష్టసాధ్యమవుతుంది. మద్దతునిచ్చే వ్యవస్థ లేకపోవడం వల్ల మహిళల వెనుకబాటు అనివార్యమవుతున్నది. న్యాయ వ్యవస్థలో కనీసం 50 శాతం వాటా మహిళలకు ఉండాలని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. ఇది ధర్మానికి సంబంధించిన అంశంగా కాకుండా, వారి హక్కుగా పరిగణించాలని స్పష్టం చేశారు. ఆయన ప్రోత్సాహం, చొరవ కారణం జ్యుడిషియల్ నియామకాల్లో సామాజిక వైవిధ్యాన్ని నిర్ధారించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈనెల 11వ తేదీన సుప్రీం కోర్టు ప్రధాన నాయయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ ఒరవడిని ముందుకు తీసుకెళతారని ఆశిద్దాం.

సుప్రీంకోర్టులో తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీబీ

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ కేవలం 11 మంది మహిళలకు మాత్రమే సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించే అవకాశం దక్కింది. భారత సుప్రీం కోర్టు మొట్టమొదటి మహిళా న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించిన ఘనత జస్టిస్ ఫాతిమా బీబీ దక్కుతుంది. కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆమె 1989, అక్టోబర్ 6న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 1992 ఏప్రిల్ 29న రిటైరయ్యారు. కెరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ సుజాతా మనోహర్ 1994, నవంబర్ 8 నుంచి 1999, ఆగస్టు 27 వరకూ సుప్రీం కోర్టు న్యామూర్తిగా సేవలు అందించారు. కాగా, ఎక్కువ కాలం సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా కొనసాగిన మహిళ జస్టిస్ రుమా పాల్. 2000 జనవరి 28 నుంచి 2008 జూన్ 2వ తేదీ వరకూ ఆమె సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా వ్యవహరించారు. అంతకు ముందు ఆమె కోల్‌కతా హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూడా ఉన్న జస్టిస్ జ్ఞాన్ సుధా మిశ్రా 2010 ఏప్రిల్ 30 నుంచి 2014 ఏప్రిల్ 27 వరకూ సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజనా దేశాయ్ 2011, సెప్టెంబర్ 13 నుంచి 2014, అక్టోబర్ 29 వరకూ సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు. జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ ఆర్. భానుమతి 2014, ఆగస్టు 13 నుంచి 2020 జులై 19వరకూ సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. జస్టిస్ ఇందు మల్హోత్రా 2018 ఏప్రిల్ 27 నుంచి 2021మార్చి 13 వరకూ సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా వ్యవహరించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి నేరుగా పదోన్నతి పొందిన మొదటి మహిళా న్యాయమూర్తిగా ఆమె గుర్తింపు సంపాదించారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ 2018 ఆగస్టు 7 నుంచి 2022 సెప్టెంబర్ 23 వరకూ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ 2021 ఆగస్టు 31 నుంచి 2024 సెప్టెంబర్ 1 వరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా సేవలు అందించారు. కాగా, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా త్రివేది 2021 ఆగస్టు 31 నుంచి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న 2021 ఆగస్టు 31 నుంచి సుప్రీం కోర్టులో న్యాయమూర్తులుగా పని చేస్తున్నారు. వీరిలో జస్టిస్ బేలా త్రివేది 2025 జూన్ 9, జస్టిస్ బివి నాగరత్న 2027 అక్టోబర్ 29న పదవీ విరమణ పొందుతారు. కాబోయే సుప్రీం కోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బివి నాగరత్నను పేర్కొంటున్నారు.



ఈ ఏడాది సెప్టెంబర్ మాసంలో జస్టిస్ హిమా కోహ్లీ రిటైర్ కావడంతో, సుప్రీం కోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య రెండుకు తగ్గింది. మొత్తం 33 మంది న్యాయమూర్తులు ఉండగా, ఇద్దరే మహిళా న్యాయమూర్తులు. జస్టిస్ బేలా త్రివేది వచ్చే ఏడాది జూన్ మాసంలో రిటైర్ అవుతారు. జస్టిస్ బి. నాగరత్న పదవీకాలం 2027 అక్టోబర్ 29వ తేదీ వరకు ఉంది. పదవీ విరమణలోగా ఆమె సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. అప్పుడు ఆమె భారత దేశ మొట్టమొదటి సిజెఐగా రికార్డు సృష్టిస్తారు.

సాధించాల్సింది ఎంతో ఉంది!

భారత దేశంలో మహిళల ఆర్థిక స్వావలంబనానికి కృషి జరుగుతున్నప్పటికీ, ఈ దివగా సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఐక్యరాజ్య సమితి (యుఎన్) వ్యూహాత్మక భాగస్వామ్యాల మహిళా ప్రతినిధి డానియేల్ సేమోర్, భారత్‌లో యుఎన్ మహిళా ప్రతినిధి సుసాన్ జేన్ ఫెర్గూసన్ మీడియాతో పంచుకున్న అభిప్రాయాలను అనుసరించి, మన దేశంలో మహిళల సాధికారతకు బడ్జెట్ కేటాయింపును 6.8 శాతానికి పెంచడం హర్షణీయమే. అయితే, ఇప్పటికీ సమాజంలో స్త్రీ, పురుష సమానత్వానికి చోటు లేదు. సామాజిక కట్టుబాట్లు, సంప్రదాయాలు మహిళల అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. ప్రైవేటు భాగస్వామ్యం దాదాపుగా అసలు లేనే లేదు. కేవలం ప్రభుత్వం తరపున అందుతున్న సాయం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సరిపోదు. ప్రైవేటు భాగస్వామ్యం కూడా ఉండాలి. కానీ, ప్రైవేటు ఆర్థిక సంస్థలు ఏవీ మహిళల స్వయం ఉపాధికి పెట్టుబడులు పెట్టడం లేదు. పురుషాధిక్య సమాజం కారణంగా మహిళలకు లభిస్తున్న ప్రోత్సాహం చాలా తక్కువ. లింగ సమానత్వం అనేది ఓ భ్రాంతి. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదముద్రపడి, చట్టరూపం దాల్చినప్పటికీ, కనీసం మరో నాలుగు సంవత్సరాలు ఇది అమల్లోకి వచ్చే అవకాశాలు లేదు. వచ్చే ఏడాది జనాభా సేకరణ ప్రక్రియ పూర్తయితే, ఆ తర్వాత 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని కేంద్రం ప్రకటించింది. ఈ లాంఛనాలు పూర్తయిన తర్వాతే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలవుతుందని మోదీ సర్కారు ఇది వరకే స్పష్టం చేసింది. అమలుకాని చట్టాల వల్ల ఉపయోగం లేదు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే, ముందుగా సమాజంలో మార్పు రావాలి. సంప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో మహిళలను బానిసలుగా మార్చే విధానానికి తెరపడాలి. మూలాల్లోనే లోపాలు ఉంటే, మహిళల ఆర్థికాభివృద్ధి అసాధ్యం.

మాతృస్వామ్య వ్యవస్థ నిర్మాణంతో మహిళా సమస్యలు పరిష్కారం

ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి నేదునూరి జ్యోతి

ప్రజాపక్షం/కురవి : ప్రకృతిలో మానవ సమాజంలో మహిళ సగభాగం కనుక ఆమెకు సమాజంలో హక్కులు బాధ్యతలు పురుషునితో సమానంగా ఉండాలని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. మంగళవారం మహబూబాబాద్ మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం కురివి పార్టీ కార్యాలయంలో పద్మ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై నేదునూరి జ్యోతి, ఏపూరి లత దేవి మాట్లాడుతూ మాతృస్వామ్య వ్యవస్థ నిర్మాణం కొరకు, మహిళ విముక్తి పోరాటాలు విజయవంతం కావాలని, అందుకు మహిళలు క్రియాశీల పోరాటాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు, మహిళలను లక్షాధికారి చేస్తానని చెప్తున్న పాలకులు ముందుగా మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తూ మహిళా సాధికారికత వైపు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని నిషేధించి, అశ్లీల సాహిత్యాన్ని అరికట్టాలని, మహిళ రక్షణ చట్టాలు మరింత కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి, కురివి మండల కార్యదర్శి కరణం రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫాతిమా యకమ్మ, పద్మ, లక్ష్మి , రాణి, మాలి, హలిమ మాధవి, భాగ్యమ్మ,రాజన్న, ఉపేంద్ర, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న ఆర్‌టిసి డిఎంపై చర్యలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్

ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :కుమురం భీం ఆసిఫాబాద్ ఆర్‌టిసి డిపోలో కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న డిఎం విశ్వనాథ్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆసిఫాబాద్ బస్టాండ్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్ డిఎంగా విధులు చేపట్టినప్పటి నుంచి ఆసిఫాబాద్ డిపోలో అవినీతి అక్రమాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని ఆరోపించారు. పల్లె వెలుగు బస్సులలో ప్రయాణికులపై సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్ చార్జీలు వసూలు చేస్తున్నాడని, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన డిఎంపై అర్ఎం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికులు తప్పు చేశారని ఆరోపణలు వస్తే క్షణాల్లో వారిపై చర్యలు తీసుకునే అధికారులు, ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలని లేనిపక్షంలో ఆర్‌టిసి డిపోను ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు

ప్రజా పోరాటాలతోనే జనాదరణ

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

ప్రజాపక్షం/పాల్వంచ: ప్రజా పోరాటాలతోనే పార్టీకి గుర్తింపు ఉంటుందని, సమస్యల పరిష్కారానికి పోరాటాటు చేస్తే ప్రజలు ఆదరిస్తారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం గుండాల నాగరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజా పోరాటాలతోనే మండలంలో రోజు రోజుకు సిపిఐకి జనాధరణ లభిస్తుంద న్నారు. డిసెంబర్ 26 నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించి పార్టీ చరిత్రను, త్యాగాలను ప్రజలకు వివరించాలని, ప్రతి గ్రామం, బస్తీలో ఉత్సవాలు ఘనంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. 2025 సభ్యత్వ చేర్పింపు, పునరుద్ధరణ లక్ష్యాలను పూర్తి చేసి గ్రామస్థాయి, మండల స్థాయి మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. పాల్వంచ ప్రాంత సమగ్ర అభివృద్ధి పై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇప్పటికే వివిధ పథకాలతో రోడ్లు, డ్రైన్లు, నీటి పథకాలు శరవేగంగా పనులు పూర్తి చేయడం జరుగుతుందని మిగిలిన పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. పోడు సమస్యను పరిష్కరించడం కోసం మరో ఉద్యమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీను, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వీ పద్మ, ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నవరపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, మన్నెం వెంకన్న, కొత్త సురేష్, వేములపల్లి శ్రీను, జకరయ్య, కొంగర అప్పారావు, జక్కుల లింగేశ్వర్, ఎల్లంకి శివరావు, మాజీ ఎంపీటీసీ ఉంద్రతి శ్రీను, గురుమూర్తి, ఖాసీం, గురవయ్య, వెంకట ముత్యం, మాజీ సర్పంచులు భూక్య విజయ్, మాలోత్ హరి, సపవట్ వెంకటరమణ, జర్పుల మోహన్, బాదావత్ శ్రీను, శెట్టి ప్రసాద్, అమృతరావు, వజ్జా వాసు, మేరమ్మ, రంజిత్, సిహెచ్ శ్రీను, ఎర్రగడ్డ ప్రభాకర్, కృష్ణ, రమేష్, లచ్చిరాం, బాలు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలు, పక్కాగృహాలు

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : గుడిసెవాసుల కు పట్టాలిచ్చి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. మంగళవారం వరంగల్‌లోని శివనగర్ తమ్మర భవన్ జిల్లా కార్యాలయంలో ఖిలా వరంగల్ మండల సమితి సమావేశం మహమ్మద్ యాకూబ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా మేకల రవి హాజరై మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘనంగా పల్లె పల్లెనా వాడలలో పట్టణం లో ఎర్రజెండాలు ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభు త్వం తక్షణమే గుడిసె వాసులకు సర్వే చేయించి ప్రతిఒక్కరికి పట్టాలిచ్చి పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఏ పార్టీకి లేని చరిత్ర ఒక ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీకే ఉందని ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అన్నారు. నిరుద్యోగం పోవాలం టే వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, తద్వారా ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. వరంగల్ జిల్లాకు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మామునూరు ఎయిర్ పోర్ట్ ప్రారంభించాలని, దానివల్ల వరంగల్ జిల్లాకు భారీ పరిశ్రమలు రావడం జరుగుతుందని తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయన్నారు. డిసెంబర్ 26 నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించి పార్టీ చరిత్రను, త్యాగాలను ప్రజలకు వివరించాలని, ప్రతి గ్రామం, బస్తీలో ఉత్సవాలు ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్మియ, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంగీ ఏలేందర్, మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు ఓర్సు రాజు, జాన్ పాల్, మహమ్మద్ అక్బర్, పాషా, నల్ల తీగల కుమార్, రవీందర్, సౌందర్య, భవాని, విజయలక్ష్మి , పద్మ, పోచమ్మ, లలిత పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల తొత్తులుగా పాలకవర్గాలు

సమరశీల పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యూసుఫ్, బాల్‌రాజ్

ప్రజాపక్షం/చౌటుప్పల్ : పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని, అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోడీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ విమర్శించారు. ఎఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతులు చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని జయశ్రీ గార్డెన్స్‌లో జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అధ్యక్షవర్గంగా జరిగాయి. ముందుగా ఎఐటియుసి జెండాను రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్ ఆవిష్కరించారు. శిక్షణా తరగతుల్లో ఎఐటియుసి చరిత్ర, కార్మిక చట్టాలు, లేబర్ కోడ్ యూసుఫ్ వివరించారు. మార్క్సిస్ట్ మూల సూత్రాలను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పానుగంటి పర్వతాలు వివరించారు. ఈసందర్భంగా యూసుఫ్, బాలరాజ్‌లు మాట్లాడుతూ 1920లో ఆవిర్భావించిన ఎఐటియుసి స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని పాత్ర పోషించిందన్నారు. హక్కులసాధనలో ముందుందన్నారు. దేశంలో ఎన్‌డిఎ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని, కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల కింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని వారు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ పాలకులు ఆవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, ధరలు పెరగడంతో కార్మికుల, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, సిపిఐ సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పానుగంటి పర్వతాలు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగొని గాలయ్య, చెక్క వెంకటేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, సిపిఐ చౌటుప్పల్, నారాయణపురం, వలిగొండ, బొమ్మరామారం మండల కార్యదర్శిలు పల్లె శేఖర్‌రెడ్డి, దుబ్బాక భాస్కర్, పోలేపాక యాదయ్య, అన్నేమైన వెంకటేష్, గొరిగే నరసింహ, సహాయ కార్యదర్శులు గనబోయిన వెంకటేష్, కోరేళ్ళ మచ్చగిరి, ఎఐటియుసి మండల అధ్యక్షులు టంగుటూరి రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పాపగళ్ల శంకరయ్య నాయకులు చిలివేర్ అంజయ్య, రామలింగయ్య, రెహమాన్, కొండూరు వెంకటేష్, బద్దుల సుధాకర్, ఆరుట్ల నరేష్, సైదులు, భాస్కర్, బిక్షపతి, అంజయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వందేళ్ల పోరాట చరిత్ర సిపిఐది

పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ప్రజాపక్షం/బోనకల్ : అనునిత్యం ప్రజా, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి పోరాడిన సిపిఐకి వందేళ్ల పోరాట చరిత్ర ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండలంలోని రాపల్లి గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఈ దేశం నుండి తరిమి సేందుకు సాగిన స్వాతంత్ర సమరశీల పోరాటంలో సిపిఐ అశేష త్యాగాలను చేసిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించి 4 వేల గ్రామాలకు పైగా విముక్తి చేసి పదిలక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సిపిఐకే దక్కిందన్నారు. సిపిఐ 100 ఏళ్ల పోరాట చరిత్రను ఇంటి ఇంటికి తెలిసేలా ప్రచార కార్యక్రమాలను చేయాలని శ్రేణులకు సూచించారు. సభ్యత్వం చేర్పింపు, పునరుద్ధరణ లక్ష్యాలను పూర్తి చేసి గ్రామ స్థాయి నుండి మండల స్థాయి, ప్రజా సంఘాల మహాసభలను నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, రాపల్లి సిపిఐ శాఖ కార్యదర్శి ఏనుగు రామకృష్ణ, మండల నాయకులు ఏనుగు రవికుమార్, కొంగర రామారావు, ఏనుగు వేణు, మదుపల్లి నరేష్, ఏనుగు జయప్రద, ఏనుగు ప్రవీణ, ఉపేందరావు, తోట అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

మరాఠా కోటా రిజర్వేషన్ అంశాన్నే ప్రస్తావించడం లేదు

జాల్నా : మహారాష్ట్రలోని మరాఠా కోటా రిజర్వేషన్ ఉద్యమానికి జాల్నా ప్రాంతం కేంద్రమైనప్పటికీ శాసనసభ ఎన్నికల సందర్భంగా అక్కడ ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా అసలు ఆ అంశాన్నే ప్రస్తావించడం లేదు. దానికి బదులుగా ప్రచారంలో మహిళల సంక్షేమ పథకాలపైనే దృష్టి సారించాయి. అధికార మహాయుతి నాయకుల తమ ప్రభుత్వం అమలు చేస్తున్న లడ్కీ బహిన్ పథకం, ప్రతిపక్ష మహా వికాస్ ఆఘాడీ (ఎంవిఎ) నేతలు తాము అధికారంలోకి వస్తు మహాలక్ష్మి పథకం అమలు గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 20వ తేదీన మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో మరాఠాలకు విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఏకగ్రీవంగా బిల్లును శాసనసభ ఆమోదం తెలిపింది. అయితే మరాఠా ఉద్యమకారుడు మనోజ్ జరంగే మరాఠాలకు ఒబిసి కోటాలో రిజర్వేషన్‌లు కల్పించాలని అనేకమార్లు జాల్నాలోని అంతర్వాలి సారథి గ్రామంలో నిరాహార దీక్షలు చేశారు. దానికి సమీపంలోని బడి గొద్రి గ్రామంలో మారాఠా రిజర్వేషన్‌ల కారణంగా ఒబిసి రిజ్వేషన్ కోటపై ప్రభావం చూపించదని ప్రభుత్వం తమకు హామీ ఇవ్వాలని కోరుతూ ఒబిసి ఉద్యమకారులుఆందోళనలను నర్వహించారు. మరత్వాడా ప్రాంతంలోని జాల్నా జిల్లాలో 46 శాసనసభ స్థానాలు ఉండగా, అక్కడ మరాఠా జనాభా 32 శాతం ఉంది. ఆ జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికల సభల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే కేవలం ఉద్ధవ్ థాక్రేపై విమర్శలకే పరమితమయ్యారే తప్ప మరాఠా లేదా ఒబిసి రిజర్వేషన్ అంశాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. జాల్నా నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కేంద్ర మాజీ మంత్రి రావ్‌సాహెడ్ ధన్వే ఈ సారి తన కుమారుడు సంతోశ్ ధన్వే పోటీ చేస్తున్న భోకర్దాన్ నియోజకవర్గంలో ప్రచారంలో భాగంగా మరాఠా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించడం లేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో రావ్‌సాహెబ్ ఓటమికి జరాంగే అంశం కూడా కారణమేనని పరిశీలకులు చెబుతున్నారు. జల్నాలో ప్రచారంలో భాగంగా పిసిసి అధ్యక్షుడు నానా పటోలే కూడా రిజర్వేషన్ అంశం జోలికి వెళ్ళకుండా కేవలం గత ఎంవిఎ ప్రభుత్వ పథకాలను, మహిళల కోసం తీసుకువచ్చే మహాలక్ష్మి పథకం గురించే మాట్లాడారు. ఎన్‌సిపి (ఎస్‌పి) ఛీఫ్ శరద్ పవార్ ఈ ప్రాంతంలో జరిగిన ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా కులగణన చేపట్టాలని, రిజర్వేషన్ పరిమితిని తొలగించాలని డిమాండ్ చేశారే తప్ప నేరుగా మరాఠా రిజర్వేషన్ అంశాన్ని లేవనెత్తలేదు. శివసేనా (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే సైతం ప్రధాని మోదీ, సిఎం షిందేలపై విమర్శలకు పరిమితమయ్యారే తప్ప రిజర్వేషన్‌లపై మాట్లాడలేదు. ఏ పార్టీ కూడా ఎన్నికల ప్రచారంలో భాగంగా రిజర్వేషన్ అంశాన్ని ప్రాధాన్యత ఇవ్వలేదని స్థానిక మరాఠా ఉద్యమకారుడు అవినాశ్ కాష్టలే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయబోవడం లేదని, ఏ అభ్యర్థికి మద్దతునివ్వబోడం లేదని జరాంగే ఇటీవల చెప్పారు. మరాఠా రిజర్వేషన్ ఉద్యమాన్ని వ్యతిరేకించిన అభ్యర్థులు ఓడించి గుణపాఠం నేర్పాలని మాత్రం పిలుపునిచ్చారు.

16 మంది అభ్యర్థులు... 14 లక్షల మంది ఓటర్లు

నేడు వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు

వయనాడ్ : కేరళలోని వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గంలో బుధవారం ఉప ఎన్నికల జరగనున్నాయి. ఈ ఉప ఎన్నికల బరిలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా, సిపిఐ నుంచి సత్యం మోకరీ, బిజెపి నుంచి నవ్య హరిదాస్ సహా మొత్తం 16 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 14 లక్షల మంది ఓటర్లు వీరి భవితవ్యాన్ని నిర్ధారించనున్నారు. ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి యుడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారీ విజయం సాధించారు. 3.5 లక్షలకుపైగా మెజారిటీతో గెలుపొందారు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి నుంచి కూడా పోటీ గెలుపొందడంతో వయనాడ్ సీటుకు రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. కాగా, వయనాడ్‌ను నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావించి రాహుల్ సోదరి ప్రియాంకగాంధీని బరిలోకి దించారు. అయితే వయనాడ్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని సిపిఐ, బిజెపి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిపిఐ జోరుగా ప్రచారం సాగిస్తోంది. సోమవారంతో ఎన్నికల ప్రచారం ముగియడంతో చివరి రోజున ఈ మూడు పార్టీలు కూడా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రోడ్‌షోలు నిర్వహించాయి. ప్రియాంకకు మద్దతుగా రాహుల్‌గాంధీ ప్రచారంలో పాల్గొన్నారు. 2019–2024 మధ్య వయనాడ్ ఎంపిగా పనిచేసిన రాహుల్‌గాంధీ ప్రజల మధ్య ఉన్న తన పాపులారిటీను ఉపయోగించుకుని ఉప ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ భావిస్తోంది. కాంగ్రెస్ నాయకుడిని గెలిపిస్తే.. ఆయన రాజీనామా చేసి నియోజకవర్గాన్ని వదిలి వెళ్లారని ఎల్‌డిఎఫ్, బిజెపిలు పేర్కొంటూ ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఓటర్లను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేశాయి. ప్రియాంక కూడా రాహుల్‌గాంధీ వలే గెలిచిన తరువాత అతిథి ఎంపిగా మాత్రమే నియోజకవర్గానికి వచ్చి పోతారని చెబుతున్నాయి. సిపిఐ, బిజెపి నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజలు తనను దూరంగా ఉండమని చెప్పే వరకు తాను క్రమం తప్పకుండా వయనాడ్‌కు వస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి విస్తృతంగా సన్నాహాలు చేస్తున్నారు. వయనాడ్ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిఆర్‌పిఎఫ్, ఆర్మ్‌డ్ పోలీస్ బెటాలియన్‌లకు చెందిన పలు కంపెనీలను ఎన్నికల కోసం మోహరించారు. మొత్తం 1000 బూత్‌లలో పోలింగ్ జరగనుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అధికారులు పేర్కొన్నారు. అదే విధంగా 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లు, పోలిస్ పెట్రోలింగ్‌కు ఏర్పాటు చేశామని, బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుందన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి పోలీసుల తనిఖీల్లో 13.1729 కిలోల గంజాయి, 76.25 గ్రాముల ఎండిఎంఎ, 30 లీటర్ల విదేశీ మద్యం, రూ. 50,98,300 నగదు, 719.9 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు మళప్పురం జిల్లా అధికార యంత్రాంగం వెల్లడించింది. ఇవే కాకుండా దేశీయ తుపాకీ, 12 రౌండ్ల పేలుడు పదార్థాలను నీలాంబర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్నారన్నారు.

బిజెపి స్నేహితులకు ఇచ్చినదానికంటే మహిళలకు ఎక్కువే ఇస్తాం: రాహుల్

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రంలోని బిజెపి సర్కార్‌పై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. బిజెపి తన బిలియనీర్ స్నేహితులకు ఇచ్చినదాని కంటే ఎక్కువ డబ్బును మహిళలు, యువత, రైతులకు, పేదలకు ఇండియా కూటమి ఇస్తుందని పేర్కొన్నారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమి మహిళలకు ఇచ్చే పారితోషికాన్ని రూ. 2500లకు పెంచాలని నిర్ణయించిందన్నారు. బుధవారం జార్ఖండ్‌లో మొదటి విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాహుల్‌గాంధీ మరోసారి హామీలను గుర్తిచేశారు. జార్ఖండ్‌లోని తల్లులు, సోదరీమణులు ఖాతాల్లో మైయా సమ్మాన్ యోజన నాల్గొవ వాయిదా డబ్బులు సోమవారం జమ అయ్యాయన్నారు. ఈ పథకం ప్రత్యేకించి మహిళలు ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు దోహదం చేయడంతో పాటు ఆత్మగౌరవంతో జీవించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అందువల్లే ఈ పథకం కింద ఇచ్చే నగదును పెంచాలని నిర్ణయించామని రాహుల్ మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబరు నుంచే ఈ పథకం కింద మహిళల పారితోషికాన్ని రూ. 2500 ఇవ్వనున్నట్లు రాహుల్ చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో 53 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

మోదీ ప్రచారం చేసినా బిజెపి తగ్గిన సీట్లు: పవార్

జాల్‌గావ్ : ప్రధాని నరేంద్రమోదీపై ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రీం శరద్ పవార్ విరుచుకుపడ్డారు. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బిజెపి అగ్రనేతలంతా ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నప్పటికీ కాషాయ పార్టీ 10–12 సీట్లు కోల్పోయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం కూడా ప్రధాని మోదీ చంద్రపూర్ జిల్లాలోని చిమూర్, సోలాపూర్, పుణెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా, జాల్‌గావ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవార్ మాట్లాడుతూ అయితే ఎన్నికల ర్యాలీల్లో పాల్గొనడం ప్రధానిగా ఆయన హక్కు అయినప్పటికీ పెద్ద ఎత్తున దృష్టి సారించాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఒక విషయాన్ని దృష్టి పెట్టుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 16 ర్యాలీల్లో పాల్గొనప్పటికీ బిజెపి 10–12 సీట్లను కోల్పోయిందని పవార్ గుర్తుచేశారు. అందువల్లే మోదీ ఎన్ని ర్యాలీల్లో పాల్గొన్న నష్టమేమీ లేదని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కుల ఆధారిత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారంటూ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) చీఫ్ రాజ్‌ఠాక్రే చేసిన వ్యాఖ్యలను పవార్ కొట్టిపడేశారు. ఎన్నికలకు కొద్ది నెలల ముందే అతను వెలుగులోకి వచ్చాడని, తాను అతన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదన్నారు. బిజెపినేత రావ్‌సాహెబ్ దాన్వేపై కూడా మండిపడ్డారు.

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శ

ఆ కుటుంబం దేశాన్ని పాలించడానికే పుట్టామనుకుంటోంది!

చిమూర్ : దేశాన్ని పాలించడానికే తాము పుట్టామని కాంగ్రెస్ రాయల్ ఫ్యామిలీ (గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి) భావిస్తోందని, ఆ పార్టీ మనస్తత్వం అదే అని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీల అభివృద్ధి కుంటుపడడానికి కాంగ్రెస్ కారణం అని ఆరోపించారు. రిజర్వేషన్లు అంటేనే కాంగ్రెస్ చిరాకు పడుతోందని మండిపడ్డారు. 1980 దశకంలో రాజీవ్ గాంధీ పార్టీకి నాయకత్వం వహించినప్పుడు దళితులు, ఆదివాసీలు అనుభవిస్తున్న ప్రత్యేక హక్కులను ప్రశ్నిస్తూ ఓ ప్రకటన ప్రచురించారని గుర్తుచేశారు. దాన్ని సోషల్ మీడియాలో షేర్ చేశారని, ఇది ఆ పార్టీ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరిని ప్రతిబింబిస్తోందని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చంద్రాపుర్‌లో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'దేశాన్ని విచ్ఛిన్న చేయడానికి కాంగ్రెస్ ఆడుతున్న డేంజరెస్ గేమ్. ఒకవేళ ఆదివాసీలు కులాలుగా విడిపోతే వారి గుర్తింపు, ఐక్యత విచ్ఛిన్నమవుతాయి. కాంగ్రెస్ యువరాజు విదేశాల్లో ఉన్నప్పుడు ఆయనే స్వయంగా ప్రకటించారు. అందుకే కాంగ్రెస్ చేస్తున్న ఈ కుట్రను మనం బలికాకూడదు. మనం ఐక్యంగా ఉండాలి. మహావికాస్ అఘాడీ(ఎంవిఎ) అతి పెద్ద అవినీతి కూటమి. రాష్ట్రంలో అభివృద్ధికి అడ్డుపడుతోంది' అని అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవడంలో కాంగ్రెస్ డబుల్ పిహెచ్‌డి చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్ల మహారాష్ట్ర గత రెండున్నరేళ్లలో డబుల్ స్పీడ్‌తో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఈ గడ్డపై 12 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని, 100 రైల్వే స్టేషన్లను ఆధునీకరించామని వెల్లడించారు.

'మహారాష్ట్ర అభివృద్ధికి బిజెపి సంకల్ప పత్ర గ్యారంటీ'

బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి గెలుస్తుందనడానికి ఈ సభకు భారీ స్థాయిలో తరలివచ్చిన ప్రజలే నిదర్శనం అని ప్రధాని మోదీ అన్నారు. 'బిజెపి సంకల్ప పత్ర మేనిఫెస్టో, మహారాష్ట్ర అభివృద్ధికి గ్యారంటీ. దేశం మొత్త ఒకే రాజ్యాంగం ఉండేలా చేయడానికి(ఆర్టికల్ 370 రద్దును ఉద్దేశించి) ఏడు దశాబ్దాలు పట్టింది. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తిరిగి తీసుకురావడానికి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలను మీరు అనుమతిస్తారా' అని ప్రధాని మోదీ ప్రశ్నించారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై స్పందించాలని

ఇడికి ఢిల్లీ హైకోర్టు నోటీస్ జారీ

వాదోపవాదనల మధ్య కేసు విచారణ డిసెంబరు 19కి వాయిదా

న్యూఢిల్లీ : ఆరోపించబడిన ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఏజెన్సీ ఫిర్యాదుపై తనకు జారీచేసిన సమన్లను సవాల్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని మంగళవారం ఢిల్లీ హైకోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని కోరింది. ఈ క్రిమినల్ కేసులో విచారణపై స్టే ఇచ్చేందుకు జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి నిరాకరించారు. కేజ్రీవాల్ సవాల్ చేసిన ట్రయల్ కోర్టు ఆదేశం రెండు నెలల క్రితం నాటిదని, అది తాజా ఆదేశం కాదని జస్టిస్ మనోజ్‌కుమార్ ఓహ్రి తెలిపారు. ఇడి నమోదు చేసిన ఈ కేసులో తనకు సమన్లు జారీచేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు నోటీస్ జారీ చేసింది. ఇడి ఫిర్యాదు నిర్వహణ తీరును ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరపు న్యాయవాది ప్రశ్నించారు. సమన్లు జారీచేయడం అస్తవ్యస్తంగా ఉందన్నారు. సమన్లు జారీ చేసింది ఒక అధికారి ఒకరు అయితే, ఫిర్యాదును దాఖలు చేసింది మరొకరని ధర్మాసనానికి విన్నవించారు. సెప్టెంబరు 17న ట్రయల్‌కోర్టు జారీ చేసిన ఆదేశాలను ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సవాల్ చేశారు. అది ఆయనకు జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ రద్దుకు సంబంధించినవి. హైకోర్టులో ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ న్యాయవాది ఫిర్యాదు నిర్వహణపై ప్రాథమిక అభ్యంతరంపై ఆయన తన వాదన వినిపించారు. కేజ్రీవాల్ అభ్యర్థనను రెండవ పునర్విమర్శ పిటిషన్‌గా పేర్కొన్నారు. ఇది సిఆర్‌పిసిలోని సెక్షన్ 482గార్బ్ కింద దాఖలు చేయబడిందని, అయితే అదే చట్టంలో నిరోధించబడిందని ఇడి తరపు న్యాయవాది వాదించారు. ఈ పిటిషన్‌లో లేవనెత్తిన ఆధారాలు ట్రయల్ కోర్టు ముందు దాఖలు చేసిన వాటికి సమానంగా ఉన్నాయని, అందులో వ్యత్యాసాలు ఏమీలేవని వాదనలు వినిపించారు. అయితే కేజ్రీవాల్ తరపు న్యాయవాది ఇడి న్యాయవాది వాదనలకు అభ్యంతరం తెలియజేశారు. తన క్లయింట్ అరవింద్ కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసిన ఇడి ఆఫీసర్ అసిస్టెంట్ డైరెక్టర్ ర్యాంక్‌కు చెందినవారు కాగా, అదే హోదా కు చెందిన ఇడి ఆఫీసర్‌చే ఫిర్యాదు నమోదు చేయలేదని వాదించారు. సమన్లపై సంతకం చేసిన ఆఫీసర్ అందుబాటులో ఉన్నప్పటికీ ఇప్పుడు కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసిన అధికారి మరొకరని అభ్యంతరం తెలిపారు. కేసు వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం ఈ కేసు విచారణను డిసెంబరు 19 నాటి జాబితాలో చేర్చించింది.

17 ప్రదేశాలలో ఇడి సోదాలు

బంగ్లాదేశీయుల అక్రమ చొరబాట్ల కేసులో నకిలీ ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టులు స్వాధీనం

రాంచీ : బంగ్లాదేశ్ జాతీయుల అక్రమ చొరబాట్లకు సంబంధించి మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా పశ్చిమబెంగాల్‌తో పాటు ఎన్నికలు జరగబోతున్న జార్ఖండ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మంగళవారం సోదాలు నిర్వహించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. జార్ఖండ్‌లో పోలింగ్ జరగడానికి ఒక రోజు ముందు ఈ రెండు పొరుగు రాష్ట్రాలలో ఇడి రాంచీ కార్యాలయం అధికారులు మొత్తం 17 స్థలాలలో సోదాలు నిర్వహించాయి. అయితే రాంచీలోని బారియతులో ఉన్నటువంటి ఒక హోటల్‌లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) బందోబస్తు నడుమ సోదాలు జరిపేందుకు వెళుతున్న దృశ్యాలు, రాంచీ నగరంలోని ఒక రిసార్ట్‌లో జరుగుతున్న సోదాల దృశ్యాలను మీడియా బృందాలు చిత్రీకరించాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బృందాలు డాక్యుమెంట్లు, లెడ్జర్ ఎంట్రీలు, ఫైనాన్షియల్ రికార్డులను లోపల తనిఖీ చేస్తున్న దృశ్యాలు వీడియో కెమెరాలకు చిక్కాయి. కాగా మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇడి తన అధికారిక 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించింది. నకిలీ ఆధార్ కార్డులు, ఫోర్జరీ పాస్‌పోర్టులు, అక్రమ ఆయుధాలు, స్థిరాస్తి డాక్యుమెంట్లు, నగదు, జ్యువెలరీ, ప్రింటింగ్ పేపర్, యంత్రాలు, ఫోర్జింగ్ ఆధార్ కోసం వినియోగించిన బ్లాంక్ ప్రొఫార్మాలు సోదాల సమయంలో కనుగొని వాటిని స్వాధీనపర్చుకున్నట్లు తెలియజేసింది. అయితే సోదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఇడి ప్రకటన తెలియజేసింది. వీటిని స్వాధీనం చేసుకుంటున్న దృశ్యాలను ఇడి తన పోస్టులో అటాచ్‌చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) కింద ఈ కేసును ఇడి సెప్టెంబర్‌లో నమోదు చేసింది. బంగ్లాదేశ్ నుంచి మహిళలు జార్ఖండ్ రాష్ట్రంలోకి చొరబాట్లు, మానవ అక్రమ రవాణా, సిద్ధాంతపరమైన నిధులు సమకూర్చడం తదితన అభియోగాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు జరుపుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిజెపి నేతలు ఈ విషయంలో జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడుతూ అక్రమ చొరబాట్లకు నిధులు సమకూరుస్తోందని ఆరోపించారు. ఫలితంగా బంగ్లాదేశ్ చొరబాటుదారులు గిరిజన ప్రాబల్యం అధికంగా ఉన్నటువంటి సంథాల్ పరగణా, కొల్హాన్ రీజియన్లలో నివసిస్తూ వారిని మాటలతో ప్రలోభపర్చుకుని, పెళ్లిళ్లు చేసుకుని అక్కడే స్థిరపడి భూములను సొంతం చేసుకుంటున్నారని ఇటీవలి ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆరోపించిన విషయం తెలిసిందే. జెఎంఎం సంకీర్ణ ప్రభుత్వం రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు చొరబాటుదారులకు జార్ఖండ్‌ను ధర్మశాలగా మార్చివేసిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ సోమవారం ఆరోపించిన విషయం విదితమే. జార్ఖండ్‌లోని సెరాయికెలాలో సోమవారం నాడు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాట్లాడుతూ బిజెపికి ఓట్లువేసి అధికారంలోకి తీసుకువస్తే చొరబాటుదారులు గిరిజనుల నుంచి సొంతం చేసుకున్న భూములను స్వాధీనం చేసుకుని తిరిగి గిరిజలకు అప్పగిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

ఇ-మెయిల్స్, రాతపూర్వక

లేఖలకు మాత్రమే అనుమతి

కేసుల అత్యవసర జాబితా, విచారణ విషయంలో సిజెఐ సంజీవ్ ఖన్నా స్పష్టీకరణ

న్యూఢిల్లీ : కేసుల అత్యవసర జాబితా, విచారణ కోసం మౌఖిక సమర్పణలు అనుమతించబడవని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సంజీవ్ ఖన్నా మంగళవారం నాడు స్పష్టం చేశారు. న్యాయదాదులు దీని కోసం ఇమెయిల్స్ లేదా రాతపూర్వక లేఖలు మాత్రమే పంపించాలని సిజెఐ కోరారు. సాధారణంగా న్యాయవాదులు తమ కేసులను సిజెఐ నేతృత్వం వహించే ధర్మాసనం ముందు అత్యంత కీలక జాబితాలలో చేర్చేందుకు రోజు ప్రొసీడింగ్స్ ప్రారంభంలో, అత్యవసర కారణాలపై విచారణ కోసం అభ్యర్థిస్తుంటారు.'రాతపూర్వ క, మౌఖిక సమర్పణలు ఏవీ ఉండవు. కేవలం ఇమెయిల్స్ లేదా రాతపూర్వక స్లిప్/లేఖలను మాత్రమే అనుమతిస్తాం. ఎందుకు అత్యవసరమో దానికి గల కారణాలు తెలియజేస్తే చాలు' అని సిజెఐ తెలియజేశారు. న్యాయపరమైన సం స్కరణల కోసం ఒక పౌరకేంద్రీకృత ఎజెండాను భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా వివరించారు. పౌరులందరూ వారి వారి స్థాయిని బట్టి కాకుం డా సులభంగా న్యాయాన్ని పొందేందుకు ఒకే విధమైన పద్ధతి ఉండటం న్యా యవ్యవస్థ యొక్క రాజ్యాంగ విధి అని, దానిని తప్పకుండా నెరవేరుస్తామని సిజెఐ భరోసా ఇచ్చారు. సోమవారం నాడు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌప ది ముర్ము జస్టిస్ సంజీవ్‌ఖన్నాను సిజెఐగా ప్రమాణం చేయించారు. ప్రజాస్వామ్యానికి మూడవ స్తంభమైన న్యాయవ్యవస్థకు గౌరవప్రతిష్టలు ఇనుమడించేలా సారథ్యం వహిస్తానని ఆయన ప్రమాణస్వీకారం సందర్భంగా ఉద్ఘాటించారు. మహోన్నతమైన మన దేశ పౌరులు అందరికీ సులభంగా న్యాయం అందటం మన రాజ్యాంగం మనకునిర్దేశించిన విధి అని సంజీవ్‌ఖన్నా ఈ సం దర్భంగా వ్యాఖ్యానించారు. కేసుల బ్యాంక్‌లాగ్‌లను తగ్గించడం, సరసమైన ధరపై వ్యాజ్యం చేయడం, సంక్లిష్ట న్యాయ ప్రక్రియను సులభతరం చేయడం సహా న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించినట్లు ఖన్నా నొక్కిచెప్పా రు. న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు స్నేహపూర్వక ధోరణి నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తన పనిలో స్వీయ మూ ల్యాంకన విధానాన్ని అవలంభించాలని భారత ప్రధాన న్యాయమూర్తి లక్ష్యం గా పెట్టుకున్నారని సుప్రీంకోర్టు తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. పౌరులకు అర్థమయ్యేలా తీర్పులు ఇవ్వడం, మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆ ప్రకటన వివరించింది.

జార్ఖండ్ మరో హర్యానా కాబోదు

కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మిర్



రాంచీ : హర్యానా మాదిరిగా కాకుండా జార్ఖండ్‌లో ముఠాతత్వం లేదని, సీనియర్ నాయకుల ఏకాభిప్రాయం ద్వారానే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని జార్ఖండ్ ఎఐసిసి ఇన్‌ఛార్జ్ గులాం అహమద్ మిర్ అన్నారు. జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ఇండియా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పవనాలు వీస్తున్నాయని 'పిటిఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మిర్ పేర్కొన్నారు. జెఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జెడి, సిపిఐ(ఎంఎల్) కూటమి గత ఎన్నికల కంటే కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తుందని, 81 స్థానాల అసెంబ్లీలో 50 స్థానాలను దాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో జెఎంఎం 30, కాంగ్రెస్ 16, ఆర్‌జెడి ఒక స్థానంలో గెలుపొందగా, ఒంటరిగా పోటీ చేసిన సిపిఐ(ఎంఎల్) ఒక స్థానాన్ని గెలుచుకుంది.

మణిపూర్‌లో పలువురు చిన్నారులు, మహిళలు మిస్సింగ్

ఇంఫాల్: మ

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
బుధవారం, నవంబరు 13

కులగణన ప్రయోజనం

కులగణనను జాతీయ ఎజండాలోకి తేవటంలో 'ఇండియా' కూటమి సఫలమైంది. వచ్చే సంవత్సరంలో నిర్వహిస్తారని చెప్పబడుతున్న జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్)లో దీన్ని చేర్చాలని డిమాండ్ చేస్తున్నది. అయితే బిజెపి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం ఇంతవరకు సానుకూలంగా స్పందించలేదు – వ్యతిరేక అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి. కాగా, దాని గురుపీఠం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అట్టడుగు తరగతుల సంక్షేమం కోసం కులగణన చేబడితే మంచిదే అని అభిప్రాయపడింది. బ్రిటీష్ వారికాలంలో 1931లో నిర్వహించిన కులగణనే ఇప్పటికీ ఆధారం. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాందోళనకు తలొగ్గి లేదా రాజకీయ అవసరాల కోసం ఒ.బి.సి.లకు రిజర్వేషన్ పెంచుతూ చట్టాలు చేయగా, అవి సుప్రీంకోర్టులో ఛాలెంజి చేయబడినపుడు, ఒ.బి.సి.ల జనాభా అంచనాలకు ప్రాతిపదికను ధర్మాసనం ప్రశ్నిస్తూ, సాధికారిక సమాచారం లేనందున వాటి చెల్లుబాటును కొట్టివేస్తున్నాయి. అయితే కుల జనగణన ప్రయోజనాల్లో అదొక పార్శ్వం మాత్రమే. 10 శాతం ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కలుపుకుంటే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు ఇప్పటికే 60శాతానికి చేరాయి. నయా ఉదార విధానాలు ప్రవేశించాక ప్రభుత్వరంగం క్రమంగా క్షీణింపుకు లేదా ప్రైవేటీకరణకు గురవుతున్నది. దాంతో రిజర్వేషన్‌లు వర్తించే ఉద్యోగాలు తగ్గుతున్నాయి.

కులగణన ప్రధాన ప్రయోజనం సామాజిక న్యాయం. జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల దామాషా ప్రకారం సంక్షేమ పథకాల ప్రయోజనాలను అదే దామాషాలో అందజేయటం. మండల్ కమిషన్ సిఫారసులు అమలులోకి వచ్చాక కూడా 27శాతం ఒబిసి రిజర్వేషన్‌లలో సింహభాగాన్ని ఆ కులాలలోని ఆధిక్య కులాలవారు ఎగరేసుకుపోతున్నారనే ఆరోపణలు బలపడుతున్నాయి. ఎస్‌సి వర్గీకరణకు కూడా ఇదే ప్రాతిపదిక. (దీన్ని సుప్రీంకోర్టు సమర్థించినా ఆ తీర్పు అమలుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయలేదు. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు ఉపకులాల వర్గీకరణకు కమిషన్‌లు వేశాయి). బిజెపి కులగణనకు ఇంతవరకు సుముఖత తెలియజేయకపోయినా, రాజకీయ లబ్ధికోసం ఒబిసి ఆధిక్య కులాలను ఎత్తిచూపుతూ వారిలోని అత్యంత వెనుకబడిన కులాలను పదవుల ఆశతో కూడగడుతున్నది. మరో చిత్రమేమంటే, కాంగ్రెస్ పార్టీ స్వప్రయోజనం కోసం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల్లో చీలిక తెస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ ఝార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నిందాప్రచారం చేస్తున్నారు.

కాగా, తాము అధికారంలోకి రాగానే జాతీయ స్థాయిలో అధికారికంగా కులగణన చేబడతాం, రిజర్వేషన్‌లపై 50శాతం సీలింగ్ గోడను బద్దలు కొడతాం అంటున్నారు కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధి. ఆయన తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారమే తెలంగాణలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 'సమగ్ర కుటుంబ సర్వే' పేరుతో కులగణన షురూ చేసింది. ఇది దేశానికే ఆదర్శం అంటున్నారు రాహుల్‌గాంధి. 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిలో కుటుంబ ఆర్థిక – సామాజిక స్థితిగతులకు సంబంధించిన ప్రశ్నలకు ప్రతిఘటన ఎదురవుతోంది. ఆ సమాచారం ఉపయోగించి తాము పొందుతున్న సంక్షేమ పథకాలు ప్రయోజనాన్ని ప్రభుత్వం రద్దు చేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుతామని, వాస్తవ పరిస్థితి బేరీజు వేసుకుని, అర్హులందరికీ ప్రయోజనాలు అందించేందుకే ఈ సర్వే అని మంత్రులు, అధికారులు నచ్చజెబుతున్నారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ కులగణనను వ్యతిరేకించకుండానే ఆ అసంతృప్తికి ఆజ్యం పోస్తున్నది. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న 112 బిసి కులాలు విద్య, ఉద్యోగాల్లో 29 శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నాయి. ముస్లిం బిసిలకిచ్చిన 4 శాతం రిజర్వేషన్ కూడా అందులో చేరి ఉంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో వాగ్దానం చేసింది. బిసి డిక్లరేషన్‌లో పెట్టింది.

బిసి కులగణన చాలా సున్నితమైన అంశం. మండల్ కమిషన్ సిఫారసులు వెల్లడిస్తే అగ్రవర్ణాల నుంచి ఏదో కల్లోలం వస్తుందన్న భయంతో ఆ నివేదికను ఇందిరాగాంధి ప్రభుత్వం చాలా సంవత్సరాలు తొక్కి పట్టింది. 2011లో నిర్వహించిన సామాజిక – ఆర్థిక, కులజనగణను కేంద్ర ప్రభుత్వం బయటపెట్టలేదు. కర్నాటకలో 10ఏళ్ల క్రితమే అటువంటి సర్వే నిర్వహించి, తుది నివేదికను ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సమర్పించినా అది వెలుగు చూడలేదు. బిహార్‌లో నితీష్‌కుమార్ ప్రభుత్వం కులగణన నిర్వహించి, దాని ప్రకారం బిసిలకు, అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్‌లు పెంచుతూ తెచ్చిన రెండు చట్టాలను పట్నా హైకోర్టు కొట్టివేసింది. తమిళనాడు ప్రభుత్వం అత్యంత వెనుకబడిన తరగతుల్లో వన్నియార్‌లకు 10.5 శాతం కోటా కల్పించగా, కాలం చెల్లిన సమాచారం ఆధారంగా ఈ రిజర్వేషన్ కల్పించారని మద్రాసు హైకోర్టు అభిప్రాయపడింది. ఆ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. మరాఠాలకు రిజర్వేషన్ కల్పించిన మహారాష్ట్ర చట్టం కోర్టులో నిలవలేదు. ఉత్తరాదిన గుజ్జార్‌లకు రిజర్వేషన్‌లు కోర్టులో తిరస్కరణకు గురైనాయి. అభివృద్ధి ఫలాల్లో జనాభా దామాషాలో ఎవరి కోటా వారికి దక్కాలంటే తాజా కులగణన తప్పనిసరి. సామాజిక న్యాయం ఉద్దేశించిన ఏ చర్య అయినా అగ్రవర్ణాల వ్యతిరేకతకు గురవుతుంది. ఇవాళ ఓట్లకోసం బిసి జపం చేస్తున్న బిజెపి, మండల్ కమిషన్ నివేదిక అమలును వి.పి. సింగ్ ప్రభుత్వ ప్రకటించగానే బిహార్‌లో అగ్రవర్ణ విద్యార్థులు ప్రారంభించిన ఆందోళనకు బిజెపి ఆజ్యం పోసింది. మండల్ సిఫారసుల ప్రభావం నుండి దృష్టి మరల్చేందుకు మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ (అయోధ్య రామాలయం) ఆందోళన మొదలుపెట్టింది. ఆర్ఎస్ఎస్ తన పరివారాన్ని రంగంలో దించింది. ఒకవేళ జాతీయస్థాయిలో కులగణన జరిగితే దాని తర్వాత అగ్రవర్ణాల అధికారం, ఆధిపత్యంపై తీవ్రప్రభావం గల అంశాలు ముందుకు రావచ్చు. ఏ మౌలికమైనా మార్పుకైనా ప్రతిఘటన తప్పదు. దాన్ని ఎదిరించేందుకు మెజారిటీ సమాజం సిద్ధపడినపుడే సామాజిక న్యాయం సిద్ధిస్తుంది.

మానవాళి దయాగుణమే విశ్వశాంతికి పునాది!

మానవీయ గుణాల్లో దయ, కరుణ, క్షమాగుణం లాంటివి అతి ప్రధానమైనవి. దయచూపడం ఓ సుగుణం అని అర్థం చేసుకోవాలి. దయను పంచడం ఓ అలవాటు కావాలి. దయ కలిగిన వారిలో దైవత్వం ఉట్టిపడుతుంది. దయాగుణం కలిగిన మానవ సమాజం ప్రశాంత వాతావరణంలో సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. దయ పంచని వారు కఠినాత్ములుగా పరిగణించబడతారు. ఇలాంటి అతి ముఖ్యమైన మానవీయ దయాగుణం ప్రాధాన్యాన్ని ప్రపంచ మానవాళికి గుర్తు చేయడానికి, దాని శక్తిని అవగాహన పర్చడానికి 1998 నుంచి ప్రతి ఏట 13 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ దయ దినోత్సవం (వరల్డ్ కైండ్‌నెస్ డే) నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మన దైనందిన జీవితాల్లో దయాగుణానికి పెద్ద పీట వేయబడింది. సున్నిత మనస్కుల్లో దయాగుణం ఒక శాశ్వత సుందర ఆభరణంగా నిలుస్తుందని ప్రజలకు తెలియపర్చడం, సహానుభూతిని అలవాటు చేసుకోవడం, అర్థవంతంగా జీవితాన్ని గడపడం, సమన్వయ భావనలతో ఇరుగుపొరుగుకు చేయూతనివ్వడం లాంటివి దయామయులకు మాత్రమే సాధ్యమవుతాయి. దయగల వ్యక్తులు ఉదారంగా, ప్రేమగా, సదుద్దేశ్యంతో ఉంటారు. అసంకల్పితంగా పరులకు సహాయం చేయడం, నిస్వార్థంగా అవసరార్థులకు సేవలు అందించడం, సత్కార్యాలకు పూనుకోవడం లాంటి సద్గుణాలు దయామయుడిలో కనిపిస్తాయి. వారిలో నైతికత, నీతి, నిజాయితీ, సేవా తత్పరత, నిబద్ధత, ప్రేమాభిమానాలు, విలువలతో కూడిన జీవన విధానాలు కనిపిస్తాయి.

బాల్యం నుంచే దయాగుణాన్ని నేర్పించాలి:

దయాగుణాన్ని పిల్లల్లో అలవాటు చేయడం, బడి పిల్లల చేత ఇతరులకు సేవ అందించడాన్ని అలవాటు చేయడం, చిన్నారుల చేతుల మీదుగా పేదలకు సహాయం చేయించడం, వారి పుట్టిన రోజులను పేదల పిల్లల మధ్య జరుపుకోవడం, దయాగుణం ప్రాధాన్యాన్ని వివరించడం, దానధర్మాలు చేయడం, నిస్సహాయులకు చేయూత అందించడం, దయగల వ్యక్తులను సన్మానించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. అనాథాశ్రమ వాసులకు సహాయం చేయడం, అవసరార్థులకు తగు చేయూతనివ్వడం కనీస కర్తవ్యంగా భావించి దయాగుణాన్ని నరనరాల్లో నింపుకుందాం, దయ అనే వృక్షం నీడన జీవించడం అలవాటు చేసుకుందాం.

(13 నవంబర్ ప్రపంచ దయ దినోత్సవం)

డా. బిఎం రెడ్డి, 9949700037

బంగ్లాదేశ్ రాజకీయాలలో ట్రంప్ ప్రకంపనలు

నిత్యా చక్రవర్తి

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయంతో బంగ్లాదేశ్‌లో మూడు నెలల క్రితం ప్రధాన సలహాదారుడు డాక్టర్ ముహమ్మద్ యూనుస్ నేతృత్వంలో ఏర్పాటైన మధ్యంతర ప్రభుత్వంతో పాటు 18 కోట్ల జనాభా కలిగిన ఆ దేశ రాజకీయాలు కూడా తాజా సంక్షోభంలో చిక్కుకున్నాయి. కేవలం వారం రోజుల క్రితమే ట్రంప్‌కు దక్కిన గెలుపు, బంగ్లాదేశ్ రాజకీయ వ్యవస్థను ఎంతగా కుదిపేసిందంటే, ఢాకా రాయబార వర్గాలలో డాక్టర్ యూనుస్ రాజీనామాపై చర్చలు జరిగేంతగా. ఆ పని ఎప్పుడు చేస్తారనేది ప్రశ్న?

వాషింగ్టన్ డిసిలో హిల్లరీ క్లింటన్ మనిషిగా పేరున్న డాక్టర్ యూనుస్ అంటే అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌కు రుచించదు. ఈ విషయం ట్రంప్ దక్షిణ ఆసియా సలహాదారుల గురించి తెలిసిన ప్రతి ఒక్కరికీ తెలిసిందే. ఎన్నికలకు కేవలం కొద్ది రోజుల ముందు తన దీపావళి సందేశంలో భాగంగా బంగ్లాదేశ్ గందరగోళంలో ఉందని, హిందువులపై దాడులు జరుగుతున్నాయని, తాను అధ్యక్షుడినై ఉంటే వాటిని అనుమతించే వాడిని కాదన డం ద్వారా ట్రంప్ తన వైఖరిని స్పష్టం చేశారు. ట్రంప్ మదిలో ఏముందో యూనుస్ కు అవగతమయ్యేందుకు ఈ ఒక్క సంకేతం చాలు.

అమెరికా ఎన్నికల ఫలితాలు వెలువడిన నవంబర్ 5వ తేదీ తరువాత ఆవామీ లీగ్ కార్యకర్తలకు తిరిగి ఊపు వచ్చింది. ట్రంప్ విజయం పట్ల అభినందనలు తెలియజేస్తూ పంపిన సందేశంలో ప్రధాన మంత్రి అని షేక్ హసీనా సంతకం చేయడం, అందు కు భారతదేశం అనుమతించడం కీలకాంశం. వాస్తవమేమిటంటే ఆగస్టు 5న షేక్ హసీనా రాజీనామా లేఖపై సంతకం చేయలేదు. బంగ్లాదేశ్‌లో ఉంటే అక్క డే హతమారుస్తారేమోననే భయంతో ఆమె కుమారు డు, కుమార్తెల సలహా మేరకు ఆమె సంతకం చేసేందుకు సిద్ధమైనప్పటికీ 15 నిమిషాలలో బలవంతంగా దేశాన్ని విడిచిపోవాల్సి రావడంతో ఆ పని చేయలేకపోయారు.

హసీనా రాజీనామా లేఖను తమ కార్యాలయంలో కనుగొనలేకపోయామని బంగ్లాదేశ్ అధ్యక్షుడు షాబుద్దీన్ బహిరంగంగా చెప్పిన తరువాత ఈ విషయం నిర్ధారణ అయింది. ఇది విపక్ష వ్యతిరేక విద్యార్థి సంఘం మద్దతుదారులను మరింత ఆగ్రహోద్రులను చేసింది. తక్షణమే అధ్యక్షుడిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ సైన్యాధ్యక్షుడు గట్టి మద్దతు కారణంగా అధ్యక్షుడు ఇప్పటికీ ఆ పదవిలో ఉన్నా అస్థిరత కొనసాగుతూనే ఉంది.

ట్రంప్ గెలిచిన వెంటనే చోటు చేసుకున్న పరిణామమేమిటంటే, ఆగస్టు 5 తరువాత అనేక మంది మాజీ ఎంపిలు హత్యకు గురవడం, ముఖ్య నాయకులు అజ్ఞాతంలో తలదాచుకోవటం, పార్టీ కార్యాలయాలు అనేకం దగ్ధం అవడంతో ఇప్పటి వరకు కంటికి కనపడకుండా జాగ్రత్త పడిన ఆవామీ లీగ్ కీలక మద్దతుదారులు అకస్మాత్తుగా తిరిగి సంఘటితమవుతున్నారు. కాలం తిరగబడబోతుందని, తమ రోజులు దగ్గరలోనే ఉన్నాయనే రహస్య సందేశాలు వారికి వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆవామీ లీగ్ విద్యార్థి విభాగం నవంబర్ 10వ తేదీన విద్యార్థి ఉద్యమ అమరుడు నూర్ హుస్సేన్ స్మారకార్థం ఢాకా ప్రధాన ప్రాంతంలో బహిరంగ సభకు పిలుపునిచ్చింది. తమను ర్యాలీ నిర్వహించేందుకు అనుమతించబోరని తెలిసి కూడా పిలుపునివ్వడం ధైర్యానికి, ప్రతిఘటనకు సంకేతం.

ఆ సభ జరగనప్పటికీ, దానికి హాజరయ్యేందుకు వచ్చిన వారి అరెస్టులు, లాఠీ ఛార్జ్‌లు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. ఆగస్టు 5వ తేదీకి ముందు కానీ తరువాత కానీ అవామీ లీగ్ నుంచి నామమాత్రపు కార్యాచరణ కూడా ఊహించని యూనుస్ నేతృత్వంలోని బంగ్లా ప్రభుత్వానికి తాజా పరిణామం ఆందోళన కలిగిస్తోంది. బంగ్లాదేశ్‌లో ఏకమవడమే కాకుండా విదేశాలలో కూడా అవామీ లీగ్ పురోగతి సాధిస్తుంది. అవామీ లీగ్ విదేశీ శాఖలు యుకె, యుఎస్‌లో బలంగా ఉన్నాయి. అవి భారీగా నిధులను కూడా సమకూరుస్తాయి. అమెరికాలో ట్రంప్ దక్షిణాసియా సలహాదారులతో అవామీ లీగ్ సీనియర్ నాయకులు లాబీయింగ్ చేస్తున్నారు. వారికి మంచి స్పందన కూడా కనిపిస్తోంది. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ విదేశీ విభాగం సైతం వాషింగ్టన్‌లో లాబీయింగ్ చేస్తుండగా, ఇప్పటి వరకు వారు అవామీ లీగ్ కంటే వెనుకబడి ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి 20న ట్రంప్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆ ప్రభుత్వంలో బంగ్లాదేశ్ విధానం తప్పక ఒక రూపు తీసుకుంటుంది.

ఢాకాలో గత కొద్ది రోజులుగా సలహాదారుల బృందంలోని రాజకీయ పార్టీలు, విద్యార్థి నాయకుల మధ్య ఉధృత పోరాటాలు సాగుతున్నాయి. సలహా మండలిలో మరింత ప్రాతినిధ్యం పెరగాలని బిఎన్‌పి, జమాత్–ఎ–ఇస్లామీ డిమాండ్ చేస్తున్నాయి. వివక్ష వ్యతిరేక విద్యార్థి సంఘం కూడా మరిన్ని స్థానాల కోసం డిమాండ్ చేస్తున్నది. వాస్తవానికి మరో ఆరుగురు కొత్త సలహాదారులను తీసుకోవాలని నిర్ణయం జరిగింది. కానీ, ముగ్గురిని మాత్రమే తీసుకోవడంతో సలహాదారుల సంఖ్య 24కు చేరింది. ఆ ముగ్గురు సలహాదారులు నవంబర్ 10న ప్రమాణ స్వీకారం చేశారు. వారు ఇప్పటికే డాక్టర్ యూనుస్ సహాయకుడిగా పని చేస్తున్న జమాత్ మద్దతుదారుడు మహఫూజ్ ఆలం, పారిశ్రామిక వేత్త షేక్ బహారుద్దీన్, సినీ నిర్మాత మొస్తఫా సర్వార్ ఫరూకీ.

వీరి ఎంపిక విస్తృతస్థాయిలో ఆగ్రహానికి దారి తీయగా, విద్యార్థి సంఘం తీవ్ర స్థాయి ఆవేశంతో మండిపడింది. పడిపోయిన ప్రభుత్వంలో పనిచేసిన వారికి కూడా సలహాదారుల పదవి లభిస్తోందని అగ్రగామి విద్యార్థి సంఘ నాయకుడు సర్జి ఆలం విరుచుకుపడ్డారు. బిఎన్‌పి కూడా నిరుత్సాహపడింది. తమ మద్దతుదారుల దృష్టిని మరల్చేందుకు మధ్యంతర ప్రభుత్వం తాజాగా షేక్ హసీనా సహా అవామీ లీగ్ నాయకులకు వ్యతిరేకంగా చర్యలను ప్రతిపాదిస్తుంది. షేక్ హసీనాను భారతదేశం నుంచి తమ దేశానికి వెనక్కి రప్పించేందుకు బంగ్లాదేశ్ ప్రభుత్వం త్వరలోనే ఇంటర్‌పోల్‌ను సంప్రదించనున్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. షేక్ హసీనాకు వ్యతిరేకంగా హత్యారోపణపై పోలీసుల దర్యాప్తుకు సంబంధించి ఢాకా కోర్టు డిసెంబర్ 10న వాదనలు వినవుంది.

ఢాకాలో రాయబారరంగం వైపు పరిశీలిస్తే అమెరికా రాయబార కార్యాలయం గతంలో డాక్టర్ యూనుస్, ఆయన ప్రభుత్వాన్ని ప్రోత్సహించినట్లుగా, ఇప్పుడు ఆ పనిలో క్రియాశీలకంగా వ్యవహరించడం లేదు. ఆగస్టులో యుఎస్ రాయబార కార్యాలయం డిప్యూటీ ఛీఫ్‌గా మెగాన్ బౌల్డిన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇటీవల మార్పుల కారణంగా గతంలో మాదిరిగా రాజకీయ నాయకులను కలవడం లేదు. కానీ, చైనా రాయబారి యావో వెన్ మాత్రం చురుకుగా వ్యవహరిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో చైనాకు భారీ ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయి. అనేక పెద్ద ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. యూనుస్ ప్రభుత్వాన్ని ఆర్‌సెప్‌లో చేరేలా చేయడమే చైనా ప్రస్తుత ప్రధాన ఆసక్తి. బంగ్లాదేశ్ వాణిజ్య మంత్రి ఈ మేరకు ప్రతిపాదనను ఆమోదించి విదేశీ మంత్రిత్వ శాఖకు, అక్కడి నుంచి పిఎంఒకు గత మాసంలో పంపగా, ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో చైనా ఆందోళన చెందుతోంది.

భారతదేశానికి సంబంధించినంత వరకు ఆగస్టు 5 తరువాత భారత–బంగ్లాదేశ్ సంబంధాలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ట్రంప్ విజయం తరువాత ముందుకు వచ్చిన రాజకీయ ముఖచిత్రంలో డాక్టర్ యూనుస్ తన స్థానంలో యథాతథంగా కొనసాగినా భారతదేశం స్థానం పట్ల మరింత ఒదిగి ఉండవలసి వస్తుంది. వచ్చే ఏడాది జరగబోయే బిమ్‌స్టెక్ సమావేశ సమయంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని కలిసేందుకు డాక్టర్ యూనుస్ ఆతురతతో ఉన్నారు. ట్రంప్ బంగ్లాదేశ్ విధానం ఎలా తుదిరూపం తీసుకోనున్నప్పటికీ నరేంద్ర మోదీని ట్రంప్ తన వెంటే ఉంచుకుంటారు. ప్రస్తుతానికి భారత్‌కు అదే గొప్ప ఊరట కాబోతుంది.

(ఐపిఎ సర్వీస్)



ఇప్పటివరకు కంటికి కనపడకుండా జాగ్రత్త పడిన ఆవామీ లీగ్ కీలక మద్దతుదారులు అకస్మాత్తు గా తిరిగి సంఘటితమవుతున్నారు. కాలం తిరగబడబోతుందని, తమ రోజులు దగ్గరలోనే ఉన్నాయనే రహస్య సందేశాలు వారికి వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆవామీ లీగ్ విద్యార్థి విభాగం నవంబర్ 10వ తేదీన విద్యార్థి ఉద్యమ అమరుడు నూర్ హుస్సేన్ స్మారకార్థం ఢాకా ప్రధాన ప్రాంతంలో బహిరంగ సభకు పిలుపునిచ్చింది. తమను ర్యాలీ నిర్వహించేందుకు అనుమతించబోరని తెలిసి కూడా పిలుపునివ్వడం ధైర్యానికి, ప్రతిఘటనకు సంకేతం

అన్యాయాన్ని ఎదిరించిన ధిక్కారస్వరం... కాళోజీ

'తెలుగు బిడ్డవు రోరి తెలుగు మాట్లాడుటకు సంకోచ పడియెదవు సంగతేమిటిరా? అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడ!చావవేటికిరా. ఈ మాటలు అన్నది ఎవరో కాదు. ప్రముఖ కవి, రచయిత మాటల మాంత్రికుడు ధిక్కార స్వరాన్ని వినిపించి, అందరి గొడవను తన గొడవగా భావించిన అక్షర యోధుడు మన 'కాళోజీ నారాయణ రావు'. రఘువీర్ నారాయణ్ లక్ష్మీ కాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ సెప్టెంబరు 9, 1914 న జన్మించారు. కాళోజీ నారాయణరావు లేదా కాళోజీ లేదా కాళన్నగా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడబడతాడు. ఆయన రాజకీయ సాంఘికచైతన్యాల సమాహారం. కవిత్వం వ్రాసిన ప్రజాకవి. హక్కులడిగిన ప్రజల మనిషి. నిజాం దమననీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్యసమరయోధుడు, తెలంగాణా ఉద్యమకారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవిస్తున్నది. వరంగల్‌లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది. 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి...అన్యా యం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. 1914, సెప్టెంబ రు 9న కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లాలోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. ఆయన తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడపడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషుభాషల్లో రచయితగా ప్రఖ్యాతిగాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపుకడతాయి. బీజాపూర్ నుంచి హన్మకొండకి తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌ మహల్ న్యాయపాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండలోని కాలేజియేట్ ఉన్నత పాఠశాలలోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939లో హైదరాబాదులో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయోద్యమంలో ఎంతో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయరానిది. 1940లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందు కు ఆయనకు నగర బహిష్కరణశిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర ఎనలేనిది. 1953లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958లో ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి శాసనమండలికి ఎన్నికయ్యాడు. కాకతీ య విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ 'సామాన్యుడే నా దేవుడు' అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13న తుదిశ్వాస విడిచాడు.

నవంబర్ 13 ప్రముఖ కవి, కాళోజీ నారాయణరావు వర్ధంతి

అతని మరణానంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేసారు. కాళోజీ జన్మించిన అయిదారు నెలలకే రమాబాయమ్మ చనిపోవడంతో అన్నే అమ్మగా మారి తమ్ముడు కాళోజీని పెంచి పెద్దచేశాడు. కాళోజి రామేశ్వరరావు ఆయన అన్న, ఉర్దూ కవి. తమ్ముడికన్నా ఆరు సంవత్సరాలు పెద్ద. కాళోజీ రామేశ్వరరావు 'షాద్' పేరుతో ఉర్దూ కవిత్వం రాశాడు. తమ్ముడి చురుకుతనం వల్ల ఆయన ప్రభ వెనకబడిపోయినా వాళ్లిద్దరూ అన్యోన్యంగా కలిసిమెలిసి బతికారు. న్యాయ శాస్త్రం చదివుండి కాళోజీ ఏనాడూ రూపాయి సంపాదించకపోయి నా ఆయనే ఇల్లు గడుపుతూ వచ్చాడు. ఒకవిధంగా తండ్రి తర్వాత తండ్రిలా జీవించుతూ వచ్చాడు. 1996లో రామేశ్వరరావు చనిపోయినప్పు డు, 'నేను నా ఆరవయేట మా అన్న భుజా ల మీదికెక్కినాను. ఆయన మరణించేదాకా దిగలేదు. నేను ఆయన భుజాల మీదికి ఎక్కడం గొప్ప కాదు. 70ఏళ్ల వరకూ ఆయన నన్ను దించకుండా ఉండడం గొప్ప' అన్నాడు. ఆయన ఎపి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన 'ఆంధ్ర సారస్వత పరిషత్' వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యుడు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు పాములపర్తి సదాశివరావుతో కలిసి తెలంగాణా ప్రత్యేక సంచిక వెలువరించాడు. విశాలాంధ్ర కావాలనీ కోరినాడు. తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ప్రత్యేక తెలంగాణా కావాలనీ వాదించిన ధీశాలి కాళోజీ మాత్రమే అని చెప్పవచ్చు.

ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రమహాసభ, తెలంగాణా రచయితల సంఘం సంస్థల నిర్మా

కంప్యూటర్ కుట్టు మిషన్ సర్టిఫికెట్లు అందజేత

ప్రజాపక్షం /హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని శారదా నికేతన్ మహిళా మండలి ఆధ్వర్యంలో కంప్యూటర్ కుట్టుమిషన్ సెంటర్లో శిక్షణ పొందిన విద్యార్థినీలకు సర్టిఫికెట్‌లను మహిళా నాయకురాళ్లు పశ్య కన్నమ్మ, జూల కంటి అరుణ, పశ్యపద్మ, తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుస్తెల సృజన, జిల్లా నాయకురాలు దేవరం మల్లీశ్వరి, ఉమా, దొంతి రెడ్డి ప్రమీల, లలిత వర్మ, అరుణ అసఫ్ అలీ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారదా నికేతన్ మహిళా మండలి ఆధ్వర్యం లో హుజూర్ నగర్ పట్టణంలో అనేక సంవత్సరాలుగా కంప్యూటర్ కుట్టుమిషన్ సెంటర్, మగ్గం సెంటర్లు రామానంద తీర్థ సంస్థ సహాయంతో నిర్వహించబడుతున్నాయని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థినిలకు భవిష్యత్తులో వారి ఉపాధి కోసం అనుసరించాల్సిన మార్గాల గురించి వివరించారు. కంప్యూటర్ కుట్టు మిషన్ సెంటర్ తో పాటు మగ్గం వర్క్ కు సంబంధించిన సెంటర్‌ని రెండవసారి కూడా పెట్టాలని, ప్రొడక్షన్ సెంటర్ ప్రారంభించడంలో సహాయ పడాలని పశ్యపద్మ రామానంద తీర్థ సంస్థ అధికారులను కోరారు. ప్రొడక్షన్ యూనిట్ ని ప్రారంభించడానికి సహాయపడతామని హామీ ఇచ్చారు. మహిళా మండలి ప్రారంభించటం సుదీర్ఘకాలంగా మహిళలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దటంలో పశ్య కన్నమ్మ శ్రమను కొనియాడారు. శిక్షణ పొందుతున్న విద్యార్థుల తో కూడి న 31 మందితో కమిటీని నూతనంగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. భవిష్యత్తులో మహిళా మండలి కార్యక్రమాలను ముందుకు కొనసాగించటానికి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ సాయి లక్ష్మి, హరికృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడలో ధాన్యం కొనుగోలు సాఫీగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగినట్లు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్ని రకాలకు మద్దతు ధర ఇవ్వాల్సిందేనని ఆదేశించారు. రైతులను ఇబ్బంది పెట్టి మద్దతు ధర ఇవ్వనట్లయితే అట్టి రైస్ మిల్లులపై చర్యలు తప్పవన్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు మిర్యాలగూడలో ధాన్యం విక్రయించేందుకు వచ్చే వారికి టోకెన్లు ఆయా మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా పొందాలన్నారు. ప్రతిరోజు 3వేల ట్రాక్టర్ల ధాన్యం కెపాసిటి రైస్ మిల్లుల వద్ద ఉందని, అందుకు అనుగుణంగా 1200 ట్రాక్టర్ల ధాన్యం టోకెన్లను హుజూర్‌నగర్, కోదాడ తదితర ప్రాంతాలకు కేటాయించడం జరిగిందన్నారు. మిల్లర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2320 తక్కువ కాకుండా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ప్రతిరోజు రైస్ మిల్లులను తనిఖీలు చేసి ధర విషయంలో రైతులను అడిగి తెలుసుకుంటామన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పలు మిల్లులను తనిఖీ చేశామన్నారు. రైతుల ద్వారా ధర విషయం తెలుసుకోగా ధాన్యానికి మద్దతు ధర లభించినట్లు తెలిపారు. రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసిన ప్రతి రోజు పూర్తి వివరాలతో రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయాలని అన్నారు. తహసీల్దార్ హరిబాబు ఉన్నారు.

ఎక్సైజ్ మహిళా ఎస్ఐ, సిబ్బందిపై దాడి

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం గువ్వలగుట్ట గ్రామంలో సారా తయారీకి సంబంధించిన నల్ల బెల్లం నిల్వలు ఉన్నాయని తెలిసిన విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించేందుకు వెళ్లిన జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ హారిక విధులు నిర్వహిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన రమావత్ హనుమా తండ్రి గ్లాబి మహిళా అధికారిపై దుర్భాషలు ఆడడమే కాకుండా దాడి చేశారు. దాడిని నిలువరించడానికి వెళ్లిన ఎస్‌హెచ్‌వో దేవరకొండ సిబ్బందిని, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బందిపై దాడి చేశారు. దాడిలో ఎక్సైజ్ వాహనంపై రాళ్లతో దాడి చేసి పాక్షికంగా ధ్వంసం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిణి విధులకు ఆటంకం కలిగించి, అధికారి, సిబ్బందిపై జరిగిన దాడికి ప్రొహిబేషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్ చందంపేట పోలీస్‌స్టేషన్‌లో ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కాగా గువ్వలగుట్టలో నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో రమావత్ హనుమాకు చెందిన 1140కేజీల నల్ల బెల్లం, 40 కేజీల పటికను స్వాధీనం చేసుకొని దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

అందుబాటు లేని పంచాయతీ సెక్రటరీ...

ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు

ప్రజాపక్షం/చందంపేట: నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల, బుడ్డోనితండా గ్రామాలలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సైదులు గ్రామాలకు రావడం లేదని పంచాయతీ సెక్రటరీకి ఫోన్ చేస్తే తాను గ్రామాలలో పనులు చేయడం లేదని, తనకు ఎటువంటి పనులు చెప్పవద్దని అంటున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామాలలో సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినప్పటి నుండి గ్రామాలలో స్పెషల్ అధికారి, పంచాయతీ సెక్రటరీ కలిసి పనులు చేయాలని ప్రభుత్వం చెప్పినప్పటికి ఆ గ్రామాలలో స్పెషల్ అధికారి, సెక్రటరీలు కనబడడం లేదని గ్రామ ప్రజలు అంటున్నారు. గ్రామాలలో పంచాయతీ సెక్రటరీ విధులకు రాకపోవడంతో గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని గ్రామాలలో ఎక్కడ చూసిన చెత్తా చెదారంతో నిండిపోయిందని, వీధి దీపాలు వెలగడం లేదని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ మూలనపడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో ఉన్న ఇద్దరు అధికారులు విధులకు రాకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక తీవ్ర ఇబ్బందులును ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీని తెరవక నెలలు గడుస్తున్నాయని తక్షణమే అధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న స్పెషల్ అధికారిని, పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా గ్రామాలలో కుంటు పడిన పారిశుద్ధ్య పనులను చట్టదిద్దాలని కోరారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

కొమురయ్య విగ్రహావిష్కరణలో వక్తలు

ప్రజాపక్షం /మునుగోడు: దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఆర్థిక అసమానతలు వ్యతిరేకంగా దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ లు పిలుపునిచ్చారు.భూమికోసం భుక్తి కోసం సాగిన తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో ప్రాణాలు విడిచిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలో కురుమ యువచేతన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యాం మల్లేష్,పాల్వాయి స్రవంతి, దూదిమెట్ల బాలరాజు యాదవ్,డిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు విశారదను మహారాజ్ తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం స్థానిక సత్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కురుమ యువ చైతన్య సమితి ఐదవ వార్షికోత్సవ మహాసభలో వారు పాల్గొని తొలి అమరుడైన దొడ్డి కొమరియకు నివాళులర్పించారు. మహాసభలో వారు మాట్లాడుతూ నైజాం తొత్తులైన విష్ణురు రామచంద్రారెడ్డి దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య అమరత్వం తెలంగాణ విముక్తికి నాంది పలికిందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతంగ పోరాటంతో లక్షలాది ఎకరా లభూమిని పేద ప్రజలు పంపిణీ కి భూస్వాములు దేశ్ముఖ్ దొరగాలను గ్రామాల నుండి తరిమి కొట్టారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక జిల్లాకు దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు ఈ సమావేశం కురుమ చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండే వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ సంక్షేమ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్, కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు గొరిగే నరసింహ, నల్గొండ జిల్లా అధ్యక్షులు రావుల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ నియోజకవర్గ అధ్యక్షులు మండుల సత్యం, మునుగోడు మండల అధ్యక్షులు బండారి శ్రీను, ప్రధాన కార్యదర్శి కాలిన మల్లేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి, బాలెంల, రామన్నగూడెం, పిఎసిఎస్ ఐకెపి కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ధాన్యం నాణ్యతను మాశ్చరైజ్ మీటర్ ద్వారా ధాన్యం తేమశాతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకు తీసుకవచ్చేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లులకు రవాణా దిగుమతి వేగంగా జరగాలని టాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు 48 గంటల్లో డబ్బులు వారి ఖాతాల్లో జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ ఆయన వెంట తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, పిఎసిఎస్ సీఈఓ శ్యాంసుందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలి : కలెక్టర్

ప్రజాపక్షం/తుంగతుర్తి: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మండలంలోని వెలుగుపల్లి గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు పండించిన మొత్తం ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. 17శాతం తేమశాతం ఉండేలా, మట్టిపెల్లలు, తాలు లేకుండా ధాన్యంను కేంద్రానికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎంపిడిఓ శేశు, ఎపిఎం కొమ్ము రాం బాబు, ఎంఈఓ బోయిని లింగయ్య ఉన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ : మండలంలోని వెలుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ఆయన గ్రామంలో విస్తృతంగా పర్యటించి దాన్యం కొనుగోలు కేంద్రాలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించిన ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థుల తెలుగు వాచకంలోని పాఠాలకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగారు. విద్యార్థులు రాసిన నోటు పుస్తకాల్లో చేతిరాతను పరిశీలించారు. విద్యార్థులకు చేతిరాతల్లో మెళకువలను నేర్పించాలని తెలుగు ఉపాధ్యాయురాలు అలివేలును సూచించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి లింగయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లాలో 68 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : కలెక్టర్

ప్రజాపక్షం /హాలియా: ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం హాలియాలోని మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 68 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు కనీస మద్దతు ధర అందించే ఉద్దేశంతో జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 80 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని చెప్పారు. దీనితో పాటు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతుల దగ్గర్నుంచి కొన్న ధాన్యానికి ఇప్పటికే రైతులు ఖాతాలోకి 20 కోట్ల రూపాయలు జమ చేసినట్లు చెప్పారు. రైతులు మధ్య దళారీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యం పండించిన రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధర వస్తుందనుకుంటే ప్యాక్ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా పొందాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డిఎస్ఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, తహసిల్దార్ రఘు, మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి, ఏవో సరిత, కాకునూరి నారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

పత్తి మిల్లు ఎదుట రైతుల రాస్తారోకో

ప్రజాపక్షం/మర్రిగూడ: మర్రిగూడ మండలం ఎరుగండ్లపల్లి శివారులో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అగ్రో పత్తి మిల్లు ఎదుట రోడ్డుపై మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. లారీలు, బస్సులు, ఆటోలు నిలిపివేసి ఆందోళన చేపట్టారు. పత్తి కొనుగోలు విషయములో నిర్లక్ష్యం వహిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పత్తి మిల్లు నుండి క్వింటాళ్లు 1200 నుండి1500 మాత్రమే కొనుగోలు చేయాలని షరతులు విధించడంతో వందలాది మంది రైతులు పడిగాపులు వారం రోజులకు పైగా ఉంటున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విధించిన షరతుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు భారీ ఎత్తున రోడ్లపై ఆందోళన చేపట్టి వాహనాలను నిలిపివేశారు. మర్రిగూడ పోలీసుల రంగ ప్రవేశంతో ఆందోళన విరమించారు. అయితే ఎలాంటి కండిషన్ లేకుండా రైతుల నుండి పత్తి కొనుగోలు చేయాలని సిసిఐ ప్రతినిధి కోటేశ్వరరావును రైతులు నిలదీశారు. గత వారం రోజులుగా మిల్లు పరిధిలో ఐదు నుండి 6000 వేల క్వింటాళ్ల పత్తి నిలువ ఉండటంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. తక్షణము ప్రభుత్వ అధికారులు స్పందించి పత్తి తెచ్చిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వేగవంతంగా రెవెన్యూ అంశాల పరిష్కారం

జిల్లా కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/యాదాద్రి : రెవెన్యూ అంశాల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయమును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చేసుకున్న దరఖాస్తుల మేరకు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, ధరణి, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ వంటి దృపత్రాలను ప్రజలకు సత్వరమే అందించే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం ఉండరాదని, సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చౌటుప్పల్‌లో ఉన్న సెరికల్చర్ రూర్బన్ సిల్క్ రీలింగ్ యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో గల లక్కారం 8వ వార్డును సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ఎన్యూమరేటర్‌లు నిర్వహిస్తోన్న సర్వే తీరును పరిశీలించి, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సరైన విధంగా కుటుంబాల సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ఏ ఒక్క ఫార్మ్ పట్ల నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఫార్మ్‌ను అత్యంత జాగ్రత్తగా నమోదు చేసి, సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని అన్నారు. అనంతరం చౌటుప్పల్ మండలంలో జై కేసారం పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు సెంటర్‌ను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే ధాన్యం కొనుగోలు జరపాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. మాయిచ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు కర్షకులకు సిపిఐ అండ

సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి: ప్రజలు, కార్మికుల, కర్షకుల పక్షాన నిలబడి పోరాటాలను నిర్వహించిన గొప్ప చరిత్ర సిపిఐ కె దక్కుతుందని అపార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు.మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నల్లగొండ నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తల సమావేశనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సామ్రాజవాదం,భూస్వాములు పెట్టబడుదారులకు వ్యతిరేకంగా అసమానత్యాగాలు చేసిన సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించె శత వార్షికోత్సవాలలో కార్మికులు, రైతులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఆరుగాలాలు కష్టపడి పంటలు పండించిన రైతులకు తమ పంటను అమ్ముకోవడానికి అనేక కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను హడావుడిగా ఏర్పాటు చేసినప్పటికీ ఆంక్షలు విధించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెంటనే ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేనియెడల సిపిఐ ప్రజల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ,ఇండ్లు రేషన్ కార్డులు,వృద్ధులకు,వికలాంగులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు.నల్లగొండ నియోజకవర్గంలోని వర్షాల కారణంగా దెబ్బ తిన్న రోడ్లను మరమ్మతు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొలుగూరి నరసింహ, కనగల్ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ ,టౌన్ కార్యదర్శి గాదెపాక రమేష్ ,సీనియర్ నాయకులు ముండ్ల ముత్యాలు, డి పండరి, జే సురేందర్, వి.లెనిన్ ,ఎండి యూసుఫ్ ,సుజాత ,మాధవి వీరయ్య ,ముత్తయ్య ,తలారి లచ్చయ్య, డి కోటి తదితరులు పాల్గొన్నారు

రైతుల నిలువు దోపిడీ!

తరుగు పేరుతో కోత
తేమ పేరుతో ధర తగ్గింపు
మిల్లర్లు, అధికారుల కుమ్మక్కుతోనే ఇదంతా?

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అధికారులు పదే పదే ప్రకటించిన అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. దీనిని అదునుగా చేసుకున్న మిల్లర్లు ఆరుగాలం శ్రమించి పంటను పండించిన రైతులను దోచుకుంటున్నారు. ఒక పక్క తరుగు పేరుతో తూకాల్లో కోత మరో పక్క తేమ పేరుతో ధర తగ్గిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో మిల్లర్లు, అధికారుల కుమ్మక్కుతోనే ఇదంతా సాగుతుందని రైతులు, రైతుల సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాల్లో జాప్యం జరుగుతుండడంతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4లక్షల 72వేల ఎకరాల్లో వరిని సాగు చేయగా ఇందులో సగానికి పైగా రైతులు సన్నధాన్యాన్ని సాగు చేశారు. అధికారుల అంచన ప్రకారం 10.22లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని ఇందులో 3.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 310 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సన్నధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేకంగా 133, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు 177 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దొడ్డురకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు గ్రేడ్ ఏకు రూ. 2320, గ్రేడ్ బి రకానికి రూ. 2300లుగా నిర్ణయించింది. సన్న ధాన్యానికి ఈ ధరలతో పాటు అదనంగా క్వింటాకు రూ. 500 బోనస్ కూడా ప్రకటించింది. సన్నధాన్యాల కొనుగోళ్లకు కేంద్రాల నిర్వహాకలు కొర్రిలు పెడుతుండడంతో రైతులు ఇక చేసేది ఏమిలేక మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకున్న రైతులు సిండికెట్‌గా మారి రైతులను దోచకుంటున్నారు. బోసన్ దేవుడేరుగు మద్దతు ధర కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. ధాన్యం తేమశాతం ఎక్కువగా ఉందని, తాలు, మట్టిపెల్లలను సాకులుగా చూపుతూ క్వింటాకు 5కేజీల వరకు కోత కోస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు క్వింటాకు రూ. 2100 నుండి 2200ల వరకు మించి మిల్లర్లు ధర పెట్టడం లేదు. వ్యాపారులంతా సిండికెట్‌గా మారి మద్దతు ధరకు మం గళం పాడుతున్నారు. బోసన్ ఊసంటూ లేకుం డా పోయింది. ఇక దొడ్డు రకం ధాన్యం పరిస్థితి అంతే క్వింటాకు రూ. 2వేల లోపే ధర పలుకుతుంది. ఈ ధాన్యం పండించిన రైతులు కూడా క్వింటాకు రూ. 300వరకు నష్టపోతున్నారు.

మిల్లర్లు, అధికారులు కుమ్మక్కు కావడంతోనే తమకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందడం లేదని రైతులు, రైతు సంఘాల నాయకు లు ఆరోపిస్తున్నారు. మిల్లర్లు రైతులను దోచుకుంటున్న విషయం అధికారులకు తెలిసినా మిల్లులకు వెళ్లి తనిఖీలు చేసిన సందర్భాలు మచ్చుకు కూడా లేవు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మిల్లర్లు అంతా సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. పక్క జిల్లా నల్లగొండలోని మిర్యాలగూడలో మిల్లర్ల దోపిడీకి అడ్

పత్తి విక్రయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: సిసిఐ కేంద్రాలకు పత్తి తరలించే సమయంలో రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్ పూర్ మండల పరిధిలోని ఆలీరాజ్‌పేట గ్రామంలోని వాసవీ కాటన్ జిన్నింగ్ మిల్లులో సిసిఐ పతి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గాలం కష్టించి పండించిన పత్తిని ధళారులకు విక్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని రైతులకు సూచించారు. నాణ్యమైన పత్తికి సిసిఐ కొనుగోలు కేంద్రంలో 7500 పైచిలుకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోని ఇప్పటి వరకు నియోజక వర్గంలో సిసిఐ ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చే రైతులను తేమ పేరుతో నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేయవద్దని చెప్పారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిగుప్తా మాట్లాడుతూ పత్తి కొనుగోలులో సిసిఐ, కాటన్ జిన్నింగ్ మిల్లర్ల మధ్య తలెత్తిన సమస్యతో ఒక రోజు పత్తి విక్రయాలు నిలిచిపోయిన సంఘటనపై రైతులకు ఇబ్బందులు కలుగకుండా సిఎం రేవంత్‌రెడ్డి తక్షణ చర్యలు తీసుకోని సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించడం పట్ల సిఎం తీరును ప్రశంసించారు. ఇదే విధంగా రైతు సంక్షేమంపై ప్రభుత్వం ప్రేత్యక దృష్టి సారించాలని అన్నారు. కాటన్ మిల్లు యాజమాని రమణరావు ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్,మున్సిపల్ చైర్మన్‌లను శాలువాలతో సన్మానించారు. ఎఎంసి కార్యదర్శి జాన్‌వెస్లీం మండల వ్యవసాయాధికా రి వసంతరావు, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కార్యవర్గ సభ్యులు హరినాథ్, కాం గ్రెస్ పార్టీ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి, డిఎల్‌డిఎ మాజీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్, మాజీ ఎంపిటిసి నర్సింహాచారి, అమర రమేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎంఇఒను సన్మానించిన ట్రస్మా నాయకులు

ప్రజాపక్షం/చొప్పదండి: చొప్పదండి మండల విధ్యాదికారి డి.శ్రీనివాస్‌ను మండల ట్రస్మా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు మండల శాఖ అధ్యక్షుడు గుర్రం ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల విద్యాధికారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ మంచి ఫలితాలను సాధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకులు పుల్యాల లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిప్పర్తి శ్రీనివాస్, కోశాధికారి కునమల దేవానంద్, ఉపాధ్యక్షులు తమ్మాడి కనకరాజు, కరస్పాండెంట్లు కడారి రవికుమార్, నాగోతు వినోద్ కుమార్, నాగరాజు, సిరిపురం శ్రీనివాస్ తదితరులున్నారు.

గురుకుల బాలుర డిగ్రీ కళాశాలకు 'బి ప్లస్ ప్లస్ గ్రేడ్'

ప్రజాపక్షం/కరీంనగర్ కలెక్టరేట్: కరీంనగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల మొదటి ప్రయత్నంలోనే న్యాక్ బి ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వేణుగోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ నిపుణుల బృందం గత నెల 28, 29 తేదీల్లో కళాశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా 2.96 గ్రేడ్ పాయింట్లతో బి ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిన తొలి గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలగా చరిత్ర సృష్టించిందన్నారు. డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం సంస్థ కార్యదర్శి కె. సీతాలక్ష్మి అవసరమైన సదుపాయాల ఏర్పాట్లు చేశారన్నారు. ఈ గ్రేడ్ సాధించడానికి కీలకంగా వ్యవహరించిన వైస్ ప్రిన్సిపాల్ బి.లావణ్య, బోధన, బోధనేతర సిబ్బంది, స్టడీ రిపోర్టులు రూపొందించిన ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వి.అన్వేష్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. మొదటి ప్రయత్నంలోనే ఈ విజయాన్ని సాధించిన ఈ కళాశాలలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడానికి , యూజిసి నిధులు సాధించడానికి మార్గం ఏర్పడిందన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న

ప్రజాపక్షం/రామడుగు: మండలంలోని వెలిచాల బైపాస్ రోడ్ గుంతలు పడి ప్రయాణికులు, భారీ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి అధికారులకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి భారీ లోడ్‌తో వెళ్తున్న వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని కోరారు.

కార్మికుల్లో వృత్తి నైపుణ్యం పెంచుతున్న 'న్యాక్'

ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ రాష్ట్ర భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్మాణరంగభవన నిర్మాణ వృత్తి నైపుణ్యం పెంపొందించడానికి నేషనల్ ఆకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోలి రమేష్, సెంటర్ ఇన్చార్జులు శ్రీనివాస్, రాములు ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో మెలకువలు నేర్పిస్తున్నారు. ప్రత్యేత శిక్షణ పొందిన వారికి వివిధ రంగాల్లో ఉపాధి లభిం చేలా బాసటగా నిలుస్తున్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలనే ఉద్దేశంతో లేబర్ కార్డు కలిగిన 1845 వయసు గలవారికి న్యాక్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ ఆవరణంలో కార్మికులకు అక్టోబర్ 30 తారీఖు నుండి నవంబర్ 18వ తేదీ వరకు పెయింటింగ్, ప్లంబింగ్,ఎలక్ట్రికల్, తాపీమేస్త్రీ వృత్తుల్లో 15 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం సాయంతో శిక్షణ అందిస్తున్నారు.శిక్షణ కాలంలో రూ.4500 గౌరవ వేతనం అందిస్తూ మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నారు. కార్మికుల నైపుణ్యాన్ని పెంచుతూ ఉపాధిపై వారికి భరోసా కల్పిస్తున్నారు.

రైతులకు అనుకూలంగా జాతీయ రహదారి

ఎంపి రఘునందన్‌రావు

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : దుద్దేడ నుండి రామంచ వరకు జాతీఐ రహదారి పల్లెటూర్ల మీదుగా వెళ్తున్న ప్రతిపాదిత రోడ్డు రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని మూడు ప్రత్యామ్నాయ రహదారులను ప్రతిపాదిస్తున్నట్లు మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఎంపి రఘునందన్‌రావులు నేషనల్ హైవే అధికారులతో కలసి నూతన ప్రతిపాదనలు సూర్యపేట, సిరిసిల్లా జాతీయ రహదారి 365బి వలన ప్రభావితమవుతున్న సిద్దిపేట సమీపంలోని మర్పడగ, పరిసర ఏడు గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ డిపిఆర్ తయారు చేసిన ఏజెన్సిప్రతినిధి మురళి ప్రాజెక్టర్ ద్వారా దుద్దెడ నుండి సిరిసిల్లా వరకు ప్రతిపాదిత రహదారి మ్యాపును చూపించి వివరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు మాట్లాడుతూ దుద్దెడ నుండి రాజివ్‌రహదారి మీదుగా సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తూ 756 జిఒ కలపటం, రాజివ్‌రహదారి కంటే ముందే వెలికట్ట నుండి బందారం మీదుగా సిద్దిపేట రీజినల్ రింగ్ రోడ్డు మీదుగా రామంచ వరకు, దుద్దేడ నుండి తుక్కాపూర్, ఘనపూర్ మీదుగా ఇర్కోడ్ వరకు అక్కడ నుండి 765 రహదారితో కలసి రామంచ వరకు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఏది రైతులకు అనుకూలంగా ఉంటుందో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్‌డిఒ సదానందం, నేషనల్‌హైవే ఇఇ బలరామకృష్ణ, సంబంధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన ప్రభుత్వ విప్

ప్రజాపక్షం / చందుర్తి : మండలం లోని మర్రిగడ్డ గ్రామంలో కుల గణన సర్వేను మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ,ఎమ్యునేటర్లకు స్వచ్ఛందంగా వివరాలు తెలపాలని సూచించారు.'ఎవరు ఎంతో వారికి అంత' భవిష్యత్తులో అందించాలనే ఉద్ధేశ్యంతోనే కుల గణన జరుగుతుందన్నారు.రాహుల్ గాంధీ రెండు విడతల పాద యాత్రలో సమాజంలో ఉన్న అసమానతలు గుర్తించి అందరికి సమానమైన అవకాశాలు కల్పించడం కోసమే కుల గణన నిర్ణయం తీసుకున్నారన్నారు.కుల గణనతో తెలంగాణా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని రాహుల్ గాంధీ అన్నారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పిల్లల విద్య పట్ల వాల్మీకి ఆవాసం కృషి

జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: పిల్లల సంరక్షణ, విద్య పట్ల వాల్మీకి ఆవాసం చేసున్న కృషి అభినందనీయమని జిల్లా స్థాయి తనిఖీ కమిటీ చైర్మన్, అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా సంక్షేమశాఖ, జిల్లా బాలల రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన జిల్లా స్థాయి తనిఖీ కమిటీ జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015 ప్రకారం వసతి గృహాల పని తీరుపై, స్థితిగతులపై తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డా.బోనగిరి నరేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి హరీష్, తనిఖీ కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, హరి అశోక్‌మార్, కె.రాజ్‌కుమార్, వైద్యాధికారి డా. పి సతీష్ , శిశువైద్యుడు డా.పూర్ణచందర్ , వాల్మీకి ఆవాసం అధ్యక్షులు జిడిగె పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు

బాల సదనంలో ..

జిల్లా కేంద్రంలోని బాల సదనంకు అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి వెళ్లి పరిశీలించారు. పారిశుద్ధ్యం, సౌకర్యాలను మెరుగపర్చుకోవాలని అన్నారు. పరిస్థితి మారకుంటే అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

సంక్షేమ కార్యక్రమాల అమలు కోసమే సర్వే

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: రాబోయే రోజుల్లో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. యజమానికి ఇష్టమైతేనే వివిధ డాక్యుమెంట్ల వివరాలు సమర్పించాలని, సర్వేకు ప్రజలంతా సహకరిస్తున్నారని అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కరీంనగర్ నుంచి అయిదుగురు మాస్టర్ ట్రైనర్లు రాష్ట్రస్థాయిలో సర్వేపై శిక్షణ పొందారని తెలిపారు. 2011 సర్వే ఆధారంగా జిల్లాలో 1958 ఎన్యుమరేటర్ వ్లాగ్స్ ఉన్నాయని అన్నారు. ఒక్కొక్క వ్లాగ్‌లో 150 ఇండ్లు ఉంటాయన్నారు. జనాభా పెరిగినందున ప్రస్తుతం 730 కొత్త ఇవిలు గుర్తించామని, అందువల్ల ఇవిల సంఖ్య సుమారు 2700కు చేరిందన్నారు. 175 ఇండ్లకు ఒక ఇవిగా జాబితా తయారు చేశామన్నారు. సుమారు 3 లక్షల 30వేల ఇండ్లు సర్వే చేయబోతున్నట్లు తెలిపారు. ఒక్కో ఈవికి ఒక్కొక్క ఎన్యుమరేటర్ చొప్పున మొత్తం 2700 ఎన్యుమరేటర్లను కేటాయించినట్లు తెలిపారు. పది మంది ఈవిలకు ఒక సూపర్‌వైజర్ పనిచేస్తారన్నారు. వీరిపై మండల నోడల్ అధికారి ఇంచార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాల టీచర్లు, ఆర్పీలు, పంచాయతీ సెక్రటరీలు, జూనియర్ అసిస్టెంట్లు సహా ఇతర ఉద్యోగులు ఈ సర్వేలో ఎన్యుమరేటర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు ఇండ్లను గుర్తించి తొమ్మిదో తేదీ నుంచి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. 11వ తేదీ సాయంత్రం నాటికి 18 శాతం ఇండ్ల సర్వే జరిగిందని, సుమారు 60 వేల 400 ఇండ్లు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాస్థాయిలో జిల్లా ప్లానింగ్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వే విధులను కో ఆర్డినేషన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 20 ఇండ్ల చొప్పున సర్వే చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వం చేపట్టబోయే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు కోసం ఈ సర్వే ఉపయోగపడుతుందని, అందువల్ల ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు సర్వేకు సహకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లకు ఎలాంటి ఒరిజినల్, డూప్లికేట్ పత్రాలను ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అన్ని వివరాలు అప్షనల్ మాత్రమేనని, కుటుంబ యజమాని ఇవ్వాలనుకున్న వివరాలు మాత్రమే ఇవ్వవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకున్నా, డోర్ లాకున్నా యజమానికి వీలైన సమయంలో సర్వే వివరాలు సేకరించాలని ఎన్యుమరేటర్లకు సూచించినట్లు తెలిపారు. తప్పిపోయిన ఇండ్లను తప్పకుండా గుర్తించి వారి వివరాలు కూడా సేకరిస్తామని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఒక కుటుంబంలో ఎంతమంది నివాసం ఉన్నా వారికి వేరువేరుగా ఫారాలు నింపుతారని తెలిపారు. ఈ సమావేశంలో అడిషినల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ముఖ్య ప్రణాళిక అధికారి కొమురయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి ఆత్మస్థైర్యం కల్పించేలా చర్యలు

ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు డి శ్రీనివాస్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రెవెన్యూ సిబ్బందికి ఆత్మస్థైర్యాన్ని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ సిబ్బంది వికారాబాద్ జిల్లాలో రెవెన్యూ సిబ్బంది, కలెక్టర్‌పై జరిగిన దాడికి నిరసనగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి వేణు రెవెన్యూ సిబ్బంది నిరసన కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ట్రెస్సా జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాస్ మాట్లాడుతూ, వికారాబాద్ ఘటన చాలా దురదృష్టకరమని, అధికారులపై దాడులు చేయడం, ప్రజలకు రెవెన్యూ సిబ్బంది అనేక రకాలుగా అందించే సేవలను విస్మరిస్తూ, పూర్తి అవగాహన రాహిత్యంతో భౌతిక దాడులు దిగడం దుర్మార్గమని అన్నారు. దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని, రెవెన్యూ సిబ్బందికి ఆత్మస్థైర్యం కల్పించాలని, అవసరమైన భద్రత కల్పించాలని అన్నారు. ట్రెస్సా అసోసియేట్ అధ్యక్షులు రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే ఫార్మాసిటీ కోసం భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, కోడాడ్ మీదుగా రామంచ వరకు, దుద్దేడ నుండి తుక్కాపూర్, ఘనపూర్ మీదుగా ఇర్కోడ్ వరకు అక్కడ నుండి 765 రహదారితో కలసి రామంచ వరకు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఏది రైతులకు అనుకూలంగా ఉంటుందో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్‌డిఒ సదానందం, నేషనల్‌హైవే ఇఇ బలరామకృష్ణ, సంబంధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి, రెవెన్యూ సిబ్బంది పై గ్రామస్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజలతో నేరుగా సంబంధాలు ఉంటూ పని చేసే రెవెన్యూ సిబ్బందిపై దాడులు అవాంఛనీయమని అన్నారు. జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులపై దాడులు చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని, వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో భూసేకరణ కోసం వెళ్లే రెవెన్యూ సిబ్బందికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అనంతరం ట్రెస్సా జిల్లా కమిటీ తరఫున రెవెన్యూ సిబ్బంది డిమాండ్లను వివరిస్తూ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ట్రెస్సా అధ్యక్షులు వకీల్, పెద్దపల్లి జనరల్ సెక్రెటరీ మహేష్, పెద్ద ఎత్తున రెవెన్యూ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యంలో పెద్దపల్లి కలెక్టరేట్లో నిరసన

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన వారిని కఠినం గా శిక్షించాలని ఎంప్లాయిస్ జెఎసి చైర్మన్, టిఎన్‌జి ఒఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్ డి మాండ్ చేశారు. మంగళవారం రోజున భోజన విరామ సమయంలో తమ నిరసనను వ్యక్తం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి నిర్విరామంగా పనిచేస్తున్నటువంటి ఉద్యోగులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఉత్తర్వులను నెరవేర్చడమే ఉద్యోగుల లక్ష్యమని, అటువంటి వా రిపై దాడి చేయడం హేయమైన చర్య అని, సర్వేల పేరి ట ఉద్యోగస్తులు ప్రజల ఇళ్లలో సర్వే చేస్తుంటే కుక్కల్ని విడిచిపెట్టడం ఉద్యోగులపై దాడి చేయడం చాలా దు ర్మార్గమని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలుపడానికి అ నేక మైనటువంటి కార్యక్రమాలు ఉన్నాయని, కానీ ఉ ద్యోగులపై దాడి చేయడం ఏంటని బొంకూరి శంకర్ ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కా కుండా ప్రభుత్వం దాడి చేసిన దుండగులపై కఠిన చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పాలన అధికారి శ్రీ కోయ శ్రీహర్షను కలిసి వినతి ప త్రాన్ని అందజేసి, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి నివేదిక పంపాల్సింగా కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి సెక్రటరీ జనరల్ తూమ్ రవీందర్, టిజిఒ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొమురయ్య, పట్టణ కార్యదర్శి ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు అనిత, టిజిఒఎస్ ఆర్గనైజ్ సెక్రెటరీ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి :మంత్రి పొన్నం

ప్రజాపక్షం /హుస్నాబాద్: మారుతున్న కాలానుగునంగా ప్రతి ఒక్కరు సైన్స్‌ల్యాబ్,రోబోటిక్, ల్యాబ్, కంప్యూటర్,లపై సాంకేతిక పరిజ్ఞానం పెంచుకొవాల ని తెలంగాణ రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభకర్ గౌడు విద్యార్థులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్‌ల్యాబ్, సైన్స్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. నిర్మా అర్గనైజేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన , ల్యాబ్, డిజిటల్ బోర్స్ సిసి కెమెరాలు 20 కంప్యూటర్స్‌ప్రారంభించి వాటి పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఉయోగించుకొని కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినందుకు వారి ధన్యవాదాలు తెలిపారు. హుస్నాబాద్ విద్యార్థులు చదువుతో పాటు అటపాట సైన్స్‌ల పట్ల శ్రద్ధ చూపి అన్ని రంగాల్లో ముందు ఉండాలని కోరారు.

ల్యాబ్‌లు సైన్స్ లను విద్యార్థులు ఉపయోగించుకోవాలి. జిల్లా కలెక్టర్ మనుచౌదరి.

నేడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి విద్యార్థి పోటిపడి చదవాలని, వాటి గూర్చి తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి విద్యార్థులను కోరారు. హుస్నాబాద్‌లో కొత్తగా ప్రారంభించిన సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్, ఇంగ్లీస్‌ల్యాబ్, ఉపయోగించుకోవాలని కోరారు. రోబోటిక్‌ల్యాబ్, ద్వారా, రోబోటిక్ బెసిన్ వస్తే భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఈ పరిజ్ఞానం నేర్చుకొవడం ద్వారా మీకు సొంత పరిజ్ఞాన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అకుల రజిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింమూర్తి, ఆర్‌డిఒ రామూర్తి, విద్యాధికారి, తహసీల్దార్, నిర్మన్ సంస్థ చైర్మన్‌ప్రతినిధి ఉషకర్, కృష్ణారెడ్డితో పాటు కౌన్సిలర్స్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు

కొహెడ: సిద్దిపేట జిల్లా కొహెడ మండల కేంద్రంలో యాదవ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్ని దున్నలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సదర్ ఉత్సవాలను ప్ర భుత్వం అధికారికంగా నిర్వహిస్తూ నిధులు కేటాయించిందన్నారు. యాదవ వృతిలో ప్రతి ఒక్కరూ సరైన ఫలితాలు పొందాలంటే అందరూ కష్టపడాలన్నారు.తెలంగాణ ప్రభుత్వం కుల సర్వే చేస్తుందని, ఇది ఎవరికి వ్యతిరేకం కాదన్నారు. సమాచారం సేకరించడానికి వచ్చే అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఈ సమాచారం ప్రభుత్వం సేకరించి గో వ్యంగా ఉంచుతుందన్నారు.ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందరికి అందడానికి ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో యాదవులు, రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్, అంజన్ కుమార్, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులయ్యే కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరుతున్నారని పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు.సుల్తానాబాద్ మండలం భారతీయ రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు పురం ప్రేమ్చందర్రావు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే విజయరమణ రావు నివాసంలో ప్రేమ్చందర్రావు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారితోపాటు సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాజమౌళి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్ష్మి నారాయణ,వేగోలపు శంకర్ అదేవిధంగా వారి అనుచరులు బి.ఆర్.ఎస్ పార్టీని వీడి ఎమ్మెల్యే విజయరమణ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ కార్

బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ

చనిపోయిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమగ్రమైన విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుని చనిపోతున్నారన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా, పూర్తి స్థాయి వైస్ ఛాన్సలర్‌ని నియమించకుండా ధ్వంద వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. నాణ్యమైన భోజనం అందించకుండా కాంట్రాక్టర్లు ఏది ఇస్తే అది తినేలా, చదువులోనూ వసతులు కల్పించకుండా, నిధులు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా విద్యార్థులు ఆందోళన బాట పట్టిన ప్రభుత్వాలు స్పందించ లేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కానీ నేటికి ఆ సమస్యలను ప్రభుత్వం పరిష్కారించలేదన్నారు. ఆర్మూర్ విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పేదల కోసం పోరాడేది సిపిఐ

ప్రజాపక్షం/బోనకల్ : పేద, కష్టజీవుల, బడుగు, బలహీన వర్గాల వారి కోసం పోరాడేది సిపిఐ అని పార్టీ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని రాయన్నపేట గ్రామంలో సిపిఐ సభ్యత్వ కార్యక్రమాన్ని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, రాయన్నపేట మాజీ సర్పంచ్ వల్లెబోయిన జానయ్యలతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, హక్కుల కోసం సిపిఐ పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాయన్నపేట శాఖ కార్యదర్శి ఏలూరి పూర్ణచంద్రరావు, సిపిఐ మండల నాయకులు వల్లెబోయిన వీరభద్రం, తోటపల్లి ఆనంద రావు, మోదుగు జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : త్రీటౌన్ ప్రాంత అభివృద్ధికి ఎన్నో పోరాటాలు చేశామని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తామని సిపిఐ త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం త్రీటౌన్ సమితి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాలతో వంద వసంతాలు జరుపుకుంటున్న సిపిఐని త్రీటౌన్‌లో బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. పార్టీలో సభ్యులుగా చేరిన వారికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు భూక్యా రవీందర్, డివిజన్ కార్యదర్శి తాళ్ల రామకృష్ణ, చింతల శ్రీశైలం, శ్రీలత, ఏసు, తేజ, నరేష్ పాల్గొన్నారు.

సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీలో మంగళవారం సిపిఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వైరా డివిజన్ సిపిఐ కార్యదర్శి ఎర్రబాబు, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు ఏపూరి లతాదేవిల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు వడ్డే వెంకటయ్య, పుచ్చకాయల శ్రీనివాసరావు, ఎస్‌కె రంజాన్, ధనమ్మ, బొమ్మల కృష్ణ, కిన్నెర ముత్తమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థుల సహకారం

ఎఐఎస్ఎఫ్ అవగాహన సదస్సులో సిఐ రవీందర్

ప్రజాపక్షం/గుండాల : మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు విద్యార్థులు ముందుండాలని సిఐ రవీందర్, ఎస్ఐ రాజమౌళి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీందా, జిల్లా సహాయ కార్యదర్శి షాహెద్ ఆధ్వర్యంలో గురుకుల కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన, ప్రస్తుత విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐ రవీందర్, ఎస్ఐ రాజమౌళి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా లువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. నిషేదిత గంజాయి నిర్మూలనకు విద్యార్థులు ముందుండాలని కోరారు. మాదక ద్రవ్యాల వాడకంతో మనిషి మృగంలా వ్యవహరిస్తారని, మహిళలపై అఘాయిత్యాలకు సహితం వెనుకాడరని, దీని వల్ల మనిషి మనుగడకే ప్రమాదము ఉందని గుర్తించాలని విద్యార్థులకు సూచించారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో విద్యార్థిలోకం ముందుండాలని సూచించారు. మాదక ద్రవ్యాలను వాడేవారు తమదృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు, కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వాగబోయిన రమేష్, గడ్డం శ్రీను, రామయ్య, ఖయూమ్, నాగరాజు, హరీష్, ప్రణయ్, పవన్, యశ్వంత్, పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించాలి

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, పత్తి పంటకు మద్దతు ధర కంటే తక్కువ చెల్లించే చర్యలను సహించేది లేదని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. మంగళవారం లెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను యార్డును తనిఖీ చేశారు. పత్తిని రైతుల వద్ద నుండి మద్దతు ధర కంటే తక్కువ చెల్లించి కొనుగోలు చేసినట్లు తెలిసి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి పంటకు లభిస్తున్న ధర మొదలగు వివరాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్‌లో పత్తి పంట తేమ శాతాన్ని పరిశీలించకుండా కొనుగోలు చేయరాదని ఇది నిబంధనలకు విరుద్ధమని కలెక్టర్ తెలిపారు. పత్తి పంట తేమ శాతాన్ని పరిశీలించి 12 శాతం ఉంటే మద్దతు ధర చెల్లించాలన్నారు. తేమ శాతాన్ని పరిశీలించకుండా రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పత్తి పంటను కొనుగోలు చేయడం దారుణమని దీనిని అరికట్టేందుకు మార్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని, మద్దతు ధర కంటే తక్కువగా పంటను కొనుగోలు చేసే వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలను పరిశీలించకుండా రైతులను మోసం చేస్తూ కొనుగోలు చేయడాన్ని కలెక్టర్ తీవ్రంగా తప్పు పట్టారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించాలని, ఒకట్రెండు రోజులు ఆరబెట్టుకుని వస్తే మద్దతు ధర లభిస్తుందని తెలపాలని లేదా పంట ఇప్పుడే విక్రయించాలంటే నిబంధనల ప్రకారం ధర చెల్లించాలన్నారు. ఇష్టానుసారంగా తేమ శాతం పరిశీలించకుండా కొనుగోలు చేయడానికి వీలు లేదని కలెక్టర్ వ్యాపారులను హెచ్చరించారు. వ్యాపారులు కొనుగోలు చేసే ప్రతి పంట ప్రక్రియను మార్కెటింగ్ అధికారులు నిరంతరం పరిశీలించాలని రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలని, తేమ శాతానికి అనుగుణంగా ఉండే ధరల వివరాలను రైతులకు తెలియజేయాలని కలెక్టర్ అధికారుల ను ఆదేశించారు. రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకు పంట కొనుగో లు చేసిన ప్రైవేటు వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని, తేమ శాతం ప్రకారం రైతులకు ధర చెల్లించని పక్షంలో లైసెన్స్‌లు రద్దు చేయాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. మార్కెట్ యార్డులో అవసరమైతే అదనంగా 10 మంది సిబ్బందిని తేమ శాతం పరిశీలనకు విధుల్లో చేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ అలీమ్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుకు అడుగులు వేయండి

భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజాపక్షం/చంద్రుగొండ: మునగ సాగులో లాభాలు అధికంగా వస్తాయని, మునగ సాగు వైపు రైతులు అడుగులు వేసి లాభాలు పొందాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో మునగ సాగుపై అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలకు చెందిన రైతులకు అవగాహన సమావేశంలో ఆయన కలెక్టర్ హాజరై మాట్లాడుతూ మునగసాగుకు ఉపాధి హామీ పథకంలో నూటికి నూరుశాతం సబ్సిడీ వస్తుందన్నారు. మునగసాగు ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉందని, ప్రస్తుతం మనం మునగను నిత్యవసరంగా వాడుకుంటున్నామని, రైతులు పండిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చున్నారు. మునగ ఏడు నెలల కాలంలోనే పంట దిగుబడి వస్తుందన్నారు. అధికారులు మునగ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ, అవగాహన కల్పిస్తారన్నారు. పెట్టుబడి మొత్తం ఉపాధి హామీ పథకంలో వస్తుందని, లాభాలు మాత్రం రైతులకు వస్తాయన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ విద్యాలత, ఎంపిడిఒ అశోక్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎఒలు వినయ్, అనూష, ఎపిఎం సంతోష్, ఎపిఒ శ్రీను, ప్రమీల, ఎఇఒలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జిసి సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు

ప్రజాపక్షం/భద్రాచలం : రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం, కోకాపేట్ ఏకం సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం రూ.2 లక్షల 50 వేల విలువ చేసే స్కూల్ బెంచీలను వారు స్థానిక నన్నపునేని మోహన్ పాఠశాలకు వితరణగా అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు క్లబ్ అధ్యక్షులు దారా బాలాజీతో కలిసి మాట్లాడారు. రోటరీ అధ్వర్యంలో సంయుక్త కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎన్నో ఏళ్ల పాటు క్లబ్ ద్వారా పలు పాఠశాలలో మౌలిక సదుపాయాలను సమకూర్చడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యావ్యవస్థపై మక్కువతో పిల్లలు కూర్చునేందుకు బెంచీలు సమకూర్చిన వారిని ఈ సందర్భంగా అభినందించారు. మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలను రోటరీ క్లబ్ చేపట్టాలని కోరారు. రోటరీ క్లబ్ సభ్యులకు తన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వెంకట్రావు అన్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్, ప్రభాకర్ గుప్త, రఫీ, మధుసూధన్ రావు, నాగేశ్వరరావు, చలపతి, శ్రీధర్ రెడ్డి, నర్సింహారావు, నళిని, రజిని తదితరులు పాల్గొన్నారు

గ్రూప్–3 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

27,984 మంది అభ్యర్థులకు 87 పరీక్షా కేంద్రాలు

పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ శ్రీజ సమీక్ష

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లాలో గ్రూప్3 పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాల ప్రకారం నవంబర్ 17, 18 తేదీలలో గ్రూప్ 3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో గ్రూప్ 3 పరీక్షకు జిల్లాలో మొత్తం 27,984 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, వీరి కోసం 87 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఖమ్మంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్‌బిఐటి ప్రిన్సిపాల్‌ను రీజినల్ కో ఆర్డినేటర్లుగా నియమించడం జరిగిందన్నారు. ఏ దశలోను పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి అదనపు కలెక్టర్ సూచించారు. గ్రూప్ 3 పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్‌డిఒ జి.నర్సింహారావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, పరీక్షల కో ఆర్డినేటర్లు, కలెక్టరేట్ ఎఒ అరుణ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి పిఎస్ఆర్ ట్రస్టు చేయూత

ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరానికి చెందిన గజెల్లి వెంకన్న, కృష్ణవేణి దంపతుల కుమార్తె పూజిత నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యకు ప్రవేశం పొందింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కుటుంబ సభ్యులు చేయూతనందించాలని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టును కోరారు. మంగళవారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజ చేతుల మీదుగా విద్యార్థిని పూజితకు జ్ఞాపికతో పాటు రూ.20వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు తరుపున ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య విద్యా రంగానికి, పేద విద్యార్థులకు అందిస్తున్న తోడ్పాటును అభినందించారు. ట్రస్టు ఛైర్మన్ పుల్లయ్య, కుంచకూరి సతీష్, ఝాన్సీ కుమారి, నాగబాబు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు అందుబాటులో వైద్యులు

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

ప్రజాపక్షం/సత్తుపల్లి : ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, 24 గంటలు వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. తనిఖీలో ఇన్ పేషెంట్స్, అవుట్ పేషెంట్స్ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ఎంతమంది విధులకు హాజరయ్యారు. సెలవులో ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులో ఉంటూ వారికి వైద్యం అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, రోగులతో దురుసుగా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని, కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్‌కుమార్, ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సుజలరాణి, చల్లగుళ్ళ నర్సింహారావు, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, కమల్‌పాషా, గాదే చెన్నారావు, జీవన్,నరేంద్రరెడ్డి, మానుకోట ప్రసాద్ ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయం

పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/పినపాక : కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మాలని, ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని భూపాలపట్నం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు మద్దతు ధర ప్రకటిస్తూ క్వింటాకు 500 రూపాయల బోనస్ ప్రకటించిందన్నారు. గిట్టుబాటు ధర వచ్చేలా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. ఏ గ్రేడ్ తేమ శాతం వచ్చేలా చూసుకొవాలని సూచించారు. రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. క్వింటాకు ఏ గ్రేడ్ ధాన్యం రూ. 2320, సాధారణ ధాన్యం రూ.2300 రేటు నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, జిల్లా వ్యవసాయ అధికారి తాతారావు, తహసీల్దార్ నరేష్, ఎంపిడిఒ రామకృష్ణ, ఎంపిఒ వెంకటేశ్వర్లు, ఐకెపి ఎపిఒ జ్యోతి, సొసైటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి

ప్రజాపక్షం/అశ్వారావుపేట : మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా మత్స్య శాఖ అధికారి మహ్మద్ ఇంతియాజ్‌అహ్మద్ అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని వెంకమ్మ చెరువు మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేయగా ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ చెరువులోకి వదిలారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది చెరువులకు చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. వెంకమ్మ చెరువు మత్స్యకారులకు వివిధ రకాల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు వివరించారు. మిగిలిన చెరువులకు త్వరితగతిన అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిఒ ప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్, విద్యాశాఖ అధికారి మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిక్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలని, కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం అధ్యాపకులకు వెనకబడిన విద్యార్థులకు, బోధన విధానం గురించి సలహాలు సూచనలు చేశారు. కళాశాలలోని అధ్యాపకుల రికార్డులను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ చీన్యా, సీనియర్ అధ్యాపకులు నాగేశ్వరారావు, వివిఎస్ఎన్ మూర్తి, కొండా ముకుంద, సాహితి, జరీనా భాను, నరేష్, శివ, రేష్మ, లక్ష్మీ దీపిక, రమేష్, దివ్య, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

పాలకవర్గం నోచుకోని భద్రాద్రి

ప్రజాపక్షం/ఖమ్మం : దక్షిణ అయోధ్యగా పేరొంది భక్తులతో నిత్యం పూజలందుకునే భద్రాద్రి రామయ్యపై పాలక వర్గాలు చిన్న చూపు చూస్తున్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దశాబ్ద కాలం పాటు భద్రాచలాన్ని పట్టించుకోకపోవడమే కాకుండా యాదాద్రికి ప్రాధాన్యతనిచ్చారన్న అపవాదును గతప్రభుత్వం మూటకట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తారని భక్తులు భావిస్తే ఏడాది గడిచినా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. భద్రాద్రి దేవాలయం తెలంగాణలో ఉండగా దేవస్థానం భూములు ఆంధ్రాలో ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి తరచూ రగడ జరుగుతుంది. ఆ భూములను తిరిగి తెలంగాణకు తీసుకురావాలంటే భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామపంచాయతీలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపాలని ఈ ప్రాంత ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. గత ప్రభుత్వం సైతం ఈ ఐదు గ్రామ పంచాయతీలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మాట్లాడతామని తిరిగి తెలంగాణలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేస్తే శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ భూములు తెలంగాణకు రావడంతో పాటు వీటిపై పాలన పరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇక దేవస్థానం అభివృద్ధికి సంబంధించి కెసిఆర్ చుట్టూ ప్రకారాలు కట్టిస్తామని తక్షణం రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం గతంలో భద్రాచలం నిర్లక్ష్యానికి గురైందని, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా ఇంత వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పురుషోత్తమపట్నం, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెం, గుండాల, యటపాకకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన దాఖలాలు కూడా లేవు. భక్తుల అవసరాలు, దేవస్థానంలో సౌకర్యాల కల్పనకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్న సమయంలో పూర్తిగా అధికారులపై ఆధారపడాల్సి వస్తుంది. పాలక వర్గం ఉంటే స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం జరగడంతో పాటు భక్తుల అవసరాలకు సంబంధించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇటీవల ముఖ్యమంత్రి యాదాద్రి పర్యటన సందర్భంగా దేవస్థానానికి సంబంధించి పాలక వర్గాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో మరోసారి భద్రాద్రి వ్యవహారం తెరమీదకు వచ్చింది. భద్రాద్రి రామయ్యపై పాలక వర్గాలు సీతకన్ను వేయడం సరైంది కాదన్న భావన భక్తుల నుండి వ్యక్తమవుతుంది. తక్షణం అభివృద్ధి పైన, పాలక వర్గం ఏర్పాటుపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌కోలో బది'లీలలు'

ఆ బదిలీల వెనక అధికార పైరవీలు

ప్రజాపక్షం/ఖమ్మం : విద్యుత్ శాఖలో పైరవీ ఉంటే చాలు అనుకున్న చోటికి బదిలీ జరుగుతుందన్న విమర్శలు వినవస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల అనుచరులు ముఖ్యంగా బలమైన అధికార పార్టీ నాయకులు పైరవీ ఉంటే చాలట. విద్యుత్ శాఖలో జరుగుతున్న ఈ అడ్డగోలు బదిలీలపై విమర్శలు వ్యక్తమవుతుండగా కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. విద్యుత్ శాఖలో బదిలీలను నిలిపివేసిన తర్వాత ఖమ్మం జిల్లాలో పైరవీల ఒత్తిడికి తలొగ్గి కొందరిని బదిలీ చేశారని ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా మధిరలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తిని ఖమ్మం నగరానికి బదిలీ చేశారు. ఈ బదిలీ విషయం పూర్తి నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని కార్మిక సంఘాలు అధికారులను ప్రశ్నించినట్లు తెలుస్తుంది. ఇందులో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న యూనియన్ ఓ అడుగు ముందుకేసి దొడ్డి దారిన వేరే సంఘానికి చెందిన వ్యక్తిని ఎలా బదిలీ చేస్తారంట

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాపక్షం/దుగ్గొండి: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన దుగ్గొండి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన వరికెల గోవర్ధన్(50) తన వ్యవసాయ భూమిలో యాసంగి పంట కోసం నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మోటర్ మొరాయించడంతో ఫీజు సరిచేస్తున్న సయమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

సత్తా చాటిన విలియం కేరి విద్యార్థి

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : ఇటీవల సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో జరిగిన 68 వ తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ పోటిలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నిక అయిన హన్మకొండ లోని విలియం కేరి బాప్టిస్ట్ హై స్కూల్ విద్యార్థి జి.దేవనాయక్ రాష్ట్ర స్థాయిలో జిల్లా జట్టుకి వైస్ కెప్టెన్ గా తన వంతు పూర్తి బాధ్యత నిర్వర్తించి వరంగల్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచేలా చేసాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు పోతుల ప్రవీణ్ కుమార్ ని విద్యార్థిని పాఠశాల ఇన్చార్ కె.విద్యాకర్ ప్రధానోపాధ్యాయులు టి.యం ప్రభాకర్ అభినందించారు. పాఠశాల ఇన్చార్జ్ మాట్లాడుతు ఈ రోజుల్లో క్రీడలే ఆరోగ్యానికి పునాది క్రీడల పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్క విద్యార్థికి ఉచిత విద్యాతో పాట అన్ని రంగాలలో ప్రోత్సాహిస్తు వారికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ శివ నగర్ రామాలయంలో బల్దియా సాధారణ నిధులు రూ. 35 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక డివిజన్ కార్పోరేటర్ దిడ్డి కుమార స్వామి, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'మదర్స్ ల్యాండ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/నర్సంపేట : రాష్ట్ర స్థాయి ఓరుగల్లు బాల ఉత్సవాల పోటీల్లో మదర్స్ ల్యాండ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ కనబర్చారు. ఆదివారం నర్సంపేట లోని మహేశ్వరం గ్రామం స్టార్ ఆర్ట్స్ అకాడమీ సందీప్ మాస్టర్ ఆధ్వర్యంలో గీతాంజలి గ్రూప్స్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ హైస్కూల్లో రాష్ట్ర స్థాయి స్టార్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓరుగల్లు బాల ఉత్సవ్ పోటీల్లో క్లాసికల్, వెస్టన్ ఫోక్ ,మాస్, నాలుగు అంశాలలో భాగంగా పట్టణానికి చెందిన మదర్స్ లాండ్ హై స్కూల్ పి. రితేష్ చంద్ర గ్రూప్, శ్రీశాంత్, కౌశిక్, శశికుమార్, నిశాంత్, అవినాశ్, శశివర్ధన్, మణికంఠ, రాజ్‌కుమార్, మణిచంద్ర, రిత్విక్ చంద్ర, విగ్నేశ్వర చారి, గూగుల్ వెంకటేష్ , విద్యార్థులు వెస్టన్ డాన్స్ ప్రదర్శనలు మొదటి స్థానంలో విజేతలుగా నిలిచారు. విజేతలను మదర్స్ లాండ్ హై స్కూల్ చైర్మన్ పాశికంటి రమేష్, మదర్స్ లాండ్ హై స్కూల్ ప్రిన్సిపాల్ పాశికంటి నవిత అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన జానీ మాస్టర్, చిరు మాస్టర్‌లను పాఠశాల చైర్మన్ పాశికంటి రమేష్, ప్రిన్సిపల్ పాశికంటి నవిత, ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం

ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి : మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, మహిళల భద్రత కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేఅన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం షి టీం, పోస్టర్లను ఎస్పి ఆవిష్కరించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ, మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. మహిళలు సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్త గా ఉండాలన్నారు. ఆకతాయిలు మహిళలను, విద్యార్థినిలను వేధింపులకు గురిచేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని, ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీటీం వెంటనే స్పందిస్తుందని, మహిళలు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే షీటీం నంబరు 87126 58162కు కాల్ చేయాలన్నారు. ఇన్‌స్పెక్టర్‌రమేష్, షీటీం ఎస్ఐ ఫజల్ ఖాన్, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ దేవేంద్ర, డబ్ల్యూ పిసి శిరీష కానిస్టేబుల్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాపక్షం/తరిగొప్పుల: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగిఉండి మంచి నడవడికను కలిగి ఉండాలని, చదువులో రాణించాలని నర్మెట సీఐ ఎం అబ్బయ్య అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలిక, శిశు సాధికారత క్లబ్ అవగాహన పాఠశాల హెచ్ఎం బానోతు రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా నర్మెట సీఐ ఎం అబ్బయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు షీ టీం ఆవశ్యకత, డయల్ 100 వినియోగంపై అవగాహన కల్పించారు.మండల వైద్యాధి కారి నెల్లుట్లజానకిఏఎస్ఐ కాసర్ల రాజయ్య,హెడ్‌కానిస్టేబుల్ బాలాజీ, కానిస్టేబుల్‌సురేష్,ఉపాధ్యాయులు అనిత, మహ్మద్ యూసుఫ్ పాషాఉన్నారు.

కొనుగోళ్లలో అలసత్వం తగదు

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావిణ్య

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని, అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్స్, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, ఏకేపి, పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2024'25 వానాకాలం ధాన్యం కొనుగోలు, చెల్లింపు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 48ఐకేపి సెంటర్లు, 109 పిఏసిఎస్ మొత్తం 157 సెంటర్ల ద్వారా వానాకాలం సీజన్‌కు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.31 రైస్ మిల్లులకు కొనుగోలు కేంద్రాలను జియో ట్యాగింగ్ చేయడం జరిగిందన్నారు. రైతుల వద్ద నుండి వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే అన్‌లోడ్ చేసి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో త్వరితగతిన అప్‌లోడ్ చేసి సంబంధిత డ్రగ్‌సీట్‌ను కొనుగోలు కేంద్రాలకు పంపాలని సూచించారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులకు ఎఇఒలు టోకెన్లు అందజేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్డీవో నాగ పద్మజ, డీసీఎస్వో దేవరాయి కొమరయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ , పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఉప్పునూతుల మహేందర్, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాలలో పౌష్టికాహారం అందించాలి

దామెర : వసతిగృహాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని ప్రావిణ్య అన్నారు. మంగళవారం కలెక్టర్ దామెర మండలం క్రాస్ రోడ్‌వద్దగిరిజన సంక్షేమ బాలుర ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖి చేశారు. పాఠశాల గదులను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిలువ ఉంచిన బియ్యం, ఆహార పధార్థాలను పరిశీలించారు. కిచెన్‌షెడ్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారీని పరిశీలించి వంటకు పరిశుభ్రమైన నీటినివినియోగించాలనిమెనూప్రకారం భోజనం అందిం చాలన్నారు. పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి నారాయణ, దామెర తహశీల్దారు జ్యోతి వరలక్ష్మి, ఎంపిడి.ఓ శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత, ప్రధానోపాధ్యాయులుబైరుసురేందర్‌రెడ్డి,ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాపక్షం/ కమలాపూర్: మంగళవారం నమ్మదగిన సమాచారం మేరకు వరంగల్ టాస్క్ ఫోర్స్, కమలాపూర్ సిబ్బంది ఆధ్వర్యంలో పిడిఎస్ బియ్యంను అక్రమంగాఅశోక్ లేలాండ్ వాహనంలో రూ. 1,63,800 విలువ గల 42 క్వింటాళ్ళ బియ్యాన్ని పంగిడిపల్లి గ్రామానికి చెందిన ఆశల శ్రీకాంత్ తరలిస్తుండగా మర్రిపల్లి గూడెం గ్రామ శివారులో పట్టుకోని కేసు నమోదు చేశామని కమలాపూర్ ఎస్ఐ వీరభద్ర రావు తెలిపారు. అదే విధంగా కమలాపూర్ గ్రామ శివారులోని పంగిడిపల్లి రోడ్డులో గల సాంబశివ రైస్ మిల్లులో అక్రమంగానిల్వఉంచిన27క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం (రూ. 1,05,300) ను సీజ్ చేసి యజమాని బెజ్జంకిశ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని, అలాగే ఉప్పల్ గ్రామానికి చెందిన పుల్ల బాబు తన బంధువుల గ్రామం పంగిడిపల్లిలో సుమారు పది క్వింటాళ్ల బియ్యంను నిల్వ చేయగా వాటిని పట్టుకోని ఆ ముగ్గురిని అరెస్టు చేసి బెయిల్ పై విడుదల చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి నిందితులను శిక్షించాలి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఐఏఎస్ పై కొంతమంది రైతుల పేరు మీద జరిపిన దాడి, కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ యొక్క ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి మీద జరిగిన దాడిని హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ పక్షాన తీవ్రంగా ఖండిస్తూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జ్ లు ధరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా టీ ఎన్ జీ ఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్ష విధించాలని,జిల్లా అత్యున్నత అధికారైన కలెక్టర్ ప్రతీక్ ఐఏఎస్ మీద జరిగిన దాడి పట్ల ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల ముసుగులో కొంత మంది పక్క ప్రణాళికతో చేసిన సంఘటన గా పేర్కొంటూ అత్యంత పాశవికంగా కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ యొక్క ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి పై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు ఆకవరపు శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నప్పట్టికీ వాటిని పరిష్కరించుకునే మార్గం ఒకటి తప్పక ఉంటుందని పేర్కొంటూ దాడి ని ఖండించారు.తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం బాద్యులు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ట్రెస బాధ్యులు భాస్కర్ మాట్లాడుతూ ఎంతటి వారైనా సరే చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొవద్దని, అధికారుల మీద దాడులు చేయడం అంత్యత హేయమైన చర్య అని పేర్కొంటూ,ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చే స్వతంత్రం వుంటుందని,దాడులు సమస్యలకు పరిష్కారం కాదని అన్నారు.ధర్నా లో పాల్గొన్న జేఏసీ నేతలు మాట్లాడుతూ దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో డిఆర్ ఒ గణేష్, కలెక్టరేట్ ఎఓ గౌరీ శంకర్, టీఎన్‌జీఓస్ కార్యదర్శి బైరీ సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణు గోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నేతలు శ్యామ్ సుందర్,రాము నాయక్,సారంగ పాణి, మోయిజ్, లక్ష్మీ ప్రసాద్, గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు మురళీధర్ రెడ్డి,డాక్టర్ ప్రవీణ్,అన్వర్,శ్రీనివాస్ రెడ్డి,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు దాస్య నాయక్,రాజు, పెన్షనర్ల సంఘం నేతలు శంకర్,నారాయణ చారి, ఉద్యోగ సంఘాల నేతలు రాజమౌళి, సురేష్, అశోక్, రాజీవ్, అనూప్,ప్రణయ్,శ్రీనివాస్, యమున, పావని, శ్రీలత, రాజమణి, రజిత, నాగరాణి,స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌కు అతి ఉత్కృష్ట సేవా పతకం

మల్లారెడ్డి, మహేష్‌లకు అభినందనలు

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే అతి ఉత్కృష్ట సేవా పతకానికి కేయుసి పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న మల్లారెడ్డి తో పాటు హనుమకొండ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కే. మహేష్ ఎంపికయ్యారు. ఎంపికైనారు.అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన మల్లారెడ్డి దామెర మం డలం కొగిలివాయి గ్రామానికి చెందిన కాగా, 1990 సంవత్సరంలో పోలీస్ కానిస్టేబుల్ గా పోలీస్ శాఖ లో చేరి గూడూరు, కొత్తగూడ, సంగెం,సుబేదారి పోలీస్ స్టేషన్ లో పనిచేయడం పోలీస్, జిల్లా అధికారుల నుండి పలు రివార్డులు, ప్రశంస పత్రాలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నుండి సేవ, ఉత్తమ సేవా పతకాలను మల్లారెడ్డి అందుకున్నాడు. అలాగే హనుమకొండ జిల్లా, ఉప్పల్ కమలాపూర్ ప్రాంతానికి చెందిన మహేష్ 1996 సంవత్సరంలో కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలో చేరి సిసిఎస్, మీల్స్ కాలనీ, జనగామ పోలీస్ స్టేషన్ లో సమర్ధవంతంగా నిర్వహించి పోలీస్ అధికారుల నుండి రివార్డులతో పాటు జిల్లా కలెక్టర్ నుండి ప్రశంస పత్రాలను అందుకున్నాడు. అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన మల్లారెడ్డి,మహేష్ లను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

అసమానతలు తొలగించడమే సర్వే లక్ష్యం

కులగణన సర్వేలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

సర్వేను పరిశీలించిన వరంగల్ ఎంపి కడియం కావ్య

సర్వే పరిశీలన

ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీతో పాటు పలు కాలనీల్లో పర్యటించి కుల గణన సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్యుమరేటర్లకు 53 అంశాలకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాలన్నారు. ప్రతీ ఒక్కరు తమ వివరాలు అధికారులకు అందించి సహకరించాలన్నారు. సర్వేను పూర్తి పారదర్శకంగా, పక డ్బందీగా చేపట్టాలని అధికారు లకు సూచించారు. సంక్షేమ పథకాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి మేలు చేసేందుకే ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియ వల్ల సంక్షేమ పథకాలకు ఎలాంటి కోత పడదని ఎంపి స్పష్టం చేశారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ఆ సమాచారాన్ని మరొకరకంగా ఉపయోగించబడదని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 87 వేల మంది ఎన్యుమరేటర్ ఇంటింటికి తిరుగుతుంటే కొంతమంది దీనిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది అహంకారపూరితమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం ఎక్కడ ఆధార్, పాన్ కార్డు అడగడం లేదని, ఇష్టమైతేనే వివరాలు చెప్పొచ్చని, కులం చెప్పడం ఇష్టం లేకపోతే ఆప్షన్ ఉందని, ప్రభుత్వ జీవో 18 ప్రకారం సర్వేకు వస్తున్న ఎన్యూమరేటర్ల విధులకు ఆటంకం కలిగిస్తే చట్టం తన పని తను చేసుకోపోతుందని హెచ్చరించారు. ఇది బలవంతమైన సర్వే కాదని, బ్రతుకులు మార్చే సర్వే అని అన్నారు.

హనుమకొండ (దామెర) : హనుమకొండ జిల్లా దామెర మండలం తక్కళ్లపహాడ్‌లో సర్వేను కలెక్టర్ పి. ప్రావిణ్య మంగళవారం పరిశీలించారు. సర్వేకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్ కుటుంబ వివరాలు నమోదు చేస్తుండగా కలెక్టర్ అక్కడే ఉండి పరిశీలించారు. సర్వేలో అన్ని వివరాలు నమోదు చేయాలని ఎన్యుమరేటర్ కు కలెక్టర్ సూచించారు. పరకాల ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ, దామెర తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎన్యుమరేటర్లు, సర్వే సూపర్వైజర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తోకల కొమురారెడ్డి చిరస్మరణీయుడు

సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి

ప్రజాపక్షం/హసన్ పర్తి : అమరజీవి తోకల కొమురారెడ్డి స్ఫూర్తిగా తీసుకుందామని సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి అన్నారు. హసన్ పర్తి మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో మంగళవారం తోకల హంసారెడ్డి ఆధ్వర్యంలో తోకల కొమురారెడ్డి 49వ వర్ధంతి జరిగింది.సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి మాట్లాడుతూ దేశంలో సమ సమాజ వ్యవస్థ ఏర్పడాలని, భూస్వామ్య వ్యవస్థ అంతం కావాలని, రైతు రాజ్యం రావాలని నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్న సమయంలోభారత కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులై 1960లో సిపిఐ పార్టీలో చేరి హనుమకొండ తాలూకాలో పాలేరుల ,రైతాంగ సమస్యలపై బంజరు భూములు పంచాలని ఎల్లాపూర్ నివాసి అయిన కామ్రేడ్ పాడిమల్లారెడ్డి తో కలిసి ప్రజా పోరాటాలను ఉధృతం చేశారని అన్నారు.ఆ సమయంలో నాటి కాంగ్రెస్ గుండాల చేతిలో1979లో తోకల కొమురారెడ్డి హత్యకు గురి కావడం జరిగిందని తెలిపారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ తోకలకొమరారెడ్డి ప్రాణత్యాగం నేటి కార్మిక వర్గానికి స్ఫూర్తిదాయకం అన్నారు. 49 సంవత్సరాలుగా కామ్రేడ్ కొమరారెడ్డి వర్ధంతి చేయడం జరుగుతున్నదని పేర్కొన్నారు. తోకల కొమరారెడ్డి కుమారుడు హంస రెడ్డి శాంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తోకల హంసరెడ్డి, కొమురారెడ్డి మనుమడు కార్తీక్ రెడ్డి నివాళులర్పించారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, నిమ్మల కొమ్ముల గోపాలరావు, గోపరాజు అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మాతకు పంచరత్న హారతి

ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో దేవస్థానం ఆధ్వర్యంలో గోదావరి నదికి పంచ రత్న హారతి కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మంగళవారం గోదావరి హారతి వైభవంగా నిర్వహించారు. త్రివేణి సంగమ తీరం వద్ద ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో గోదావరి నదీమాతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పసుపు, కుంకుమ, సారె, చీరె, సుగంధ పరిమళ పుష్పాలు సమర్పించి గోదావరి హారతి నిర్వహించారు.నేటి ఏకాదశి నుండి కార్తీక పౌర్ణమి పర్వదినం వరకు ఐదు రోజుల పాటు గోదారమ్మకు అంగరంగ వైభవంగా పంచరత్న హారతి సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వర్గాలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలలో 'ఏకశిల' ఆణిముత్యాలు

ప్రజాపక్షం/వర్ధన్నపేట:హన్మకొండ జిల్లా ఐనవోలు మండ లం, ఖమ్మం హైవేలోని ఏకశిల సిబిఎస్ ఇ.అండ్ స్టేట్ స్కూ ల్స్ విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో విజయం సాధించారు. ఏకశిల విద్యా సంస్థల చేర్మన్ డాక్టర్‌తిరుపతిరెడ్డి విజేతలను అభినందించారు. అనంతరం విలేఖరులు సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏకశిల విద్యా సంస్థల అధినేత డాక్టర్ తిరుపతిరెడ్డి మాట్లాడారు. విద్యతో పాటు విద్యార్థుల ఆల్ రౌండ్ డెవలప్మెంట్ లక్ష్యంగా ఏకశిల విద్యా సంస్థలు పని చేస్తున్నాయన్నారు. ఆ తర్వాత స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జీ ఎఫ్ ఐ) వారు నిర్వహించిన ఫుట్ బాల్, హాండ్ బాల్, హాకి, బేస్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, కరాటే, రెజ్లింగ్, మొ. క్రీడా విభాగాలలో రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న, విజయం సాధించిన విద్యార్థులను తిరుపతి రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికలతో పాటు సర్టిఫికెట్స్ తో సన్మానించారు. నెట్ బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో ఎంపికైన 9వ తరగతికి చెందిన జి.నాగరాజుని మెమెంటో, సర్టిఫికేట్ ఇచ్చి శాలువాతో ఘనంగా అభినందించి, ఆశీర్వదించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి.బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవి కిరణ్, స్టాఫ్ ఇన్ చార్జీలు, పిఇటిలు నర్సయ్య, నరేశ్, రవీందర్, మనోజ్, రాజేష్, రజినీకర్, ప్రేమ్, సుభాష్, కళ్యాణి, రజిత పాల్గొన్నారు.

టెండర్లు పూర్తయిన పనులు ప్రారంభించాలి

జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం అభివృద్ధికి చేపట్టిన పనుల టెండర్లు ప్రక్రియ పూర్తయిన పనులను తక్షణమే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులనుఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో కాళేశ్వరం దేవాలయ అభివృద్ధి పనుల పురోగతిపై దేవస్థానం, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్, జాతీయ రహదారులు తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజ్ పనులు పూర్తి చేయుటకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కాళేశ్వరం బస్టాండ్ నుండి గోదావరి నది వద్దకు వెళ్ళు రహదారిలో ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్స్ ఉన్నందున సౌకర్యవంతంగా మార్చాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికార్లను ఆదేశించారు. గోదావరి ప్రధాన ఘాట్ వద్ద స్త్రీలు బట్టలు మార్చుకునే గదులు శాశ్వత ప్రాతిపదిక నిర్మించుటకు అంచనాలు తయారు చేయాలని, అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. అలాగే మెయిన్ ఘాట్ వద్ద సిసి రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. 100 గదుల సత్రం, అన్నదాన సత్రం పనులు పూర్తి చేయుటకు టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టాయిలెట్ బ్లాక్స్ పనులు పూర్తి చేయుటకు నిధులు మంజూరు చేశామని పనులు ప్రారంభించాలని ఆయన పేర్

దళారుల చేతిలోకి పత్తి దందా

సిసిఐ కేంద్రాలు ఆలస్యంతో
ధర తగ్గింపుత
క్వింటాల్ కు రూ.1000
నష్టపోతున్న రైతులు

ప్రజాపక్షం/మంచిర్యాల/జైనూర్: సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో మండలంలో ప్రైవేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.1000 నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈ సారి పత్తికి క్వింటాకు మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తామని ప్రకటించింది. కానీ అందుకు తగిన విధంగా సిసిఐ ద్వార కొనుగోలు ప్రారంభించక పోవడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు ప్రైవేట్ వ్యాపారస్థులకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ వ్యాపారులు రైతుల వద్ద నుండి పత్తిని రూ. 6,600 లకు కొనుగోలు చేస్తున్నారు. అంతేగాక తేమ, నాణ్యత లేదని కోతలు విధిస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. ఆరు గాలం కష్టించిన పంటకు ప్రైవేట్‌లో ధర లేక రైతాంగం ఆవేదన చెందుతోంది. చేతికి వచ్చిన పంటను నష్టనికి విక్రయించుకోలేక మదనపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకొని ఎంతో కొంత దిగుబడి సాధించినా పత్తి రైతులు అమ్మలా.. వద్దా..? అనే సందిగ్ధంలో ఉన్నారు. కొంత మంది రైతులు సిసిఐ కేంద్రాలు ప్రారంభమవుతాయనే నమ్మకంతో ఇళ్లల్లోనే పత్తి నిల్వలను ఉంచుకొని వేచి చూస్తున్నారు. పంట సాగుకు తెచ్చిన అప్పులు, వాటి వడ్డీలు పెరుగుతుండటంతో తక్కువ ధరకే దిగుబడిని విక్రయించాలని మరికొంత మంది రైతులు ఆలోచిస్తున్నారు. మండల కేంద్రంలో రెండు పత్తి మిల్లులు ఉన్నాయి. కేరమెరి, జైనూర్, సిర్పూర్‌యు, లింగాపూర్, అదిలాబాద్ జిల్లా లోని ఇంద్రవెల్లి , ఉట్నూర్, నార్నూర్, గాదిగూడా మండలాలకు చెందిన రైతులు ప్రతి యదాది జైనూర్ లోని పత్తి మిల్లులలో వారు పండించిన పత్తిని అమ్మకం చేస్తుంటారు. కానీ ప్రస్తుతం ఇప్పటికీ మిల్లుల యజమానులు పత్తి కొనుగోలు ప్రారంభించకపోవంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.లక్ష్మణచందా మండలం పీచర గ్రామ కొనుగోలు కేంద్రంలో మంగళవారం సహకార శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సందర్శించారు. కేంద్రంలో రైతులు తరలించిన ధాన్యం నిల్వలను,వాటి నాణ్యతను,మాయిశ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకువచ్చేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గన్ని బ్యాగ్స్,టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటదివెంట ధాన్యం కొనుగోళ్లు జరపాలని,సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఆర్డీవో రత్న కళ్యాణి, డీఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, డీఎస్ఓ కిరణ్ కుమార్,రైతులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్: తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్ర మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వరరావు లతో కలిసి ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి అధికారులను నియమించడం జరిగిందని, ఈనెల 28వ తేదీ వరకు ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 9, 10 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తుది ఓటరు జాబితాను జనవరి 6, 2025 రోజున ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు మొదటిసారిగా జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన ఓటరు జాబితా పరిశీలకులకు పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: నిజామాబాద్‌లో సబ్‌రిజిస్ట్రర్ కొరత ఉండటంతో భూక్రయవిక్రయాలకు ఆలస్యం జరుగుతుందని కొత్తగా వచ్చిన సబ్‌రిజిస్ట్రర్ లేనిపోని కొర్రీలు పెడుతూ పాత ఇళ్లకు సంబంధించి లింక్ డాక్యుమెంట్లు అడుగుతున్నారని, గతంలో రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లు, ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్ చేయకుండా అవుతున్నారని, ఎల్ఆర్ఎస్ ప్లాట్స్ రిజిస్ట్రేషన్లు చేయటం లేదని రియలెస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ విషయాన్ని జాయింట్ సబ్‌రిజిస్ట్రర్ 2 ను ప్రజాపక్షం ప్రతినిధి వివరణ కోరగా భూ క్రయ విక్రయదారులు అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రోజుకు నిర్దేశించిన లక్ష్యానికి లోబడి రిజిస్ట్రేషన్లు చేస్తున్నప్పటికీ కావలని కొందరు రియలెస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు ఆరోపణలు చేయటం సరికాదని సబ్‌రిజిస్ట్రర్ 2 సిహెచ్ శ్రీరామరాజు అన్నారు. డాక్యుమెంట్‌లో అవసరమైన పత్రాలు గుర్తింపు కార్డులు, లింక్ డాక్యుమెంట్‌తో పాటు క్రయవిక్రయదారులు కార్యాలయ పని వేళల్లో వస్తే సులువుగా రిజిస్ట్రేషన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రోజుకు 20 నుంచి 35 వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నామని, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని పుకార్లు ప్రజలు నమ్మొద్దని కోరారు. నాపై అసత్య ఆరోపణలు చేస్తూ ఛార్జీ మెమో జారీ చేసినట్లు తప్పుడు ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు.

చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: ఏబీవీపీ విద్యార్థి నాయకులపై దాడి చేయించిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాకేష్ పైన దాడి చేసిన సెక్యూరిటీ సిబ్బంది పైన చర్యలు తీసుకోవాలని నిర్మల్ ఎస్పీకి కలిసి వినతిపత్రాన్ని అందజేసిన ఏబీవీపీ నాయకులు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాసర త్రిబుల్ ఐటీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియా ఆత్మహత్యకు పాల్పడిందని విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకొని కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ నాయకులు శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థి నాయకుల పైన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర రాకేష్ ప్రైవేట్ సెక్యూరిటీని సబలిపి విచక్షణారహితంగా కర్రలతో దాడి చేయించడం జరిగింది.దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి నాయకుడు ప్రాణాపాయ స్థితిలో ఐసియు లో చికిత్స పొందుతున్న దీనికి సంబంధించి సెక్యూరిటీపై నామమాత్రంగా ఇద్దరినీ అరెస్టు చేశారు.కాబట్టి ఎవరైతే సెక్యూరిటీ సిబ్బంది. విద్యార్థి నాయకులపై దాడి చేశారో వారందరి పైన కఠిన చర్యలు తీసుకోవాలని, దాదాపు 15 నుంచి 20మంది సెక్యేరిటీ సిబ్బంది విద్యార్థి నాయకుల పై దాడి చేశారు. దాడికి సూత్రధారి అయి విద్యార్థి నాయకులపై దాడి చేయించిన సిఎస్ఓ రాకేష్‌ను వెంటనే సస్పెండ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి బి.కృష్ణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16, 17వ తేదీల్లో మెదక్ జిల్లా చెగుంటలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో కృష్ణ పాల్గొంటారని పాఠశాల హెడ్‌మాస్టర్ అనూష తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి అంబాజి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనూష, భూక్యా రమేష్, పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

ప్రజాపక్షం/పటాన్‌చెరు : నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ఆర్డీఓ కార్యాలయం రిజిస్ట్రేషన్ కార్యాలయం పాలిటిక్నిక్ కళాశాల ఏర్పాటు జిఓలను అమలు పరచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. శరవేగంగా అభివృద్ధి చెందిన పటాన్చెరు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని గత ప్రభుత్వ హాయంలో మంజూరైన రెవెన్యూ డివిజన్ ,పాలిటెక్నిక్ కళాశాల రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు తగిన సిబ్బందిని కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గానికి మంజూరైన రిజిస్ట్రేషన్ కార్యాలయం పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యాలయాలకు సంబందించి స్థలాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రిజిస్ట్రేషన్లు ఆర్డిఓ కార్యాలయం పనుల కోసం నిత్యం పటాన్‌చెరు ప్రజలు జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అతి త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీచ్చారు.

కుటుంబ సర్వేపై సందేహాలు వద్దు

ప్రజాపక్షం/కొల్చారం: మండల కేంద్రమైన కొల్చారంలో నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ కులగణన సర్వేపై సందేహాలు, అపోహలు అవసరం లేదని, ప్రజలు సర్వే ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం, కొల్చారం మండల కేంద్రంలో కుటుంబ సర్వేను సంబంధిత మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారి తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి, పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి మండల విద్యాధికారి కుటుంబ సమగ్ర సర్వే సూపర్వైజర్ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి అంజయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి :కలెక్టర్

ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి: జిల్లాలో పెద్ద ఎత్తున వరిధాన్యం దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రెంజల్ మండల కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ కేంద్రానికి రైతులకు తరలించిన ధాన్యం నిల్వలను వాటి నాణ్యతను పరిశీలించారు. మాయిశ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా రైతులు ధాన్యం తీసుకవచ్చేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సన్నరకం ధాన్యం సేకరిస్తుండటాన్ని గమనించిన కలెక్టర్ ఇప్పటివరకు ఎంత పరిమాణంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా సేకరించిన ధాన్యం నిల్వల వివరాలపై ఆరా తీశారు. ఈసారి ముందస్తుగా కోతలు పూర్తయిన రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలుకు సుమారు రూ.2200 ధర చొప్పున విక్రయించుకున్నారని కొంత ఆలస్యంగా పంట కోతలు జరిపిన రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెస్తున్నారని గతేదాదితో పోలిస్తే ప్రస్తుతం కొంత తక్కువగా పరిమాణంలో ధాన్యం వస్తోందని కేంద్రం నిర్వామకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గోనె సంచుల కొరత, రవాణాపరమైన ఇబ్బందులు వంటివి ఏమి లేవని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటదివెంట ధాన్యం కొనుగోళ్లు జరపాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్‌మిల్లులకు తరలించాలని ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ సాయగౌడ్, ఐకెపి డీపీయం సాయిలు, తహసీల్దార్ శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థిని మృతికి అధికారులే కారణం

ఆధారాలను తప్పుదోవ పట్టిస్తున్నారని
పోలీసులపై కుటుంబ సభ్యుల ఆరోపణ

ప్రజాపక్షం/ముధోల్ (బాసర): బాసర ట్రిపుల్ ఐటీలో సోమవారం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి ప్రియ కుటుంబ సభ్యులు యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమ పాప ఆత్మహత్యకు అధికారులే కారణమని విద్యార్థిని తలిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థిని మృతిపై ఆమె సోదరుడు అధికారులు, సిబ్బందిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. విద్యార్థిని ఆత్మహత్య చసుకున్న వెనువెంటనే ఆమె కుటుంబ సభ్యులు వచ్చిన మృతు దేహాన్ని యపోస్టుమార్టంకు ఎందుకు తరలించారని పోలీసులను నిలదీశారు. బాసర ఎస్పైకి అనుక్షణం సంప్రదింపుల్లో ఉండగా తమను కాదని మృతదేహాన్ని పోస్టుమార్టం కు పంపడం సరికాదని ఆయనపై వాపోయారు. తాము వచ్చే వరకు ఘటన జరిగిన ప్రదేశంలో అన్ని తారుమారు చేశారని విద్యార్థిని సోదరుడు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు, తాము రాక ముందు ఒకలా వచ్చిన తర్వాత ఘటన స్థల దృశ్యాలు వేర్వేరుగా ఉన్నాయన్నారు. విషయం తెలిసిన క్షణం నుండి పోలీసులతో ఎల్లప్పుడూ సంప్రదింపుల్లో ఉన్న మౌనంగా ఉండడం అనుమానాలకు తావిస్తోందని ఎద్దేవచేసారు. ఇప్పటికి బాసర ఎస్పైని సంప్రదిస్తున్న బదులివ్వడం లేదని నిరాశతో ఉన్నారు. ఏకంగా అమ్మాయి తల్లిదండ్రులు ఎస్పై కాలర్ పట్టుకుని ఆయన్ను ప్రశ్నించారు. అయిన అధికారులు, పోలీసుల నుండి సరైన సమాధానం రాకపోవడం ఎంతవరకు సమంజసమని విద్యార్థి నాయకులు ఆందోళనకు దిగారు. విద్యార్థిని మృతి పట్ల నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసుల దాడిలో గాయపడ్డ ఏబీవీపీ విద్యార్థి నాయకుడు నిజామాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల పట్ల అన్యాయం జరిగినట్లయితే తాము ఆందోళనకు దిగుతామని స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హెచ్చరించారు. అయితే విద్యార్థిని మాట్లాడిన కాల్ డేటా పూర్తిగా తెలిసిన తర్వాతే అత్మహత్యకు గల కారణాలు వెలువడుతాయని పోలీసులు, అధికారులు తెలుపుతున్నారు. విద్యార్థిని మృతికి గల కారణాలు స్పష్టంగా తెలిసేవరకు అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పడంతో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ మల్లేష్ విన్నవించారు.

ఎఐటియుసి 2వ మహాసభలు

ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం ఏఐటియుసి రెండవ మహాసభలు జిల్లా ప్రధాన కార్యదర్శి సభాధ్యక్షులు అయ్యవారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. బీడీ కార్మికుల కంపెనీలను తరలించే ప్రయత్నం మానుకొని. జీఎస్టీ వ్యవస్థను తగ్గించి బీడీ కార్మికుల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం సూతనంగా బీడీ కార్మిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షురాలుగా జీడి బాల్ లక్ష్మి, ఉపాధ్యక్షులు సంతోష,ప్రధానకార్యదర్శి అయ్యవారి లక్ష్మణ్, సాయక కార్యదర్శి అయ్యవారి విష్ణు, కోశాధికారి తిరునహరి భాగ్య, ఏఐటీయుసి రాష్ట్ర నాయకులు యూసఫ్, యేసు రత్నం, కేశవులు, నందం, అక్కిరెడ్డి రాజిరెడ్డి, కిష్టాపురం లక్ష్మణ్, ముక్రం వెంకటరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యం

ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని, క్రీడలు ఆడటంతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఎంతో ఎదుగుతారని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో ముందుండాలని, క్రీడల ద్వారా మానసికంగా ,శారీరకంగా ఎదగటానికి ఎంతో తోడ్పడుతుందని క్రీడల ద్వారా స్నేహ బంధాలు ఏర్పడుతాయని, క్రీడల్లో పోటీల్లో గెలిచి పాఠశాలకు మంచి పేరు తీసుకరావలని కోరారు. గెలిచిన వారు రాష్ట్రస్థాయి క్రీడలకు వెళుతారని ఓడిన వారు మళ్లీ ప్రయత్నించి విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, ఇందల్వాయి మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, సొసైటీ చైర్మన్ మల్లిఖార్జున్, పధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులో నగలు దొంగలించిన డ్రైవర్

చాకచక్యంగా వీడియో తీసి పట్టించిన
తోటి ప్రయాణికులు
డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించిన
ఆర్‌టిసి అధికారులు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ఆర్‌టిసి అద్దె బస్సులో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూనే దొంగ అవతారమెత్తాడు ఓ డ్రైవర్. ఇది అచ్చం కంచె చేను మేస్తే అనేలా ఉంది. ఆర్‌టిసి బస్సులో ప్రయాణం సురక్షితమని ప్రయాణీకులు భావిస్తారు. కానీ ఆర్‌టిసి బస్సులు నడిపే డ్రైవరే ప్రయాణీకుల వస్తువులు కాజేస్తే అలాంటి సంఘటన నిజామాబాద్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసేందుకు ప్రయత్నించి ప్రయాణీకులకు అడ్డంగా దొరికిపోయాడు. డ్రైవింగ్ చేస్తూనే తన వెనక సీట్‌లో కూర్చున్న ప్రయాణీకురాలి బ్యాగ్‌లో నుంచి అభరణాలను డ్రైవర్ రామ్మోహన్ రెడ్డి తిరస్కరించారు. దీనిని గమనించిన ప్రయాణీకులు చోరీ చేస్తున్న సంఘటనను వీడియో తీయటంతో డ్రైవర్ దొంగతనం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారించిన ఆర్‌టిసి అధికారులు ప్రయాణీకులు తీసిన వీడియో ఆధారంగా అద్దె బస్సు డ్రైవర్ రామ్మోహన్‌రెడ్డిని విధుల నుంచి తప్పించారు. ఇతను ఇక నుంచి రాష్ట్రం లోని ఏ డిపోలో కూడా విధులు నిర్వర్తించకుండా ఆర్‌టిసి అధికారులు ఇతర డిపోలకు ఆదేశాలు జారీ చేయటం గమనార్హం. వరంగల్ నుండి నిజామాబాద్ వస్తున్న ప్రయాణికురాలు తన అభరణాలతో కూడిన బ్యాగ్‌ను సీటు పక్కన ఉంచగా ప్రయాణీకురాలు చూడని విషయాన్ని గమనించిన ఆర్‌టిసి బస్సు డ్రైవర్ రామ్మోహన్‌రెడ్డి చాకచక్యంగా బ్యాగ్‌లోంచి ఆభరణాలు దోచుకున్న ఘటనను తోటి ప్రయాణీకులు వీడియో తీశారు. ఆ తర్వాత ప్రయాణీకురాలు తన బ్యాగ్ పోయిందని లబోదిబోమనటంతో వీడియో తీసిన ప్రయాణీకులు నీ బ్యాగ్‌లోని ఆభరణాలను డ్రవర్ దొంగలించాడని చెప్పటంతో డ్రైవర్‌ను నిలదీశారు. తాను దొంగతనం చేయలేదని బ్యాగ్ కింద పడిపోతే తీసి పక్కన పెట్టానని బుకాయించారు. దీంతో వీడియో తీసిన సంఘటనను డ్రైవర్‌కు చూయించటంతో తన తప్పు లేదని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వెంటనే అతని వద్ద నుండి బంగారం రికవరీ చేసి ప్రయాణీకురాలికి అప్పగించారు. తోటి ప్రయాణీకులు ఈ విషయాన్ని ఆర్‌టిసి అధికారుల దృష్టికి తీసుకపోవటంతో చర్యలు చేపట్టారు. డ్రైవర్ దొంగలించిన బంగారు ఆభరణాలు దాదాపు సుమారు 7 తులాల వరకు ఉంటుందని ప్రయాణీకురాలు వెల్లడించారు. తోటి ప్రయాణీకులు తీసిన వీడియోతో తాను పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు దొరికినందుకు ఆమె హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వైఫల్యం రైతుల ఆవేదనలు..

ప్రజాపక్షం/లోకేశ్వరం: లోకేశ్వరం మండలంలోని అబులాపూర్ ధర్మోర గ్రామాలలోని రైతులు ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ వరి పంటలు కొనుగోలు చేయకపోవడంతో సమగ్ర కుటుంబ సర్వే నిలిపివేశారు.ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి 25 రోజుల నుండి 30 రోజులు గడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రభుత్వం పై అసహనం వ్యక్తం చేశారు.నిరసనగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించారు.రైతులు ఆర్థిక పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని పంట నష్టపోయే పరిస్థితి ఉందని ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలని తెలియజేశారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ప్రజాపక్షం/బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం తహసీల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయ రెవెన్యూ ఉద్యోగులు ఇటీవల వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీలకు భూసేకరణ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్‌పై రెవెన్యూ ఉద్యోగులపై గ్రామస్తులు చేసిన దాడికి నిరసనగా రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడులు చేయడం సమంజసం కాదని, ప్రజాభీష్టాన్ని తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వర ప్రసాద్, ఆర్ఐ అశోక్, అంజు, సంగమేశ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులు జీవనోపాధి.. చేప పిల్లల పెంపకమే

ఎమ్మెల్యే సునీత రెడ

క్రీడ

సీక్రెట్ క్యాంప్‌లో భారత జట్టు ప్రాక్టీస్ సెషన్

స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన టీమ్ ఇండియా ఇప్పుడు మరో కీలక సమరానికి సిద్ధమవుతోంది. నవంబర్ 22 నుంచి ప్రతిష్టాత్మక బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కోసం రెడీ అయింది. ఇందుకోసం ఇప్పటికే భారత జట్టు ఆస్ట్రేలియాకు చేరుకుంది. అయితే ఈ ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియాలో భారత్ ఒక్క ప్రాక్టీస్ మ్యాచ్ కూడా ఆడట్లేదు. అయినా కూడా ఈ సిరీస్ ఎలాగైనా కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్న టీమ్‌ఇండియా ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. సీక్రెట్‌గా క్యాంప్‌లో రెండుసార్లు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) రన్నరప్‌గా నిలిచిన టీమ్ ఇండియా మరోసారి ఫైనల్ చేరాలని కసిగా ఉంది. టెస్ట్ ఛాంపియన్‌షిప్‌కు ముందు కీలక బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాలో అడుగుపెట్టింది. ఆస్ట్రేలియాలో వరుసగా రెండు ట్రోఫీలు గెలిచిన భారత్, హ్యాట్రిక్ విజయంపై కన్నేసింది. దీనికోసం ఆస్ట్రేలియాకు రెండు బ్యాచ్‌లుగా వెళ్లిన భారత జట్టు, ఇప్పుడు సీక్రెట్ క్యాంప్‌లో ట్రైనింగ్ ప్రారంభించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 22 నుంచి పెర్త్‌లో ప్రారంభం అవుతుంది. అయితే తొలి మ్యాచ్‌లో గెలుపొందేందుకు భారత క్రికెటర్లు పెర్త్‌లో సీక్రెట్ క్యాంప్‌లో ట్రైనింగ్ పొందుతున్నట్లు 'ది వెస్ట్ ఆస్ట్రేలియన్' నివేదిక పేర్కొంది. ఆప్టస్ స్టేడియం ప్రస్తుతం లాక్‌డౌన్‌లో ఉందని, ప్రాక్టీస్ సెషన్‌లను ప్రజలు వీక్షించేందుకు అవకాశం లేదని వెల్లడించింది. వాకా మైదానంలో భారత జట్టు సీక్రెట్ క్యాంప్ ఏర్పాటు చేసుకుని మరీ సిరీస్‌కు సన్నద్ధమవుతున్నట్లు ఆస్ట్రేలియా మీడియా తెలిపింది.

కఠినమైన ఆంక్షలు : భారత్ ప్రాక్టీస్ సెషన్‌లను ప్రైవేట్‌గా ఉంచారు. ప్రాక్టీస్ సెషన్‌లో ఫోన్‌ల వినియోగంపై, సహాయ సిబ్బందికి కఠిన ఆంక్షలు విధించారట. టీమ్ స్ట్రాటజీలు, శిక్షణా పద్ధతులు గోప్యంగా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. బయటి వ్యక్తులు ఫొటోలు, వీడియోలు తీయకుండా ఉండేందుకు నెట్స్‌తో ప్రాక్టీస్ చేస్తున్న ఏరియాను కవర్ చేశారు. అయినా కూడా కొంతమంది చాటుగా భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తున్న ప్రాంతానికి వెళ్లి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు.

ప్రాక్టీస్ మ్యాచ్ రద్దుపై రోహిత్ : రుతురాజ్ గైక్వాడ నేతృత్వంలోని ఇండియాఎ జట్టుతో భారత జట్టు ఇంట్రా సాక్వ్‌డ మ్యాచ్ ఆడాల్సింది. అయితే న్యూజిలాండ్‌తో హోమ్ టెస్ట్ సిరీస్ వైట్ వాష్ తర్వాత బీసీసీఐ ఈ మ్యాచ్‌ను రద్దు చేసింది. చివరి నిమిషంలో గాయాలపాలు కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ ఈ విషయంపై మాట్లాడుతూ 'ప్రాక్టీస్ మ్యాచ్ కాకుండా, మేము ఇండియాఎతో మ్యాచ్ సిమ్యులేషన్ లాంటిది ప్లాన్ చేశాం. మేం 19 మంది ఆటగాళ్లతో కూడిన జట్టుతో ప్రయాణిస్తున్నాం. మాకు కేవలం మూడు రోజులు మాత్రమే కేటాయించారు. ప్రతి ఒక్కరినీ సిద్ధం చేసే విషయంలో ఆ మూడు రోజుల్లో ఎంత పనిభారం మీద పడుతుందో తెలీదు. కాబట్టి ప్రాక్టీస్ మ్యాచ్ కన్నా మ్యాచ్ సిమ్యులేషన్ అనువుగా ఉంటుందని భావించాం. ఇలా అయితే ప్లేయర్‌లు ఎక్కువ సేపు బ్యాటింగ్ చేయగలరు, బౌలింగ్ చేయగలరు. ఆట సమయం సమస్య కాదు కాబట్టి ఇదే కంఫర్టబుల్‌గా ఉంటుంది.' అని వివరించాడు.

తొలి టెస్ట్ పిచ్ ఇదే : పెర్త్, ఆప్టస్ స్టేడియంలో మొదటి టెస్ట్ కోసం సిద్ధం చేసిన పిచ్ ఐకానిక్ వాకా మైదానం పిచ్ తరహాలో ఉంది. వాకా మైదానంలోని పిచ్‌లు పేస్, బౌన్స్‌కు అనుకూలిస్తాయి. ఆప్టస్ మ్యాచ్ కోసం ఎప్పటిలానే సంప్రదాయ బౌన్సీ పిచ్‌ను రూపొందించినట్లు ఆప్టస్ స్టేడియం హెడ్ క్యూరేటర్ ఐజాక్ మెక్‌డొనాల్డ్ తెలిపారు. గత ఏడాది ఇదే స్టేడియంలో పాకిస్థాన్‌తో జరిగిన టెస్ట్‌ను గుర్తు చేసుకున్నాడు మెక్‌డొనాల్డ్. అనూహ్యంగా బంతి బౌన్స్ అవ్వడం, పిచ్‌పై పగుళ్లు రెండు జట్లకు పరిస్థితులను కష్టతరం చేశాయి. ఇప్పుడు జరగబోయే మొదటి టెస్టులో ఇలాంటి పరిస్థితులనే మెక్‌డొనాల్డ్ అంచనా వేస్తున్నాడు. పిచ్‌లు పేస్, బౌన్స్‌కు అనుకూలిస్తుందని పేర్కొన్నాడు.

ఆసీస్ గడ్డపై గర్జించిన టాప్ 5 భారత టెస్ట్ కెప్టెన్లు

ఆసీస్ గడ్డపై టీమ్ ఇండియా తొలిసారి రోహిత్ శర్మ కెప్టెన్సీలో టెస్ట్ సిరీస్ ఆడబోతోంది. ఇటీవలే స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో భారత్ సిరీస్ కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు ఆస్ట్రేలియాలో రోహిత్ జట్టును ఎలా నడపిస్తాడు? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలానే ఇప్పటి వరకు ఆస్ట్రేలియా గడ్డపై ఎక్కువ టెస్టు విజయాలు అందుకున్న భారత్ కెప్టెన్ల గురించి కూడా చర్చలు మొదలయ్యాయి. మరి ఆస్ట్రేలియాలో అద్భుతమైన సక్సెస్ రేటు ఉన్న కెప్టెన్లు ఎవరు? వారిని రోహిత్ శర్మ అధిగమించే అవకాశం ఉందా? ఇప్పుడు చూద్దాం. అజింక్య రహానే ఆస్ట్రేలియాలో కెప్టెన్‌గా ఎక్కువ టెస్టు విజయాలు అజింక్య రహానే అందుకున్నాడు. అతడు నాలుగు టెస్టులకే కెప్టెన్‌గా వ్యవహరించినా, విజయాల శాతం 66.67గా ఉంది. అతడి కెప్టెన్సీలో భారత్ ఒక మ్యాచ్ డ్రా చేసుకోగా, మూడు విజయాలు అందుకుంది. 2020–21 సిరీస్‌లో రహానే కెప్టెన్సీలో భారత్ చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందుకుంది.

బిషన్ సింగ్ బేడీ –: స్పిన్ బౌలర్‌గా పాపులర్ అయిన బిషన్ సింగ్ బేడీ ఆస్ట్రేలియాలో ఐదు టెస్టులకు భారత్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతడి కెప్టెన్సీలో భారత్ రెండు గెలవగా, మూడు మ్యాచ్‌లు ఓడిపోయింది. బిషన్ సింగ్ బేడీ సక్సెస్ రేటు 40 శాతంగా ఉంది.

సునీల్ గావస్కర్ – : లెజెండరీ ప్లేయర్ సునీల్ గావస్కర్ ఆస్ట్రేలియాలో మూడు టెస్టుల్లో భారత్‌కు నాయకత్వం వహించాడు. ఇందులో ఒక విజయం, ఒక డ్రా, ఒక ఓటమి ఉన్నాయి. కెప్టెన్‌గా అతడి సక్సెస్ రేటు 33.33 శాతంగా ఉంది.

విరాట్ కోహ్లీ : ఆస్ట్రేలియాలో విరాట్ కోహ్లీ కెప్టెన్సీ ఢీ అంటే ఢీ అనే రీతిలో కొనసాగింది. అయితే దురదృష్టవశాత్తు కెప్టెన్‌గా విజయాల శాతం 28.57గానే ఉంది. కోహ్లీ ఆస్ట్రేలియాలో మొత్తం 7 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇందులో రెండు విజయాలు, మూడు డ్రాలు, రెండు ఓటములు ఉన్నాయి.

సౌరవ్ గంగూలీ : అగ్రెస్సివ్ కెప్టెన్సీకి మారుపేరైన సౌరవ్ గంగూలీ ఆస్ట్రేలియాలో నాలుగు టెస్టుల్లో భారత్‌కు నాయకత్వం వహించాడు. ఇందులో ఒక టెస్టులో విజయం సాధించగా, రెండు డ్రాగా ముగిశాయి. ఓ టెస్టులో పరాజయం తప్పలేదు. ఆస్ట్రేలియాలో కెప్టెన్‌గా గంగూలీ సక్సెస్ రేటు 25 శాతంగా ఉంది.

కంగువా లో ఒక సర్‌ప్రైజ్ రోల్ ?

ప్రస్తుతం తమిళ సినిమా నుంచి వస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం కంగువా కోసం అందరికీ తెలిసిందే. హీరో సూర్య నటించిన ఈ సినిమాని దర్శకుడు శివ భారీ హంగులతో తెరకెక్కించారు. ఇక ఈ సినిమా రిలీజ్ దగ్గరకు వస్తున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ కూడా చేస్తున్నారు. అలా లేటెస్ట్‌గా దర్శకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగువా సినిమాలో ఒక స్పర్జింగ్ ఎలిమెంట్ కోసం ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. కంగువా మొదటి ట్రైలర్ లాస్ట్ లో ఒక ఊహించని పాత్ర వస్తున్నట్లు చూపిన సంగతి తెలిసిందే. దీనితో ఆ రోల్ ఎవరిది ఎవరు కనిపిస్తున్నారు అనేది ఇంట్రెస్టింగ్ గా మారింది. మరి ఈ రోల్ చాలా స్పర్జింగ్ గా ఉంటుంది అని అదే పార్ట్ 2 కి లీడ్ చెయ్యడంలో ఎంతో కీలకంగా ఉంటుంది అని దర్శకుడు శివ చెబుతున్నారు. అది ఎవరు ఏంటి అనేది బిగ్ స్క్రీన్ పై చూసే తెలుసుకోవాలి అని శివ వెల్లడించారు. మరి అది ఎవరు ఏంటి అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించగా స్టూడియో గ్రీన్ వారు యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహించారు.

రీల్

పవర్‌ఫుల్ గా దేవకీ నందన వాసుదేవ ట్రైలర్..

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అశోక్ గల్లా హీరోగా మానస వారణాసి హీరోయిన్ గా దర్శకుడు అర్జున్ జంధ్యాల తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రమే దేవకీ నందన వాసుదేవ. మరి యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ అందించిన ఈ సినిమా నుంచి ఇపుడు మేకర్స్ సాలిడ్ ట్రైలర్ కట్ ని అయితే రిలీజ్ చేశారు. మరి ఈ ట్రైలర్ చూస్తే కథలో ప్రశాంత్ వర్మ మైథాలజీ టచ్ క్లియర్ గా కనిపిస్తుంది అని చెప్పాలి. ప్రపంచంలోనే అతి పెద్ద సుదర్శన చక్రం అంటూ మొదలైన ట్రైలర్ మంచి ఆసక్తి రేపుతోంది. అలాగే తన రోల్ లో అశోక్ గల్లా మాత్రం మంచి మాస్ అండ్ రగ్గెడ లుక్ లో కనిపిస్తున్నాడని చెప్పాలి. తన లుక్స్, యాక్షన్ ఇందులో బాగున్నాయి. అలాగే విలన్ పాత్రలో కనిపించిన నటుడు కూడా పవర్ఫుల్ గా ఉన్నాడు. ఇంకా భీమ్స్ ఇచ్చిన స్కోర్ ఇందులో బాగుంది. మరి మాస్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్ ని అలరించే విధంగా ఈ సినిమా ఉండేలా అనిపిస్తుంది. మరి ఈ సినిమా ఎలా ఉంటుందో తెలియాలి అంటే ఈ నవంబర్ 22 వరకు ఆగితే తెలిసిపోతుంది.



గేమ్ ఛేంజర్ టీజర్ కంప్లైంట్స్.. ఫ్యాన్స్ రిక్వెస్ట్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ అలాగే అంజలి హీరోయిన్స్ గా ఇండియన్ జేమ్స్ కేమరూన్ శంకర్ తెరకెక్కించిన అవైటెడ్ చిత్రమే గేమ్ ఛేంజర్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా నుంచి రీసెంట్ గానే లాంగ్ అవైటెడ్ టీజర్ ని మేకర్స్ రిలీజ్ కి తీసుకొచ్చారు. అయితే ఈ టీజర్ వచ్చాక భారీ రెస్పాన్స్ నమోదు అయ్యింది కానీ టీజర్ విషయంలో కొన్ని కంప్లైంట్స్ కూడా లేకపోలేవు. ముఖ్యంగా సంగీత దర్శకుడు థమన్ ఇచ్చిన స్కోర్ కొంతమేర ఓకే కానీ కొంతమేర మాత్రం ఆలెడీ ఎక్కడో విన్నట్టే ఉందని చాలా కామెంట్స్ వినిపించాయి. దీనితో సినిమాలో మాత్రం ఒక ఫ్రెష్ స్కోర్ కావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అలాగే కొన్ని సీన్స్ లో గ్రాఫిక్స్ కూడా క్లియర్ గా తెలిసిపోతున్నాయి. చరణ్ ఓల్డ్ గెటప్ లో నడుచుకుంటూ వచ్చే సీన్ లో అయితే ఇంకా తెలుస్తుంది. దీనితో ఆ మ్యూజిక్ అండ్ విజువల్ ఎఫెక్ట్ పరంగా మేకర్స్ కేర్ తీసుకోవాలని చరణ్ అండ మెగా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అయితే గతంలో థమన్ పలు సినిమాలకి టీజర్ లో ఒక్క స్కోర్ ఇచ్చినప్పటికీ తర్వాత సినిమాలో టోటల్ మార్చేశాడు. మరి ఈ సినిమాకి కూడా అలా మారిస్తే బెటర్ అని చెప్పాలి.

బయటపెట్టేందుకే ఢిల్లీకి

(మొదటి పేజీ తరువాయి)

26 సార్లు ఢిల్లీకి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 26 పైసలు కూడా తెలంగాణ రాష్ట్రానికి తీసుకురాలేదని, కానీ తాము ఢిల్లీకి వస్తే ఏం పని అని మంత్రి పొంగులేటి అంటున్నారని, కాంగ్రెస్ కుంభకోణాలు, చేతగానీ పాలనను దేశ ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు తాము ఢిల్లీకి వస్తే, అంత భయం ఎందుకని కెటిఆర్ ప్రశ్నించారు. సివిల్ స్కామ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీల లీలలను కూడా భయటపెట్టేందుకు తాము మళ్లీ, మళ్లీ ఢిల్లీకి వస్తామన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్ట్‌లను పెంచాలని ఆయన ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి చెందిన ఎనిమిది మంది ఎంపిలలో ఒక్క ఎంపి కూడా రేవంత్ రెడ్డికి వ్యవతిరేకంగా మాట్లాడటం లేదని ఆరోపించారు. ప్రతి ఒక్కరినీ కొనుగోలు చేయడం, ఎంఎల్‌ఎలను కొనడం, ఆయా రాం, గయా రాం కల్చర్‌ను ఇందిరా గాంధీ హయాం నుంచే కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని ఆరోపించారు. 'అమృత్' పేరుతో బావమరిదికేమో అమృతం పంచి,.కొడంగల్ వాసులకు మాత్రం విషం పంచుతానంటే అక్కడి ప్రజలు తిరగబడ్డారని అన్నారు. సిఎం అల్లునికి చెందిన ఫార్మా కంపెనీ కోసం కొడంగల్‌ను బలిపెట్టారన్నారు. రుణమాఫీ, రైతుబంధు, ఫించన్ల పెంపు, తులం బంగారానికి పైసలు లేవని, కానీ మహారాష్ట్ర ఎన్నికల్లో రూ. 300 కోట్లతో ప్రకటనలు ఇచ్చేందుకు పైసలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ మాట్లాడితే క్రోనీ క్యాపిటలిజంపై మాట్లాడాతారని, కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సిఎం పెద్ద ఎత్తున ప్రాజెక్ట్ లను క్రోని క్యాపిటలిజంకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఎటిఎంగా మారిందని ప్రధాని మోదీ చెబుతారని,కానీ చర్యలు తీసుకునేందుకు ఆయనను ఎవరు ఆపుతున్నారని అన్నారు.

గరిష్టస్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణం

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వుబ్యాంకు అంచనాలను ఈ ద్రవ్యోల్బణం మించిపోయి పెరిగింది. ఆహార వస్తువులు, శీతలపానీయాల విభాగంలోనే చాలా అత్యధికంగా ద్రవ్యోల్బణం పెరిగిందని అదితి నాయర్ అన్నారు. ఆహార వస్తువుల ధరలు గణనీయంగా పెరగడంతో రిజర్వుబ్యాంకు భరించగల నిర్దేశిత గరిష్ట ప్రామాణికతలను దాటిసిన రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబరు నెలలో 6.21 శాతం మేరకు పెరిగింది. అంతకుముందు సెప్టెంబరునెలలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ఈ రిటైల్ ద్రవ్యోల్బణం 5.49 శాతంగా నమోదుకాగా, ఏడాదిక్రితం ఇదేనెలలో ఈ ద్రవ్యోల్బణం 4.87 శాతంగా నమోదైంది. భారత రిజర్వుబ్యాంకు భరించగల గరిష్ఠస్థాయిా ద్రవ్యోల్బణం స్థాయి ఆరూశాతం కాగా, గత ఏడాది సెప్టెంబరు నుండీ ఈ ద్రవ్యోల్బణం అందుకు లోబడే దిగువనే తిరుగాడుతూ వస్తోంది. 2023 ఆగస్టులో భరించలేనంతగా ఈ ద్రవ్యోల్బణం 6.83 శాతానికి పెరిగింది. అందువల్ల రిజర్వుబ్యాంకు ప్రధానంగా ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయడంపైనే దృష్టి కేంద్రీకరించింది. రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగూశాతం వరకూ మాత్రమే పరిమితమై ఉండాలని, ఆ మేరకు తగిన కట్టడి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం రిజర్వుబ్యాంకుకు ఆదేశించింది. ఎన్ఎస్ఓ మంగళవారం విడుదల చేసిన డేటా ప్రకారం, పదిరోజులక్రితం ముగిసిన అక్టోబరునెలలో ఆహారవస్తువులకు సంబంధించిన ద్రవ్యోల్బణం 10.87 శాతంగా నమోదైంది. అంతకుముందు సెప్టెంబరునెలలో ఈ ద్రవ్యోల్బణం 9.24 శాతంగా ఉండగా, గత ఏడాది అక్టోబరులో 6.61శాతంగా ఉండేది. అఖిలభారత వినియోగ ధరల సూచీ ఆధారంగా ఏటేటా పెరిగే ద్రవ్యోల్బణం నిష్పత్తి ఈ ఏడాది అక్టోబరులో 6.21శాతంగా ఉండగా, గ్రామీణప్రాంతంలో ప్రసుత ద్రవ్యోల్బణ నిష్పత్తి 6.68 శాతంగా, పట్టణ ప్రాంతాలలో 5.62 శాతంగా నమోదైంది. పప్పుధాన్యాలు, సంబంధిత ఉత్పత్తులు, గుడ్లు, చక్కెర, చాక్లెట్లు, సుగంధ సంబంధిత ఉత్పత్తుల ధరల ద్రవ్యోల్బణం ఈ ఏడాది అక్టోబరునెలలో గణనీయంగా క్షీణించిందని ఎన్ఎస్ఓ డేటా తెలియజేసింది. రిజర్వుబ్యాంకు ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) మధ్యతరహాలో నిర్దేశించుకున్న 2–6 శాతం లక్ష్యాలను అధిగమించి ఈ ఏడాది అక్టోబరు నెలలో గడచిన 14 నెలల గరిష్ఠస్థాయికి వినియోదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందని ఆదితి నాయర్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం పూర్తయ్యేనాటికి ద్రవ్యోల్బణం ఎంపిసి అంచనాలు మించిపోతుందన్నారు. అక్టోబరులో జరిగిన ఎంపిసి సమావేశంలో రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులూ చేయలేదు.

ఆర్‌టిసి పిఎఫ్ గోల్‌మాల్‌పై చర్యలు

ఆర్‌టిసి మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆర్‌టిసి కార్మికుల రూ.1400 కోట్ల పిఎఫ్ మొత్తాలను దారి మళ్లించిన ఆర్‌టిసి ఎండిపై సెక్షన్ 14 ప్రకారం చట్టబద్ధమైన కఠిన చర్యలు చేపట్టాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు నుంచి పిఎఫ్ పేర రికవరీ చేసి ఆర్‌పిఎఫ్‌కు చెల్లించని సంస్థలపై తగిన చర్యలు చేపట్టి, ఆయా సంస్థల డైరెక్టర్లను అరెస్టు చేసి జైలుక పంపించిన మాదిరిగానే ఆర్‌టిసి ఎండిపై కూడా ఆర్‌పిఎఫ్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన కార్మికుల పిఎఫ్ ట్రస్టుకు రూ.1400 కోట్లపై ఇపిఎఫ్ఎం నిర్ణయించిన వడ్డీరేట్లను ఇన్వెస్మెంట్‌ల రూపంలో 9 శాతం వడ్డీలను, 12 శాతం పీనల్ వడ్డీలతో కలిసి సుమారు 1000 కోట్లను ఆర్‌టిసి నుంచి చెల్లింపులకు చర్యలు చేపట్టాలని ఆర్‌పిఎఫ్ కమిషనర్, సెంట్రల్ పిఎఫ్ కమిషనర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు.

త్వరలో ఆర్‌టిసి బస్సులు మాయం..

కాలుష్యాన్ని తగ్గించడానికి జంట నగరాలలో 3 వేల ఎలక్రికల్ బస్సులను ప్రవేపడతామనే రాష్ట్ర ముఖ్యమంత్రి మాటతో 75 శాతం ఆర్‌టిసి డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది కనుమరుగవుతారని, ఆర్‌టిసి అస్తిత్వం దెబ్బతింటుందని నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాలుష్యం తగ్గించాలని నిజాయితీ, నిబద్ధత ఉంటే నూతన ఇ బస్సుల కొనుగోళ్ల ఖర్చులో ప్రభుత్వం 60 శాతం భరించాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై.. దాడిని ఖండించిన ఉద్యోగ సంఘాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రాజెక్ట్ డైరెక్టర్, తహసీల్దార్‌లపై దాడిని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల జెఎసి, ఉద్యోగ, ఉపాధ్యాయ గెజిటెడ్ అధికారుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ దాడి కేవలం ప్రభుత్వ అధికారులపై మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యంపై సవాల్ విసిరిన చర్యగా భావిస్తున్నామని జెఎసి చైర్మన్ గోల్కొండ సతీష్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకర్ రావు, అదనపు సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేష్, కోచైర్మన్ సురేష్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశాంతంగా ప్రజాభిప్రాయాన్ని వ్యక్తపరచడానికి ప్రతి ఒకరికి హక్కు ఉందని, కానీ, కక్షపూరిత దాడులు చేయడం, చట్టాన్ని తుంగలో తొక్కడం ఆమోదించలేనిదన్నారు. గతంలో గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు ఉన్నప్పుడు ఇలాంటి దాడులు జరగడం చాలా అరుదన్నారు. గ్రామాల్లో పరిస్థితులను గమనిస్తూ, ప్రభుత్వానికి సరైన నివేదికలు పంపడం ద్వారా అధికారులు ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం ఉండేదన్నారు. కానీ ఇప్పటి పరిస్థితుల్లో గ్రామ స్థాయి రెవెన్యూ అధికారుల గైర్హాజరీ కారణంగా గ్రామాలకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయం దెబ్బతిందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దుచేసినందున, గ్రామస్థాయి సమాచారం ప్రభుత్వానికి చేరడం లేదని, తద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి లేకుండా ఉండటంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను తొలగించి, తన ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ప్రజలకు హాని చేసిందన్నారు. రాష్ట్రంలోని 12 లక్షల మంది ఉద్యోగుల పక్షాన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఏ విచారణకైనా రె'డీ'

(మొదటి పేజీ తరువాయి)

తెరతీసిన దోపిడీరావు కెటిఆర్ అని, కెటిఆర్ తెచ్చింది ఒరిజినల్ ఫార్ములా1 కాదని, అది పెద్ద డూప్లికేట్ అని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కెటిఆర్‌పై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిప్పులు చెరిగారు.

కెటిఆర్‌కు ప్రజాస్వామ్యం ఇప్పుడు గుర్తొచ్చిందా?

కెటిఆర్‌ను ఢిల్లీలో ఎవరు పట్టించుకుంటారని, మంత్రిగా అధికారంలో ఉన్నప్పుడు మోడీ లేదు బోడీ లేదని చెప్పిన కెటిఆర్‌కు ఇప్పుడు ప్రజాస్వామ్యం గుర్తొచ్చిందా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం పట్ల కెటిఆర్‌లో వచ్చిన మార్పు పెద్ద జోక్ అని, పదేండ్లు అధికారంలో ఉండి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలవడానికి చేతగాని కెటిఆర్ కేసుల మాఫీ కోసం కొత్త నాటకానికి తెరతీశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఆర్ఆర్ మంజూరై సంవత్సరాలు గడిచినా గడ్కరీని ఎందుకు కలవలేదని, ఎందుకు పనులు ప్రారంభించలేదని అడగలేదని ఆయన ప్రశ్నించారు. కెటిఆర్ ఫెమా, ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘించి కోట్లాది రూపాయలను డాలర్లుగా మార్చి కన్సల్టెన్సీల కడుపు నింపారని మంత్రి ఆరోపించారు. 'అమృత్ 2.0 టెండర్లలో అవినీతి గురించి కెటిఆర్ మాట్లాడడం ఈ శతాబ్దపు పెద్ద జోక్. సృజన్ రెడ్డి సిఎం రేవంత్‌రెడ్డికి తోక చుట్టమే. కానీ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితకు దశబ్దానికిపైగా బిజినెస్ పార్ట్‌నర్. ఇరిగేషన్ టన్నెల్ పనులు చేసిందివారే. దానికి కెటిఆర్ జవాబు చెప్పాలి' అని మంత్రి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సహకరించినందుకు సాయం చేయమంటున్నారు

పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలిచేలా సహకరించినందుకు తనను ఫార్ములా స్కామ్ నుంచి తప్పించమని అమిత్ షాను కలవడానికి కెటిఆర్ ఢిల్లీకి వెళ్లారని ఆయన అన్నారు. ఎనిమిది పార్లమెంట్ స్థానాల్లో బిజెపి అభ్యర్థులను పూర్తిగా సహకరించి గెలిపించినం.7 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయి త్యాగం చేసినం. మమ్మల్ని కేసుల నుంచి కాపాడాలని కెటిఆర్ ఢిల్లీకి పోయిండు తప్పితే అమృత్ టెండర్ల గురించి కాదు' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అటవీ ప్రాంతంలో, గిరిజనులు, ఆదీవాసీల సంక్షేమం కోసం పనిచేసిన ప్రతీక్ జైన్‌పై దాడి బిఆర్ఎస్ మానసిక స్థితికి నిదర్శనమన్నారు. ప్రతీక్‌పై దాడి చేసింది బీఆర్ఎస్ కార్యకర్త సురేష్‌ను అధికార యంత్రాంగం గుర్తించిందన్నారు. ఇప్పుడు భూసేకరణ గురించి మా ట్లాడుతున్న కెటిఆర్.. బిఆర్ఎస్ ప్రభుత్వ హా యాంలో ఒకే చోట 14 వేల ఎకరాలను ఫార్మాసి టీ కోసం సేకరించినప్పుడు ఏమి చేశారని మంత్రి ప్రశ్నించారు.

కీలక ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఎన్నికల హామీకి అనుగుణంగా అధ్యక్షుడిగా ఎన్నికైన వెంటనే పార్లమెంటును రద్దు చేశారు. దీంతో నవంబర్ 14న పార్లమెంటు ఎన్నికలు జరగున్నాయి. ఈ ఎ న్నికల్లో ఎక్కువ మ